ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

fb.com/vaartha Digital
తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
శ్రీకాకుళం
3-10-2026
శనివారం
సంపుటి: 32
సంచిక: 244
పేజీలు: 16 వెల: 6.50
Published from Srikakulam, Visakhapatnam, Vijayawada, Hyderabad, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem.

## 44యేళ్ల తర్వాత హాకీలో చైనాపై ఇండియా ఘనవిజయం





శుక్రవారం మదనపల్లెలో హార్టికల్చర్ హబ్‌ను ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్, సిఎం చంద్రబాబు, డి.సిఎం పవన్, మంత్రి లోకేష్, అనంత అంబానీ తదితరులు

## గాంధీజీ కలలను సాకారం చేస్తాం

2

కేంద్రమంత్రి నిర్మలసీతారామన్

### కరవుతో కాదు అభివృద్ధితోనే రాయలసీమకు గుర్తింపు

డి.సిఎం పవన్ కల్యాణ్

## ఆసియా క్రీడల్లో భారత్‌కు

# గోల్డ్ రష్

2 రజతం 2 కాంస్యం

## ఒకే రోజు ఆరు స్వర్ణాలు



### బాక్సింగ్‌లో లవ్లీనా, పర్వీన్, అంకుష్ 'గోల్డ్ పంచ్‌లు

### రెజ్లింగ్‌లో సుజీత్ 'స్వర్ణ పట్టు... ఆర్చరీలో మహిళల పసిడి 'గుర్తి

### పతకాల పట్టికలో భారత్ 76 మెడల్స్‌లో 5వ స్థానం

**ఐచినగోయా, అక్టోబరు 2:** ఆసియా క్రీడలలో 14వ రోజుల భారత్ 6 స్వర్ణ పతకాలతో ఒక అద్భుతమైన చారిత్రాత్మక రోజును ముగించింది. ఒకే రోజులో అత్యధిక స్వర్ణ పతకాలు సాధించడంలో ఇది భారత్‌కు అత్యుత్తమ >>2



మహిళల రికర్వ్ ఆర్చరీ జటు

| | |
|---|---|
| (అంకిత భకత్, కుంకుమ్ మోహోద్, కీర్తి శర్త | : స్వర్ణం |
| బాక్సింగ్ (మహిళల 75కిలోలు) లవ్లీనా | : స్వర్ణం |
| బాక్సింగ్ (మహిళల 65కిలోలు) పర్వీన్ | : స్వర్ణం |
| బాక్సింగ్ (పురుషుల 80కిలోలు) అంకుష్ | : స్వర్ణం |
| రెజ్లింగ్ (పురుషుల విభాగం) సుజీత్ | : స్వర్ణం |
| మహిళల హాకీ (సలీమా టెటె నేతృత్వంలోని జట్టు) | : స్వర్ణం |

# సిరుల సీమగా మారుస్తాం!

### ఉద్యానరంగ అభివృద్ధితో ఆర్థికాభివృద్ధి

అగ్రికల్చర్ స్కూల్ ద్వారా సేద్యంలో నైపుణ్యాలు పెంచుతాం

కేంద్ర సహకారాన్ని మరువలేం

గోదావరి- కావేరి అనుసంధానికి అనుమతివ్వాలని కేంద్రానికి విజ్ఞప్తి

గ్లోబల్ హార్టికల్చర్ హబ్, ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ శంకుస్థాపన సభలో సిఎం చంద్రబాబు

### రూ.లక్ష కోట్లతో గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌కు శ్రీకారం

రిలయన్స్ సంస్థ భాగస్వామ్యంతో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్

మదనపల్లెలో రెండు బృహత్తర ప్రాజెక్టులకు అంకురార్పణ

భూమిపూజ చేసిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్

నన్ను ఎపి బిడ్డగా భావించండి: అనంత్ అంబానీ

అనంత్ అంబానీ ఎపి ముద్దుబిడ్డ: సిఎం ఆలింగనం

**మదనపల్లె, అక్టోబరు 2 ప్రభాతవార్త:** కరవుసీమగా పేరున్న రాయలసీమను సిరుల సీమగా మారుస్తామని ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రక టించారు. 2024 ఎన్నికల్లో కూటమిని గెలిపించిన మరు క్షణం నుంచి ప్రజలకు మేలు చేయాలనే తలంపుతో ఉన్నామని, దాంట్లో భాగంగానే రాయలసీమలోని ఎనిమిది జిల్లాలు, ప్రకాశం, మార్కాపురం జిల్లాల్లోని ఉద్యాన రైతులకు మేలు చేసేలా గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌కు శ్రీకారం చుట్టామని చెప్పారు. అన్న మయ్య జిల్లా మదన పల్లెలో శుక్రవారం గ్లోబల్ హార్టికల్చర్ హబ్ (జిహెచ్‌హెచ్), ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ (ఐఎస్ఎ)కు శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా జరిగింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్య మంత్రి పవన్ కల్యాణ్, రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూ టివ్ డైరెక్టర్ అనంత్ అంబానీ, మంత్రి నారా లోకేష్ శిలాఫ లకాన్ని ఆవిష్కరించారు. రూ.లక్ష కోట్ల అంచనా వ్యయంతో గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌ను అభివృద్ధి చేయను న్నారు. కేంద్ర సహకారంతో రూ.40 వేల కోట్లు, ప్రైవేటు పెట్టుబ డులతో మరో రూ.60 వేల కోట్లను సమీకరించేలా ప్రణాళికలు రూపొందించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన బహి రంగ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ గ్రామాలే దేశానికి పట్టు గొమ్మలు అన్న మహాత్మాగాంధీ ఆశ యాన్ని సాకారం చేసే దిశగా రాయల సీమలో చారిత్రక కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సహకారంతో కరవుసీమను రూ.లక్ష కోట్లతో గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దుతు న్నామని చెప్పారు. ఉద్యాన రంగం ప్రాథమిక రంగం వృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోందని, ప్రస్తుతం సుమారు రూ.1.50 లక్షల కోట్ల జివిఎ అందిస్తున్న ఈ రంగం ద్వారా మరో రూ.లక్ష కోట్ల జివిఎను సాధిం చాలన్న లక్ష్యంతో ముందుకెళ్తున్నామని తెలిపారు. ఈ గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ద్వారా 5,860 గ్రామాలను 201 క్లస్టర్లుగా అభివృద్ధి చేయడంతో పాటు అదనంగా 6 లక్షల ఎకరాల్లో ఉద్యాన సాగును విస్తరించేలా ఈ ప్రాజెక్టులో కార్యాచరణ చేపట్టను న్నామన్నారు. రైతు లకు ఉత్పత్తి నుంచి మార్కెటింగ్, ప్రాసెసింగ్, ఎగుమ తుల వరకు సమగ్ర మద్దతు అందించడమే హార్టికల్చర్ హబ్ ప్రధాన ఉద్దేశమని సిఎం చంద్రబాబు చెప్పారు. పంటల స్థిరీకరణతో పాటు ధరల స్థిరీకరణకు చర్యలు తీసు కోను న్నామని తెలిపారు. యాపిల్, స్ట్రాబెరీ నుంచి అరటి, ఆవకాడో, కివీ, ఖర్జూరం వరకు వివిధ రకాల ఉద్యాన పంటలకు ప్రోత్సహం అందించనున్నట్టు ముఖ్య మంత్రి వెల్లడించారు. ఫుడ్ ప్రాసెసింగ్, అగ్రిటెక్, లాజిస్టిక్స్, అగ్రి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వంటి రంగా ను అభివృద్ధి చేసి రైతులకు మేలు చేసేవ్యవస్థలను అందుబాటులోకి తెస్తామని ముఖ్యమంత్రి ప్రకటిం చారు. సీడ్ టు షిప్‌మెంట్ >>2



## సిఎం పాదాలకు నమస్కరించిన అనంత్ అంబానీ

### ఊహించని పరిణామంతో ఆశ్చర్యపోయిన చంద్రబాబు

### ముగ్ధుడై అనంత్‌ను అభినందించిన ముఖ్యమంత్రి

**మదనపల్లె, అక్టోబరు 2 ప్రభాతవార్త:** ప్రముఖ పారిశ్రామికవేత్త, రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూ టివ్ డైరెక్టర్ అనంత్ అంబానీ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాదాలకు నమస్కరించి తన వినమ్రతను చాటుకున్నారు. పెద్దల పట్ల గౌరవాన్ని ప్రద ర్శిస్తూ ఆయన చేసిన ఈ పనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అన్నమయ్య జిల్లా కేంద్రం మదన పల్లెలో శుక్రవారం గ్లోబల్ >>2

## నదుల్లో వ్యర్థాలు వదలొద్దు

- పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత
- పరిశుభ్రత అలవాటుగా మారాలి - స్వచ్ఛతతోనే స్వర్ణాంధ్ర
- చెత్త సమస్య కాదు... సంపదగా మార్చే విధానంగా చూడాలి

ముఖ్యమంత్రి చంద్రబాబు

3లో

## విధులకు డుమ్మా..

# 70మంది వైద్యుల ఉద్వాసన

మరో 193మందిపై క్రమశిక్షణా చర్యలు

రాష్ట్ర ప్రభుత్వం సంచలనాత్మక నిర్ణయం

మంత్రి సత్యకుమార్‌కు డిఎస్‌హెచ్, డిఎంఇ నివేదిక

**అమరావతి, అక్టోబరు 2 ప్రభాతవార్త ప్రతినిధి:** సుదీర్ఘకాలం నుంచి విధులకు గైర్హాజరీలో ఉన్న 70 మంది వైద్యులను డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ (డిఎస్‌హెచ్) తొలగించింది. యేడాదికిపైగా అనధికారికంగా విధులకు గైర్హాజరీలో ఉన్న వీరికి ప్రభుత్వ సివిల్ సర్వీసు నిబంధనల ప్రకారం సంజాయిషీ నోటీసులు జారీ చేసి, ఇతర నిబం ధనలను అనుసరించి చివరి చర్యగా విధుల నుంచి తప్పించాలని శాఖాపరంగా నిర్ణయిం చినట్లు అధికారులు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు వివరించారు. రూల్ నంబర్ 20 ఆఫ్ ఎపిసిఎస్ (సిసిఎ) రూల్స్ 1991 అనుసరించి వీరిపై చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. సివిల్ అసిస్టెంట్ సర్జన్ హోదాలో ఉన్న వీరిలో గైనిక్, ఇఎన్‌టి, జనరల్ మెడిసిన్, ఇతర స్పెషాల్టీ వైద్యులు ఉన్నారని డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ చక్రధర్ బాబు తెలిపారు. మరో 154 మంది వైద్యులపై చర్యలు: డిఎస్‌హెచ్ పరిధిలోనే మరో 154 మంది వైద్యులు అనధికారికంగా విధులకు గైర్హాజరీలో ఉన్నారు. వీరి విషయంలోనూ నిబంధనలను అనుసరించి సంజాయిషీ నోటీసులను జారీ చేశారు. తదుపరి చర్యలు వివిధ దశల్లో ఉన్నా యి. నోటీసుల అనంతరం విధుల్లో చేరేందుకు ముందుకొస్తే ఇంక్రిమెంట్లలో కోత వంటి క్రమ శిక్షణా చర్యలను అనుసరించి అవకాశాలను కల్పి స్తున్నారు. ఇలా డిఎస్‌హెచ్ పరిధిలో అం తకుముందు 78మంది వైద్యులు >>2

## రేషన్ కార్డుదారులకు శుభవార్త

# చక్కెర, గోధుమ పిండి, కందిపప్పు పంపిణీ

**విజయవాడ, అక్టోబరు 2 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర ప్రజలకు కూటమి ప్రభుత్వం మరో శుభ వార్త చెప్పింది. ఇప్పటికే రేషన్ షాపుల ద్వారా సబ్సిడీపై బియ్యం పంపిణీ చేస్తుండగా ఇక మినీ మార్టుల ద్వారా చౌక ధరకే నిత్యావసర సరుకులు అందిస్తోంది. ఈ క్రమంలో ఎపి ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. కందిపప్పు, చక్కెర, గోధు పిండి, పామాయిల్ రాయితీ ధరపై పంపిణీ చేయాలని నిర్ణయం తీసుకుంది. ఉల్లి ధరలు పెరగడంతో రైతు బజార్లు ద్వారా వాటిని కిలో రూ.35కే ప్రభుత్వం విక్రయిస్తోంది. ఇప్పుడు అదే తరహాలో నిత్యావసర సరుకులైన గోధుమపిండి, కందిపప్పు, చక్కెర, పామా యిల్‌ను అతి తక్కువ ధరకే అందించనుంది. ఈ విషయాన్ని మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారికంగా ప్రకటించారు. బహిరంగ మార్కెట్లో నిత్యావసర వస్తువుల ధరలు ఇటీవల భారీగా పెరిగాయి. ఎల్‌నినో ప్రభావంతో ధరలు చుక్కలు చూపిస్తుండటంతో సామాన్యులు బెంబేలెత్తి పోతున్నారు.సామాన్యులకు ధరల భారం తగ్గిం చేందుకు ఏపీ ప్రభుత్వం చౌక ధరకే నిత్యావసర సరుకులను అందించనుంది. రేషన్ షాపుల ద్వారా కందిపప్పు, గోధుమ పిండి, చక్కెర, పామాయిల్ తక్కువ >>2



## అవినాష్ రెడ్డికి ఇడి నోటీసులు

### 14న విచారణకు రావాలని సమన్లు

### వైఎస్ వివేకా హత్య కేసులో మనీలాండరింగ్ కోణంలో ఇడి దర్యాప్తు

**పులివెందుల, అక్టోబరు 2 ప్రభాతవార్త:** మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కడప ఎంపి వైఎస్ అవినాష్‌రెడ్డికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) నోటీసులు జారీ చేసింది. అక్టోబరు 14న విచారణకు వ్యక్తిగతంగా హాజరు కావాలని ఇడి ఆదేశించినట్లు సమాచారం. వివేకానందరెడ్డి హత్యకు సంబంధించి జరిగినట్లు ఆరోపణలు ఉన్న రూ.40 కోట్ల ఆర్థిక ఒప్పందం, నగదు లావాదేవీలు, మనీలాండరింగ్ కోణంలో ఇడి దర్యాప్తు కొనసాగిస్తోంది. ఈ క్రమంలో ఇప్పటికే కేసులో నిందితులుగా ఉన్న ఎర్ర గంగిరెడ్డి, సునీల్ యాదవ్, ఉమాశంకర్‌రెడ్డితో పాటు అప్రూవర్‌గా మారిన షేక్ దస్తగిరిని ఇడి అధికారులు విచారించారు. ఈ కేసుకు సంబంధించి ఆగస్టు 21నఇడి హైదరాబాద్ జోనల్ అధికారులు హైదరాబాద్, కడపలోని ఏడు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. ఆ సమయంలో పలుపత్రాలు, డిజిటల్ పరికరాలతో పాటు >>2

## జంతర్‌మంతర్

# ఉద్రిక్తం

### సిఇసిని తొలగించాలంటూ ఆప్, సిజెపి నిరసనలు

### పలువురు నేతలను అదుపులోకి తీసుకున్న పోలీసులు



**న్యూఢిల్లీ, అక్టోబరు 2:** ఎన్నికల సంఘం, ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర పునఃపరిశీలన అంశంపై ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద శుక్రవారం నిరసనలకు పిలుపునిచ్చిన నేపథ్యంలో ఢిల్లీలో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు సౌరభ్ భరద్వాజ్, సంజీవ్ ఝా సహా పలువురు నిరసనకారులను ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా నిరసనలో పాల్గొనేందుకు ఆప్ నేతలు జంతర్ మంతర్‌కు చేరుకున్నారు. అక్కడ పోలీసులు వారిని అదుపులోకి తీసుకు న్నారు. పలువురు పార్టీ కార్యకర్తలు, నిరసనకారులను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిరసనకు అధికారిక అనుమతి ఇవ్వలేదని పోలీసులు చెబుతున్నారు. అయితే ఆప్ నేతలు శాంతియుతంగా నిరసన నిర్వహించేందుకు అనుమతి కోసం ముందుగానే దరఖాస్తు చేసుకున్నామని పేర్కొన్నారు. నిరసన చేపట్టడం తమ హక్కు అని వారు తెలిపారు.నిరసన నేపథ్యంలో జంతర్ మంతర్ పరిసర ప్రాంతాల్లో మొబైల్ ఇంటర్నెట్ సేవలను అధికారులు నిలిపివేసినట్లు నివేదికలు వెల్లడించాయి. భద్రతా ఏర్పాట్లలో భాగంగా జంతర్ మంతర్ చుట్టుపక్కల ప్రాంతాలను పలు జోన్లుగా విభజించి, ప్రతి జోన్‌కు సీనియర్ పోలీసు అధికారులను నియమించారు. పోలీసులు డ్రోన్ కెమెరాలతో పరిసరాలను పర్యవేక్షించడంతో పాటు సోషల్ మీడియా కార్యకలాపాలపై కూడా నిఘా ఉంచినట్లు సమాచారం. భద్రతా చర్యల్లో భాగంగా ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ 11 మెట్రో స్టేషన్లలో ప్రవేశం, నిష్క్రమణను తదుపరి ఆదేశాలు వచ్చే వరకు మూసివేసింది. అయితే కొన్ని స్టేషన్లలో ఇంటర్‌చేంజ్ సదుపాయం కొనసాగుతోంది. రాజీవ్ చౌక్, మండీ హౌస్, న్యూఢిల్లీ, సెంట్రల్ సెక్రటేరియట్ వంటి కొన్ని స్టేషన్లలో ఇంటర్‌చేంజ్ సదుపాయం అందుబాటులో ఉన్నట్లు అధికారులు తెలిపారు. నిరసన నేపథ్యంలో న్యూఢిల్లీ జిల్లాలో సెక్షన్ 163 కింద నిషేధాజ్ఞలు అమల్లోకి తీసుకొచ్చారు. జంతర్ మంతర్ వద్ద నిరసనకు ఢిల్లీ పోలీసులు అనుమతి ఇవ్వలేదని అధికారులు తెలిపారు. భద్రతా బలగాలను కూడా భారీగా మోహరించారు. జంతర్ మంతర్, జైసింగ్ రోడ్, అశోక్ రోడ్, ఫిరోజ్ షా రోడ్, జన్‌పథ్ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు, మళ్లింపులు అమల్లోకి వచ్చాయి. జంతర్ మంతర్ రోడ్డులో వాహనాల రాకపోకలను నియంత్రించడం లేదా ప్రత్యామ్నాయ మార్గాలకు మళ్లించారు. కనాట్ ప్లేస్ నుంచి పటేల్ చౌక్ వైపు, పటేల్ చౌక్ నుంచి జిపివో వైపు వెళ్లే వాహనాల రాకపోకల్లో కూడా అవసరాన్ని బట్టి మార్పులు చేసినట్లు >>2

## షైదుబాయి కెప్టెన్‌కు ప్రధాని మోడీ పరామర్శ

యోగక్షేమాలపై ఆరా

కష్ట సమయంలో హనుమాన్ చాలీసా పఠించానన్న కెప్టెన్ స్మిత్

5

## కలినిన్‌గ్రాడ్‌పై దాడిచేస్తే అణ్వాయుధ దాడి తప్పదు

యూరోప్ దేశాలకు పుతిన్ హెచ్చరిక



శుక్రవారం హైదరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో విరాళంను టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడుకు అందచేస్తున్న నోముల అశోక్ కుమార్

# ఎస్వీ ప్రాణదాన ట్రస్ట్‌కు రూ.1.02 కోట్ల విరాళం

**తిరుమల, అక్టోబరు 2 ప్రభాతవార్త ప్రతినిధి:** ధార్మికసంస్థ తిరుమల తిరుపతిదేవస్థానం నిర్వహిస్తున్న పలు పథకాలు, ట్రస్ట్‌లకు దాతలు తమవంతుగా విరాళాలు అందిస్తున్నారు. శుక్రవారం ఉదయం తెలంగాణ హైదరాబాద్‌కు చెందిన దాత నోముల అశోక్ కుమార్ ఎస్వీ ప్రాణదాన ట్రస్ట్‌కు రూ.1.02 కోట్ల విరాళాన్ని అందజేశారు. హైదరాబాద్‌లోని ఛైర్మన్ క్యాంపు కార్యాలయంలో టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడును కలిసి ఈ విరాళాన్ని అందించారు. ఈ సందర్భంగా దాత నోముల అశోక్ కుమార్‌ను ఛైర్మన్ అభినందించారు. ఎస్వీ ప్రాణదాన ట్రస్ట్ ద్వారా అందిస్తున్న సేవలకు సహకరిస్తున్న దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆశీస్సులు దాతకు, వారి కుటుంబ సభ్యులకు ఎల్లప్పుడూ ఉండాలని నాయుడు ఆకాంక్షి ంచారు.

# 70మంది వైద్యుల ఉద్వాసన

>> విధుల్లో చేరారు. **39 మంది వైద్యులకు తుది అవకాశం:** డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) పరిధిలో పనిచేస్తూ విధులకు హాజరుకాని 39 మంది వైద్యులకు ప్రభుత్వం తుది అవకాశం కల్పించింది. ఎలాంటి అనుమతి లేకుండా యేడాదికి పైగా, రెండేళ్లలోపు కాలంగా విధులకు గైర్హాజరవుతున్న వీరికి ఇప్పటికే షోకాజ్ నోటీసులు జారీ చేసినప్పటికీ స్పందించలేదు. విధుల్లోనూ చేరలేదు. సర్వీస్ నిబంధనలను అనుసరించి వీరికి తుదిగా అవకాశం కల్పిస్తామని, స్పందన లేకుంటే విధుల నుంచి తప్పిస్తామని డిఎంఇ డాక్టర్ విష్ణువర్ధన్ తెలిపారు. గైర్హాజరైన 39 మంది వైద్యుల్లో ఐదుగురు ప్రొఫెసర్లు, నలుగురు అసోసియేట్ ప్రొఫెసర్లు, 30 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉన్నారు. సంబంధిత అధికారులు మంజూరు చేసిన సెలవులు లేకుండానే వీరు విధులకు దూరంగా ఉన్నారు. గత మే నెలలో డిఎంఇ పరిధిలో 51 మంది వైద్యుల్ని విధుల నుంచి శాశ్వతంగా తప్పించారు. వైద్యులు విధుల్లో చేరిన తర్వాత ప్రైవేట్ ప్రాక్టీస్, పోస్టింగ్‌లు నచ్చక, ఆరోగ్య, కుటుంబ, ఇతర సమస్యల కారణంగా విధులకు దూరంగా ఉంటున్నారు. **గైర్హాజరీలు మొత్తం 493 మంది:** గైర్హాజరీల విషయంలో ఎటువంటి పరిస్థితుల్లోనూ ఉపేక్షించవద్దని, నిబంధనల ప్రకారం విధుల నుంచి తప్పించాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ సదరు హెచ్‌ఓడి అధికారులకు ఇటీవల స్పష్టమైన ఆదేశాలిచ్చారు. నిర్దిష్టమైన ప్రమాణాలను అనుసరించి గైర్హాజరీలో ఉన్నవారిని విధుల నుంచి తప్పించే ప్రక్రియను గరిష్టంగా 3 నెలల్లోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ విషయంలో అనవసరంగా నాన్చుడి ధోరణి అవలంబించొద్దని కూడా స్పష్టంగా చెప్పారు. అంతేకాకుండా అవసరాలకు అనుగుణంగా ఆ పోస్టులను కూడా 'జీరో వేకెన్సీ పాలసీ' కింద భర్తీ చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఇందులో భాగంగానే డిఎంఇ, డిఎస్‌హెచ్, ఇతర శాఖల అధికారులు వైద్యులను విధుల నుంచి తప్పించే చర్యలు చేపట్టారు.

**హెచ్‌ఓడి కార్యాలయాల వారీగా :** వైద్య, ఆరోగ్య శాఖ పరిధిలోని అన్ని హెచ్‌ఓడి కార్యాలయాల పరిధిలో కలిపి ఇటీవల తేల్చిన లెక్కల ప్రకారం 493 మంది వైద్యులు, ఇతర సిబ్బంది విధులకు దూరంగా ఉన్నట్లు గుర్తించారు. డిఎస్‌హెచ్, డిఎంఇ పరిధిలోని వారి సంఖ్య ఎక్కువగా ఉంది. ఎన్‌హెచ్‌ఎం (ఒప్పంద), ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ, ఆయుష్, ఔషధ నియంత్రణ పరిపాలనా శాఖ, డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీలో కొందరు గైర్హాజరీలో ఉన్నారు. ఈ 493 మంది గైరాజరీలపై సర్వీసు నిబంధనలు, క్రమశిక్షణ చర్యలు అనుసరించి తొలగింపుల వంటి ప్రక్రియను చేపట్టినట్లు మంత్రికి అధికారులు వివరించారు.

# రేషన్ కార్డుదారులకు శుభవార్త

>> ధరకు అందించనున్నారు. ఎపికి కేంద్రం 1.20 లక్షల మెట్రిక్ టన్నుల కందిపప్పును అందించేందుకు ముందుకొచ్చింది. వీటిని చౌక దుకాణాల ద్వారా పేదలకు తక్కువ ధరకు అందించనున్నారు. ఎల్‌నినో ప్రభావం వల్ల దేశవ్యాప్తంగా నిత్యావసర సరుకుల ధరలు భారీగా పెరిగాయి. పప్పు ధాన్యాలు, వంటనూనె, పంచదార ధరలు పెరగడంతో సామాన్యులకు నెలవారీ ఖర్చు పెరుగుతోంది. అటు ఉల్లిపాయల ధరలు కిలో రూ.60 నుంచి రూ.70కి చేరుకున్నాయి. దీంతో రైతు బజార్ల ద్వారా కిలో రూ.35కే ప్రభుత్వం అందిస్తోంది. ఆధార్ కార్డు లేదా రేషన్ కార్డును చూపించి ఉల్లిపాయలను కొనుగోలు చేయవచ్చు. ప్రతీ కుటుంబానికి నెలకు 2 కిలోల చొప్పున సబ్సిడీపై ఉల్లిపాయలు అందించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 130 రైతుబజార్లలో ప్రత్యేక కేంద్రాల ద్వారా ఉల్లిపాయలను సబ్సిడీ ధరలపై అందిస్తున్నారు. దీంతో ప్రజలు తమ ఆధార్, రేషన్ కార్డును చూపించి ఉల్లిపాయలను తక్కువ ధరకు తీసుకెళ్తున్నారు. కేంద్రం నుంచి త్వరలో 1.20 లక్షల టన్నుల కందిపప్పు రానుండగా.. వీటిని రేషన్ షాపుల ద్వారా పేదలకు అందించనున్నారు. ఇక కందిపప్పుతో పాటు గోధుమపిండి, చక్కెర, పామాయిల్ కూడా తక్కువ ధరకు పంపిణీ చేయనున్నారు. దీని వల్ల సామాన్యులకు నిత్యావసర సరుకుల భారం తగ్గుతుంది. గతంలో రేషన్ షాపుల ద్వారా చక్కెర, కందిపప్పు పంపిణీ చేయగా.. ఆ తర్వాత నిలిపివేశారు. ఇప్పుడు మళ్లీ ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా రేషన్ షాపుల్లో ఇవి అందుబాటులోకి వచ్చే అవకాశముంది.

## విశాఖ ఐటీ సెజ్ బీచ్‌లో ముగ్గురు విద్యార్థులు గల్లంతు

**విశాఖ (క్రైమ్), అక్టోబరు 2 ప్రభాతవార్త:** విశాఖపట్నం మధురవాడ ఐటీ సెజ్ (ఋషికొండ) తీరంలో సముద్రంలో ఈత కోసం దిగిన ముగ్గురు విద్యార్థులు గల్లంతయ్యారు. శుక్రవారం గాంధీ జయంతి నేపథ్యంలో పాఠశాలకు సెలవు కావడంతో మధురవాడ ప్రాంతానికి చెందిన ఆరుగురు బాలురు బీచ్‌కు ఈత కోసమని బయలుదేరి వెళ్లారు. వీరిలో మల్లయ్యపాలెంకి చెందిన ఎస్.సూర్యప్రకాష్(14)(శ్రీ వెంకటేశ్వర విద్యాపీఠ్,). ఎస్.నీలేష్ (14) (సృజన స్కూల్), పి.ప్రశాంత్(14) (సృజన స్కూల్) అలల తాకిడికి కొట్టుకుపోయారు. దీంతో మిగిలిన వారు ప్రమాదాన్ని గ్రహించి రక్షించాలని గట్టిగా అరిచారు. అక్కడ వారు తక్షణమే స్పందించి రక్షించేందుకు ప్రయత్నం చేశారు. పోలీసులకు కూడా సమాచారం అందించారు. సమాచారం అందుకున్న నార్త్ సబ్ డివిజన్ ఎసిపి అప్పలరాజు, పిఎంపాలెం సిఐ బాలకృష్ణ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. లైఫ్ గార్డ్‌లు, పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. **గల్లంతైన ప్రశాంత్ మృతదేహం లభ్యం:** సముద్రంలో గల్లంతయిన ముగ్గురు విద్యార్థుల్లో ప్రశాంత్ మృతదేహం శుక్రవారం సాయంత్రం దొరికింది. మిగిలిన వారికోసం గాలింపు చర్యలు చేపట్టారు. గల్లంతయిన విద్యార్థులను వెతికేందుకు సిపి ఆదేశాలతో స్కూబా డైవర్స్ కూడా సిద్ధమయ్యారు. ఘటన స్థలికి చేరుకున్న పోలీస్ కమిషనర్ శంఖ బ్రత బాగ్చి పరిస్థితిని అడిగి తెలుసుకుని తగిన సూచనలు చేశారు.

# జంతర్‌మంతర్ ఉద్రిక్తం

>> ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. టాల్స్టాయ్ మార్గ్, పార్లమెంట్ స్ట్రీట్ పరిసరాల్లో కూడా ఆంక్షలు విధించారు. ప్రయాణికులు వీలైనంత వరకు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని అధికారులు సూచించారు. ప్రత్యేక సమగ్ర పునఃపరిశీలన సర్ ద్వారా ఓటర్ల జాబితాల్లో మార్పులు, ఓటర్ల పేర్ల తొలగింపు జరిగిందని నిరసనకు దిగిన సంగతి తెలిసిందే.

# ముంబయిలో సిజెపి భారీ ఆందోళన

**ముంబయి, అక్టోబరు 2:** ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా ఆందోళనకు దిగుతున్నట్లు కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నేతలు ప్రకటించారు. ఓటు చోరీ ఆరోపణలపై ఆయన బాధ్యత వహించాలని, పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్ల సాధన కోసం అవసరమైతే జైలుకు వెళ్లేందుకూ సిద్ధమని తెలిపారు. శుక్రవారం ముంబైలోని శివాజీ పార్క్‌లో ఈ ఆందోళన చేపట్టనున్నట్లు వెల్లడించారు. 13 కోట్ల మంది ఓటర్ల ఓట్లను తిరిగి సాధించడానికి, సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను బాధ్యుడిని చేయడానికి జైలుకు వెళ్లాల్సి వచ్చినా వెనుకాడబోమని సీజేపీ సహ కన్వీనర్ అశుతోష్ రంకా అన్నారు. పెద్ద సంఖ్యలో ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగించారని ఆయన ఆరోపించారు. గతంలో చేపట్టిన ఆందోళన తరహాలోనే, డిమాండ్లు నెరవేరే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. మరో సహ కన్వీనర్ సౌరవ్ దాస్ మాట్లాడుతూ గతంలో జంతర్‌మంతర్ వద్ద యువత పెద్ద ఎత్తున ఉద్యమంలో పాల్గొన్న విషయాన్ని గుర్తుచేశారు. అదే స్ఫూర్తితో ముంబై నుంచి దేశవ్యాప్త ఆందోళన ప్రారంభించాలని నిర్ణయించినట్లు చెప్పారు. గాంధీ జయంతి సందర్భంగా యువత మరోసారి ఐక్యంగా ఉద్యమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఓటు హక్కుకు భంగం కలిగితే దేశంలో మార్పు సాధ్యం కాదని వ్యాఖ్యానించారు. బీజేపీకి చెందిన కొందరు కార్యకర్తలు ఆందోళనను అడ్డుకునేందుకు ప్రయత్నించారని దాస్ ఆరోపించారు. ఈ మేరకు సంబంధిత వ్యక్తుల ఫొటోలను కూడా అందించినట్లు చెప్పారు. ఆందోళనకు సంబంధించి ముంబై పోలీసులకు ముందస్తు సమాచారం ఇచ్చామని, వారి సహకారం ఉంటుందని ఆశిస్తున్నామని తెలిపారు. నిరసన శాంతియుతంగా నిర్వహిస్తామని, ఇక్కడి నుంచే దేశవ్యాప్త ఉద్యమానికి శ్రీకారం చుడతామని పేర్కొన్నారు.

# సిరులసీమగా మారుస్తాం!

>> వ్యవస్థల ద్వారా రైతులకు స్థిరమైన ఆదాయం కల్పించేలా కార్యక్రమాలను అమలు చేయనున్నామని సిఎం వెల్లడించారు.

**సాగునీరందిస్తాం... బంగారం పండించండి:** సాగునీరు అందిస్తే రాయలసీమ ప్రజలు బంగారం పండిస్తారని, మార్కెటింగ్ ద్వారా సంపద సృష్టిస్తారని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. హంద్రీ-నీవా, గాలేరు-నగరి తదితర సాగునీటి ప్రాజె క్టులను పూర్తి చేస్తున్నామని, రూ.3,500 కోట్లతో హంద్రీ-నీవా కాలువను పూర్తి చేసి కుప్పం వరకు నీటిని తీసుకెళ్లామని చెప్పారు. వెలిగొండ మొదటి దశను పూర్తి చేసి మా ర్కాపురానికి, పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లికి నీటిని అందించామని వివరించారు. మరో రూ.35 వేల కోట్లతో 36 ప్రాధాన్య ప్రాజెక్టులను మూడేళ్లలో పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని సీఎం తెలిపారు. రాయలసీమలో హంద్రీ-నీవా, మడ కశిర బ్రాంచ్ కెనాల్, మల్లెమడుగు, బాలాజీసాగర్, అప్పర్ పేరూరు తదితర ప్రాజెక్టులను పూర్తి చేస్తామన్నారు. వాతావరణ మార్పులు, ఎల్‌నినో వంటి పరిస్థితుల కారణంగా వ్యవసాయ రంగంలో సవాళ్లు పెరుగుతున్నాయని సిఎం అన్నారు. గోదావరిలో ఈ యేడాది కూడా సుమారు 1,600 టిఎంసిల నీరు సముద్రంలోకి వెళ్లిందని, పట్టిసీమ ద్వారా పదేళ్లలో సుమారు 500 టిఎంసిల నీటిని కృష్ణా డెల్టాకు తరలించామని తెలిపారు. కృష్ణా డెల్టాలో పొదుపు చేసిన నీటిని రాయలసీమకు తరలించడం నదుల అనుసంధానం వల్లే సాధ్యమైం దన్నారు. వచ్చే యేడాది పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి ప్రధాని మోడీ చేతుల మీదుగా జాతికి అంకితం చేస్తామని సిఎం తెలిపారు. పవర్ గ్రిడ్, రోడ్ గ్రిడ్, డిజిటల్ కనెక్టివిటీ మాదిరిగా వాటర్ గ్రిడ్ అవసరమని చెప్పారు. గోదావరి నుంచి కావేరి వరకు నీటిని అనుసంధానం చేసే అంశాన్ని కేంద్ర ఆర్థిక మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. గోదావరి- కావేరి అనుసంధానంతో రాయలసీమ కరవు తీరడంతోపాటు దక్షి ణాదిలోని 4 రాష్ట్రాల మధ్య నెలకొనే నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుం దని ముఖ్యమంత్రి అన్నారు. రిలయన్స్ సంస్థ సహకా రంతో మదనపల్లెలో ఏర్పాటు కానున్న ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ద్వారా వ్యవసాయం, ఉద్యా నవనం, ఆధునిక సాంకేతికత, పరిశోధన, కృత్రిమ మేధ వంటి రంగాల్లో నైపుణ్యాలను పెంపొందించేలా ఈ సంస్థను తీర్చిదిద్దనున్నట్టు వెల్లడించారు. ఐఐఎంలో మేనేజ్‌మెంట్ నిపుణులు, ఐఐటీలో సాంకేతిక నిపుణులు, ఐఎస్‌బిలో పారిశ్రామిక నైపు ణ్యాలు అభివృద్ధి చెందినట్లే ఐఎస్ఏ ద్వారా వ్యవ సాయ రంగంలో నాయకత్వ నైపుణ్యాలు కలిగిన నిపు ణులను తయారు చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యమని సీఎం చంద్రబాబు తెలిపారు.

**ఉక్కు మహిళ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల:** కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ రాష్ట్రానికి, దేశ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు అందిస్తున్న సహకారాన్ని సిఎం చంద్రబాబు ప్రత్యేకంగా ప్రస్తా వించారు. అమరావతి, విశాఖ ఉక్కు, పోలవరం తదితర ప్రాజెక్టులకు కేంద్రం సహకరిస్తోందన్నారు. దేశ నిర్మాణంలో నిర్మలా సీతారామన్ కీలక పాత్ర పోషి స్తున్నారని పేర్కొన్నారు. జీఎస్టీ నెక్స్ట్‌జెన్ సంస్కరణలు, డిబిటి ద్వారా సంక్షేమ పథకాల్లో పారదర్శకత, ఆర్థిక వ్యవస్థలో సంస్కరణల ద్వారా దేశాన్ని బలోపేతం చేస్తున్న ఉక్కు మహిళ నిర్మలా సీతారామన్ అని సిఎం అన్నారు. ఓ మహిళే ఇంటిని చక్కగా తీర్చిదిద్దే సత్తా మహిళకు మాత్రమే ఉంటుందని, అదే విధంగా దేశ ఆర్థిక వ్యవస్థను నిర్మలా సీతారామన్ తీర్చిదిద్దుతున్నారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఆమెకున్న నాయకత్వ పటిమను గుర్తించే ప్రధాని మోడీ ఆర్థిక శాఖ బాధ్యతలు అప్పగించారన్నారు. గ్లోబల్ హార్టికల్చర్ హాబ్‌కు నిధులు కేటాయించే విషయంలో నిర్మలా సీతారామన్ చూపిన చొరవను, ఇచ్చిన సహకారాన్ని మరువలేమన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఈ స్థాయిలో అభివృద్ధి- సంక్షేమం చేయగలుగుతోందంటే దానికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారం అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అలాగే మదనపల్లెలో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఏర్పాటుకు ముందుకు వచ్చిన రిలయెన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ అనంత్ అంబానీ తన పెద్ద మనస్సు ను చాటుకున్నారన్నారు. వ్యవసాయం, ఉద్యాన రంగాల్లో పరిశోధన, ఆధునిక సాంకేతికత, ఏఐ వినియోగంతో పాటు రైతులకు అవసరమైన మద్దతు వ్యవస్థలను అభివృద్ధి చేయడంలో రిలయన్స్ సంస్థ సహకారం అందించాలని సిఎం చంద్రబాబు కోరారు. సీడ్ టు షిప్‌మెంట్, అగ్రిటెక్, లాజిస్టిక్స్, అగ్రి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రంగాల్లో మరింతగా భాగస్వామ్యం కావాలని సూచించారు. తిరుమల శ్రీవారిపై భక్తితో ఇవి బస్సు లను సమకూర్చిన అనంత్ అంబానీ సేవలను సిఎం ప్రస్తావించారు. అలాగే అనంత్ అంబానీ వంతారా వంటి వ్యవస్థను ఏర్పాటు చేసి జంతువులకు సైతం సేవలు అందిస్తున్న గొప్ప పర్యావరణ ప్రేమికుడు అనంత్ అంబానీ అని కొనియాడారు. అనంత్ అంబానీ తన తాత, తండ్రుల వారసత్వాన్ని పుణికిపుచ్చుకుని వారి బాటలో నడుస్తున్నారని సిఎం చంద్రబాబు చెప్పారు.

**ప్రత్యేక ఆకర్షణగా అనంత్ అంబానీ:** రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ అనంత్ అంబానీ ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆంధ్రప్రదేశ్‌తో తన అనుబంధాన్ని చాటుకుంటూ భావోద్వేగంగా ప్రసంగించారు. తనను ఆంధ్రా బిడ్డగా భావించాలని, రాష్ట్రానికి తాను ఏం చేయగలనో మార్గనిర్దేశం చేయాలని ముఖ్యమంత్రిని కోరారు. గ్లోబల్ హార్టికల్చర్ హబ్, ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ కార్యక్రమంలో ఆయన ప్రసంగం ఆకట్టుకుంది. అనంత్ అంబానీ ప్రసంగం అనంతరం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ ఆయనను అభినందించారు. అనంతరం సిఎం చంద్రబాబు అనంత్ అంబానీని ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు. ఆతర్వాత ప్రసంగించిన ముఖ్యమంత్రి అనంత్ అంబానీ చెప్పిన మాటలను స్పందించారు. అనంత్ అంబానీని ఆంధ్రప్రదేశ్ ముద్దుబిడ్డగా భావిస్తున్నామని సిఎం వేదికపై ప్రకటించారు. రాష్ట్ర అభివృద్ధిలో రిలయన్స్ సంస్థ మరింతగా భాగస్వామి కావాలని ఆకాంక్షి ంచారు. ఈ సమావేశం సందర్భంగా సభలో వక్తల ప్రసంగాలకు ముందు ప్రత్యేక వీడియో ప్రజెంటేషన్ ఇచ్చారు. రాయలసీమలో ఉద్యాన రంగం అభివృద్ధి, రైతుల ఆదాయ పెంపు, నీటి వనరుల వినియోగం, ఆధునిక సాగు విధానాలు, ప్రాసెసింగ్, మార్కెటింగ్, ఎగుమతుల అవకాశాలను ఈ వీడియోలో వివరించారు. కార్యక్రమం అనంతరం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, సిఎం చంద్రబాబు, డెప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ మొక్కలను నాటారు. అలాగే ఉద్యాన రంగానికి సంబంధించి ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. ఈ సమావేశంలో మంత్రులు అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, బిసి జనార్దన్ రెడ్డి, రాంప్రసాద్ రెడ్డి, వివిధ శాఖల ఉన్నతాధికారులు, అన్నమయ్య జిల్లా ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## గాంధీజీ కలలను సాకారం చేస్తాం : కేంద్రమంత్రి నిర్మల సీతారామన్

అనంతరం కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ స్వదేశీ-స్వరాజ్యం అన్న గాంధీజీ జైజవాన్-.జైకిసాన్ అన్న లాల్‌బహదూర్‌శాస్త్రీ జయంతిని పురస్కరించుకొని రాయలసీమలో చారిత్రాత్మక ఘట్టం ఆవిష్కరణ అవుతోందన్నారు. రైతులు గురించి అటల్‌బిహారి, వాజపేయి వంటి నేతుల బాటలు వేశారన్నారు. అదే కోవలో ప్రధాన మోడీ కూడా కిసాన్ సమ్మాన్‌నిధి, ఎరువుల కొరత లేకుండా చూస్తున్నారన్నారు. రైతుల సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టారన్నారు. సాగు చేస్తున్న రైతులందరికి మంచిఆదాయం రావాలన్న ఆలోచనలతోనే ప్రధాని నిత్యం పనిచేస్తున్నారన్నారు. రాష్ట్రంలో పదిజిల్లాలు ప్రపంచ ఉద్యానకేంద్రంగా మార్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు. రైతులకు సహకారం అందించేలా ఇండియన్ స్కూల్‌ఆఫ్ అగ్రికల్చర్ రిలయన్స్ ఏర్పాటు చేస్తుందని, నేనుఆంధ్రప్రదేశ్‌కు కోడలు అని ఆడబిడ్డనుకాదని రాష్ట్రాభివృద్ధిపై తనకు ప్రేమ ఉంద న్నారు. రాయలసీమ రైతులుఎంతకష్టం వచ్చినా, వర్షాలు లేకపోయినా దృడసంకల్పంతో సాగు చేస్తారన్నారు.

## కరవుతో కాదు అభివృద్ధితోనే రాయలసీమకు గుర్తింపు:డి.సిఎం పవన్

కరవుతో పోరాడిన రాయలసీమను ఇకపైకరువుసీమగా కాకుండా ప్రపంచ స్థాయి ఉద్యానవన కేంద్రంగా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తెలిపారు. రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేసేందుకు రూ.లక్ష కోట్లతో సమగ్ర ప్రణాళికను అమలు చేస్తున్నామని తెలిపారు. రైతులకు సాగునీటి సదుపాయాలను మెరుగుపరచడంతో పాటు పంటలను మార్కెట్‌లకు వేగంగాతరలించేందుకు అవసరమైన రహదారులు ఇతర మౌలిక వసతులను చేస్తున్నామన్నారు. అనంతరం అందరూ కలసి మొక్కలునాటారు. ఉద్యానరంగానికి చేసిన స్టాల్స్‌ను సందర్శించారు.





శుక్రవారం మదనపల్లె సభకు హాజరైన ప్రజలు



శుక్రవారం లోక్‌భవన్‌లో మహాత్మాగాంధీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న ప్రధాని మోడీ

# బాపూజీ సందేశం వికసిత్ భారత్ నిర్మాణానికి బాటలు

## బాపూఘాట్‌లో గాంధీజీకి మోడీ నివాళి

**న్యూఢిల్లీ, అక్టోబరు 2:** జాతిపిత మహాత్మాగాంధీ ఆశయాలు ఎప్పటికీ మానవాళికి మార్గదర్శకంగా నిలుస్తాయని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు. సత్యం, అహింస, నిరాడంబరత, స్వదేశీ భావనలతో కూడిన బాపూజీ జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. గాంధీజీ చూపిన బాటలో నడుస్తూ మెరుగైన సమాజంతో పాటు వికసిత భారత్ నిర్మాణం దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. గాంధీ జయంతి సందర్భంగా శుక్రవారం మహాత్ముడికి నివాళులర్పించిన మోడీ ఆయన సందేశాలను గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా ఎక్స్ వేదికగా స్పందించిన ప్రధాని బాపూజీ శాశ్వత సందేశం మెరుగైన సమాజం, వికసిత భారత్ నిర్మాణానికి నిరంతరం దిశానిర్దేశం చేయాలని ఆకాంక్షించారు. గాంధీజీ జీవితం సత్యం, అహింస, కరుణ, సేవలకు నిలువెత్తు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రతి కాలంలోనూ మానవాళికి ఆయన జీవితం మార్గం చూపుతుందన్నారు. వీడియో సందేశంలోనూ గాంధీజీ గొప్పతనాన్ని మోడీ వివరించారు. అక్టోబరు 2 ప్రాధాన్యం దేశంలోని ప్రతి చిన్నారికీ తెలుసని అన్నారు. అధికారానికి దూరంగా ఉన్నప్పటికీ కోట్లాది మంది ప్రజల హృదయాల్లో గాంధీజీ ఇప్పటికీ నిలిచిపోయారని పేర్కొన్నారు. ఆయన సిద్ధాంతాల ప్రభావం మానవాళిపై ఉన్నంతకాలం ఆ ఆశయాలు స్ఫూర్తినిస్తూనే ఉంటాయని తెలిపారు. గాంధీజీ స్వదేశీ భావనకు ఎంతో ప్రాధాన్యమిచ్చారని, ఖాదీ దానికి ప్రధాన చిహ్నమని ప్రధాని గుర్తుచేశారు. గాంధీ జయంతి సందర్భంగా ప్రతి ఒక్కరూ ఖాదీ ఉత్పత్తులను కొనుగోలు చేయాలని కోరారు. స్వదేశీ వస్తువులను గర్వంగా వినియోగించాలని పిలుపునిచ్చారు.

# గోల్డ్ రష్

>> ప్రదర్శన. మహిళల రికర్వ్ ఆర్చరీలో 'స్వర్ణం'తో మొదలైన రోజు మహిళల హాకీలో చారిత్రాత్మక 'స్వర్ణం'తో ముగిసింది. భారత మహిళల హాకీ జట్టు 44యేళ్ల తర్వాత స్వర్ణ పతకాన్ని గెలుచుకుంది. ఐచినగోయాలో సలీమా టెటే నేతృత్వంలోని భారత జట్టు చైనాను 10తో ఓడించి చరిత్ర సృష్టించింది. మహిళల రికర్వ్ ఆర్చరీలో అంకిత భకత్, కుంకుమ్ మోహోద్, కీర్తి శర్మ దక్షి ణ కొరియాను ఓడించి చరిత్ర సృష్టించడంతో భారత్ రోజును స్వర్ణ పతకంతో ప్రారంభించింది. బాక్సింగ్‌లో లవ్లీనా బోర్గోహైన్ తన బౌట్‌లో గెలిచి రెండో పతకాన్ని అందించగా, ఆ తర్వాత పర్వీన్ హుడా కూడా పతకం సాధించారు. పురుషుల బాక్సింగ్‌లో అంకుష్ పంఘాల్ అద్భుతమైన దాడితో కూడిన ఆటతీరును ప్రదర్శించి స్వర్ణ పతకాన్ని గెలుచుకున్నారు. సుజీత్ కల్కల్ కుడియేవ్ (రెజ్లింగ్)పై స్వర్ణ పతక పోరులో గెలిచి ఐదవ పతకాన్ని అందించారు. ఆర్చరీలో మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్, పురుషుల రికర్వ్ జట్టు విభాగాల్లో కుంకుమ్, ధీరజ్ బొమ్మదేవర రెండు రజత పతకాలను అందించారు. అలాగే, సెయిలింగ్‌లో నేత్ర కుమనన్ కాంస్య పతకాన్ని, సెపాక్‌తక్రోలో పురుషుల క్వాడ్రాథ్లాన్ జట్టు కాంస్య పతకాన్ని సాధించాయి. 50 కేజీల విభాగంలో కాంస్య పతక పోరులో ఓడిపోవడంతో దీపాంశి మరో రెజ్లింగ్ పతకాన్ని తృటిలో కోల్పోయారు. భారత్ ఈ రోజును మొత్తం 10 పతకాలతో ఆరు స్వర్ణం, రెండు రజతం, రెండు కాంస్యం ముగించింది. దీంతో మొత్తం పతకాల సంఖ్య 76కి చేరింది. అలాగే, స్వర్ణ పతకాల పరంగా చూస్తే ఆసియా క్రీడలలో భారత్‌కు ఇది అత్యుత్తమ రోజులలో ఒకటి. ఆరు స్వర్ణ పతకాలను గెలుచుకోవడం ద్వారా భారత్ 8వ స్థానం నుండి 5వ స్థానానికి ఎగబాకింది.

## సిఎం పాదాలకు నమస్కరించిన అనంత్ అంబానీ

>> హార్టికల్చర్ హబ్, ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ శంకుస్థాపన కార్యక్రమం సందర్భంగా ఈ అరుదైన దృశ్యం చోటుచేసుకుంది. ఈ కార్యక్రమం ముగిసిన అనంతరం, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వేదికపై నుంచి వెళుతుండగా అనంత్ అంబానీ ఆయన వద్దకు వచ్చి పాదాలకు నమస్కరించారు. ఊహించని ఈ పరిణామంతో చంద్రబాబు కూడా ఆశ్చర్య పోయారు. అనంత్ అంబానీ చూపిన సంస్కారానికి, వినయానికి చంద్రబాబు ముగ్ధుడై అభినందించారు. ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి పట్ల దేశంలోని అగ్రశ్రేణి పారిశ్రామికవేత్త కుటుంబానికి చెందిన వ్యక్తి ఇంత గౌరవం ప్రదర్శించడంపై పలువురు ప్రశంసలు కురిపిస్తున్నారు.

## అవినాష్‌రెడ్డికి ఇడి నోటీసులు

>> రూ.24 లక్షల లెక్కల్లో చూపని నగదును, రెండు లాకర్ తాళాలను వైఎస్ అవినాష్‌రెడ్డికి సంబంధించిన ప్రాంగణం నుంచి స్వాధీనం చేసుకున్నట్లు ఇడి అధికారికంగా వెల్లడించింది. ఇదిలా ఉండగా, గతంలో దస్తగిరి గతంలో దస్తగిరి సమీప బంధువుగా పేర్కొంటున్న మున్నాకు సంబంధించిన బ్యాంకు లాకర్‌లో నగదు సిబిఐ స్వాధీనం చేసుకున్న అంశం కూడా దర్యాప్తులో భాగంగా పరిశీలనకు వచ్చినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. అయితే ఈ అంశాలకు సంబంధించి తుది నిర్ధారణ దర్యాప్తు పూర్తయిన తర్వాతే వెలువడాల్సి ఉంటుంది. **నోటీసులపై అస్పష్టత:** మరోవైపు, ఎంపి వైఎస్ అవినాష్‌రెడ్డి కార్యాలయ సిబ్బంది మాత్రం ఇప్పటివరకు తమకు ఎలాంటి ఇడి నోటీసులు అందలేదని తెలిపినట్లుసమాచారం. దీంతో అక్టోబరు 14నఅవినాష్‌రెడ్డి ఇడి విచారణకు హాజరవుతారా లేదా అన్నది స్పష్టత రావాల్సి ఉంది.

## 15 నుంచి ఈశాన్య రుతుపవనాలు

**హైదరాబాద్, అక్టోబరు 2, ప్రభాతవార్త:** ఈశాన్య రుతుపవనాలు అక్టోబర్ 15 నుంచి 21 మధ్య దక్షి ణ ద్వీపకల్ప భారత్‌లోకి ప్రవేశించే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండి) వెల్లడించింది. దేశంలోని దక్షి ణ ప్రాంతాల్లో వాతావరణ పరిస్థితులపై భారత వాతావరణ శాఖ కీలక అంచనాలను వెల్లడిం చింది. మరోవైపు ప్రస్తుతం కొనసాగుతున్న నైరుతి రుతుపవనాలు మరో రెండు, మూడు రోజుల్లో పూర్తిగా ఉపసంహరించుకునే అవకాశం ఉందని వెల్లడించింది. చెన్నైలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీలో శుక్ర వారం ఈశాన్య రుతుపవనాలపై వివిధ ప్రభుత్వ విభాగాల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో భారత వాతావరణ శాఖ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ మహాపాత్ర, తమిళనాడు రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ కమిషనర్ చంద్రమోహన్ పాల్గొన్నారు.

## వారం - వర్జ్యం

03-10-2026, శనివారం,
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
భాద్రపద మాసం, దక్షిణాయణం,
వర్ష ఋతువు, కృష్ణపక్షం, హస్త కార్తె,
తి.సప్తమి ఉ.8.00, అష్టమి తె. 5.52,
న. ఆరుద్ర రా.1.30,
వ.ఉ.10.49 -మ.12.20,
దు.తె .5.57-ఉ.7.33,
రాహు : ఉ.9.00- ఉ.10.30,
శుభ. స.ఉ.6.00-ఉ .7.00.

## వారఫలం

**మేషం :** చిన్ననాటి మిత్రుల నుండి ఆహ్వానాలు అందుతాయి. ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది.

**వృషభం :** శ్రమకు తగిన ఫలితం దక్కుతుంది. బాధ్యతలు ఉక్కిరిబిక్కిరి చేసిన సన్నిహితుల సహాయంతో పూర్తి చేస్తారు.

**మిథునం :** సహోదరి నుండి కీలక సమాచారం అందుతుంది. జీవిత భాగస్వామి నుండి ఆస్తి లాభం పొందుతారు.

**కర్కాటకం :** నూతనోత్సాహంతో పనులు పూర్తి చేస్తారు. ఆత్మీయులను కలిసి ఆనందంగా గడుపుతారు.

**సింహం :** ఆకస్మిక ధనలాభం పొందుతారు. ఋణబాధలు తొలగి ఊరట చెందుతారు. వస్తు, వస్త్ర, విలువైన ఆభరణాలు పొందుతారు.

**కన్య :** విద్య, ఉద్యోగావకాశాలు వుంటాయి. ఉద్యోగాలలో చిక్కులు ఎదురైనా అధిగమించి ముందుకు సాగుతారు.

**తుల :** ఇంట బయటా చికాకులు ఎదురైనా అధిగమించి ముందుకు సాగుతారు. జీవిత భాగస్వామి సలహాతో నూతన కార్యక్రమాలు చేపడతారు.

**వృశ్చికం :** శుభకార్యాలలో చురుకుగా పాల్గొంటారు. పాతబాకీలు వసులవుతాయి. ఆహ్వానాలు ఆశ్చర్యపరుస్తాయి.

**ధనుస్సు :** బంధు వర్గంతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. కాలభైరవాష్టకం పారాయణం చేయండి.

**మకరం :** ఇంటా బయటా ప్రోత్సాహం లభిస్తుంది.దూరప్రాంతాల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. కార్యజయం.

**కుంభం :** అదనపు బాధ్యతలు ఉక్కిరి బిక్కిరి చేస్తాయి. దూరపు బంధువులను కలిసి కష్టసుఖాలును పంచుకుంటారు.

**మీనం :** ముఖ్యమైన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. ఇంటర్వ్యూలలో విజయం సాధిస్తారు.ఆస్తి లాభం పొందుతారు.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

3-10Pg3exHMNWJQER.qxd:3-10Pg3exHMNWJQER.qxd 1/1/02 8:00 AM Page 1



# నదుల్లో వ్యర్థాలు వదలొద్దు

- పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత
- పరిశుభ్రత అలవాటుగా మారాలి - స్వచ్ఛతతోనే స్వర్ణాంధ్ర
- పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత, ఆలోచనల్లో శుభ్రత అవసరం
- చెత్త సమస్య కాదు... సంపదగా మార్చే విధానంగా చూడాలి
- రూ.1.30 లక్షల కోట్లతో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి
- స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర అవార్డ్స్-2026 సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- నెట్‌జీరోపై సిఎం సమక్షంలో ఐఐటి కాన్పూర్‌తో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎంఒయు



శుక్రవారం విజయవాడలో 'స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర అవార్డ్స్- 2026 కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులతో జ్యోతి ప్రజ్వలన చేయిస్తున్న సిఎం చంద్రబాబు, చిత్రంలో మంత్రి నారాయణ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి

**విజయవాడ, అక్టోబరు 2 ప్రభాతవార్త ప్రతినిధి:** నదులను పరిశుభ్రంగా ఉంచాలని, వ్యర్థాలు వదలొద్దని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. స్వచ్ఛత అనేది ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ఐదుకోట్ల మంది ప్రజలు భాగస్వాములై ఉద్యమ స్ఫూర్తితో ముందుకు సాగితేనే రాష్ట్రంలో శాశ్వత మార్పు సాధ్యమవుతుందని అన్నారు. విజయవాడలో నిర్వహించిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర అవార్డ్స్-2026 కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వచ్ఛతా వారియర్లు, స్వచ్ఛ గ్రామాలు, పట్టణాలు, పాఠశాలలు, ఆస్పత్రులు, సంస్థలు, ప్రాంగణాలు, ఎన్జీవోలకు అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ కృష్ణా, గోదావరి నదుల్లోకి వ్యర్థాలు, మురుగునీటిని వదిలేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దిగువ ప్రాంతాల్లో ప్రజలు నదుల నీటినే తాగునీటిగా వినియోగిస్తున్నారని తెలిపారు. నదులను కలుషితమైతే అది ఒక్క ప్రాంతానికే పరిమితం కాకుండా ఇతర ప్రాంతాలకు కూడా అపరిశుభ్రత ద్వారా ఉత్పన్న మయ్యే సమస్యలు వస్తాయని సిఎం చంద్రబాబు ఆందోళన వ్యక్తం చేశారు. నదుల కలుషితం వల్ల పర్యావరణంపై ప్రతికూల ప్రభావం పడుతుందని తెలిపారు. పర్యావరణానికి నష్టం చేసే చర్యల వల్లే ఎల్‌నినో లాంటి పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయని ముఖ్యమంత్రి చెప్పారు. ఎల్‌నినో ప్రభావంతో కృష్ణా నదికి నీరు రాని పరిస్థితి ఏర్పడిందని వివరించారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయి నీరు అందించడంతో పాటు మురుగునీటి శుద్ధికి రాష్ట్రవ్యాప్తంగా ఎస్టీపీలను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు.

**స్వచ్ఛత ద్వారా ఆరోగ్యాంధ్ర:** వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్యం, ఆలోచనల్లోనూ స్వచ్ఛత ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటిస్తే అనారోగ్యం దరి చేరదన్నారు. గాంధీజీ స్వాతంత్రం పోరాటంతో పాటు స్వచ్ఛతకు ప్రాధాన్యం ఇచ్చారని సిఎం పేర్కొన్నారు. కోల్‌కతాలో అపరిశుభ్రంగా ఉన్న మరుగుదొడ్లను చూసి ఆయనే స్వయంగా శుభ్రం చేశారని గుర్తు చేశారు. పరిశుభ్రత ఏ ఒక్క వర్గానికో సంబంధించిన అంశం కాదని, ఆరోగ్యం కోసం ఎవరి పరిసరాలను వారే శుభ్రంగా ఉంచుకోవాలన్నదే గాంధీజీ సందేశమని చెప్పారు.

**నెట్‌జీరో దిశగా ఎపి:** చెత్తను సమస్యగా చూడకుండా సంపద సృష్టించే వనరుగా మార్చుతున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. వ్యర్థాలతో విద్యుత్తు ఉత్పత్తి చేయడంతో పాటు ఎరువులు, బయోగ్యాస్ తయారుచేసి సర్క్యులర్ ఎకానమీ దిశగా రాష్ట్రాన్ని తీసుకెళ్తున్నామని చెప్పారు. ఘన వ్యర్థాల సేకరణ కోసం రాష్ట్రవ్యాప్తంగా స్వచ్ఛ రథాలను నిర్వహిస్తున్నామన్నారు. జీరో గార్బేజ్ లక్ష్యంతో ఈ-ఆటోలు, పుష్‌కార్టులు, మెకనైజ్డ్ రోడ్ స్వీపింగ్ యంత్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లలో నెట్‌జీరో కాన్సెప్ట్‌తో పనిచేస్తున్నామని సీఎం తెలిపారు. దీన్ని మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు కొత్త విధానాలను అధ్యయనం చేసేందుకు నెట్‌జీరో అంశంపై ఐఐటీ కాన్పూర్‌తో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఒప్పందం కుదుర్చుకున్నామని చెప్పారు. నగరాల్లో సిటీ క్లైమేట్ యాక్షన్ ప్లాన్ అమలు చేయడంతో పాటు మురుగునీటిని శుద్ధి చేసి తిరిగి వినియోగించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

**'స్వచ్ఛ చల్లపల్లి స్ఫూర్తితో రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాలు:** స్వచ్ఛ చల్లపల్లిని స్ఫూర్తిగా తీసుకుని రాష్ట్రవ్యాప్తంగా స్వచ్ఛతా కార్యక్రమాలను అమలు చేయాలని సిఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. చల్లపల్లిలో ప్రజల్లో స్వచ్ఛతపై చైతన్యం వచ్చి, అది అలవాటుగా మారడంతో పరిసరాల్లో చెత్త వేసే పరిస్థితి లేకుండా పోయిందని తెలిపారు. స్వచ్ఛతా కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన వారిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వ పరంగా 22 విభాగాల్లో 130 రాష్ట్రస్థాయి అవార్డులు, 2,044 జిల్లా స్థాయి అవార్డులు అందిస్తున్నట్లు సిఎం తెలిపారు. దేశవ్యాప్తంగా 12 వేల మంది క్రీడాకారులు, రన్నర్లు స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి సంఘీభావం తెలపడం అభినందనీయమన్నారు.

**స్వచ్ఛాంధ్ర అవార్డులు-విజేతలు:** స్వచ్ఛతా రంగంలో విశేషంగా సేవలందించిన స్వచ్ఛతా వారియర్లు, ఎన్జీవో సంస్థలకు సిఎం చంద్రబాబు స్వచ్ఛాంధ్ర-2026 అవార్డులు అందజేశారు. స్వచ్ఛ కాలనీలు, అసోసియేషన్లు, వివిధ సంస్థలకు కూడా అవార్డులు ప్రదానం చేశారు. హోటళ్ల కేటగిరీలో విశాఖ నోవోటెల్‌కు స్వచ్ఛతా అవార్డు లభించింది. రైతు బజార్లకు అవార్డులు ప్రకటించారు. విజయవాడ-పాయకాపురం, కర్నూలు- సీక్యాంప్, శ్రీకాకుళం-విల్లిస్ రైతు బజార్లకు స్వచ్ఛతా అవార్డులు అందాయి. తెనాలి, చిలకలూరిపేట, మంగళగిరి, పొన్నూరు, బొబ్బిలి, రాజాం, యలమంచిలి, పలమనేరు, గిద్దలూరు మున్సిపాలిటీలకు స్వచ్ఛతా అవార్డులు లభించాయి. కాకినాడ జిల్లాలోని కే.మూలపేట, రావులపాలెం, పత్తికొండ, దుప్పాడ, నంబూరు, ఆర్.ఎల్.పురం గ్రామ పంచాయతీలకు స్వచ్ఛ గ్రామ పంచాయతీ కేటగిరీలో అవార్డులు దక్కాయి. పాఠశాలల కేటగిరీలో నిడమర్రు జెడ్పీ హైస్కూల్, నెల్లూరులోని దేవిరెడ్డి శారదా హైస్కూల్, చంద్రంపాలెం జెడ్పీ హైస్కూల్‌కు స్వచ్ఛతా అవార్డులు వచ్చాయి. ఆస్పత్రుల కేటగిరీలో పెందుర్తి, ఇబ్రహీంపట్నం, ఆస్పరి, కొనకనమిట్ల పీహెచ్‌సీలకు అవార్డులు లభించాయి. మంగళగిరి ఇందిరానగర్, తిరుపతి, చిన్నవాడ, విశాఖ యుపిహెచ్‌సిలకు కూడా స్వచ్ఛతా అవార్డులు అందాయి. చిత్తూరు ప్రభుత్వ బాలుర హాస్టల్‌కు స్వచ్ఛతా అవార్డు లభించింది. కడపలోని బిసి బాలుర హాస్టల్, అనకాపల్లిలోని ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్‌కు అవార్డులు అందాయి. పల్నాడులోని అంబేద్కర్ గురుకులం, ఏలూరులోని బాలికల రెసిడెన్షియల్ పాఠశాల, బాపట్ల బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలకు స్వచ్ఛతా అవార్డులు దక్కాయి. విశాఖ ద్వారకానగర్ బస్టాండ్, చిత్తూరు ఎస్పీ కార్యాలయం, జీవీఎంసీ కార్యాలయం స్వచ్ఛతా అవార్డులను సాధించాయి. ఆలయాల కేటగిరిలో తిరుమల తిరుపతి ఆలయం, శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి ఆలయం, సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నరసింహస్వామి ఆలయాలకు స్వచ్ఛతా అవార్డులు చంద్రబాబు అందజేశారు. స్వచ్ఛాంధ్ర అవార్డుల ప్రదానోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రదర్శనను ముఖ్యమంత్రి తిలకించారు. ఈ కార్యక్రమంలో పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఎస్‌జిహెచ్ బ్యాంక్ లింకేజీలో ఆంధ్రప్రదేశ్ నం.1

- పారదర్శకత, సాంకేతిక సంస్కరణలతో మహిళా ఆర్థిక సాధికారతకు పెద్దపీట
- వడ్డీ రేట్లు, సర్వీస్ ఛార్జీల తగ్గింపుతో మహిళా సంఘాలకు ఆర్థిక ప్రయోజనం
- ఆధార్ బయోమెట్రిక్, యు ఆర్ఎన్ నిధుల దుర్వినియోగానికి చెక్: మంత్రి కొండపల్లి శ్రీనివాస్



**అమరావతి, అక్టోబరు 2 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దార్శనిక నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న వినూత్న సంస్కరణలతో స్వయం సహాయక సంఘాల బ్యాంక్ లింకేజీ కార్యక్రమం కొత్త దిశలో పయనిస్తోందని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్ఆర్ఎల్ఎం తాజా గణాంకాల ప్రకారం, సెప్టెంబరు15 నాటికి ఆంధ్రప్రదేశ్ రూ.15,229.40 కోట్ల రుణ పంపిణీ, రూ.82,639.56 కోట్ల రుణ నిల్వతో దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల కంటే ముందంజలో నిలిచిందని మంత్రి వెల్లడించారు. మహిళా స్వయం సహాయక సంఘాలకు అందుతున్న ఈ రుణాలు కేవలం తాత్కాలిక సహాయంగా కాకుండా, కుటుంబాల ఆదాయాభివృద్ధికి, స్థిరమైన జీవనోపాధికి, మహిళల ఆర్థిక స్వావలంబనకు దోహదపడేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. డిజిటల్ సంస్కరణలతో పారదర్శకత, ఆర్థిక భద్రత, ఆధార్ బయోమెట్రిక్ ప్రమాణీకరణ, సభ్యుల గుర్తింపు ధ్రువీకరణ ద్వారా నకిలీ సభ్యత్వాలు, నిధుల దుర్వినియోగానికి చెక్ పెట్టడం జరుగుతుందన్నారు. విశిష్ట రిజిస్ట్రేషన్ నంబర్ విధానంలో ప్రతి సంఘానికి ప్రత్యేక డిజిటల్ గుర్తింపునిచ్చి లావాదేవీల్లో పారదర్శకత పెంపొందిస్తామని మంత్రి తెలిపారు. రియల్‌టైమ్ డాష్‌బోర్డుల ద్వారా బ్యాంకు అధికారులు స్వయం శక్తి సంఘాల ప్రొఫైల్స్, గ్రేడింగ్, రుణ వివరాలను ఎప్పటికప్పుడు పరిశీలించే సదుపాయం ఏర్పాటుతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో 'బ్యాంక్ సఖీల్ల సహకారంతో మహిళలకు డిజిటల్ భద్రతపై అవగాహన కల్పిస్తామని మంత్రి పేర్కొన్నారు.

## నాటి యువగళం హామీ... నేడు నెరవేరింది ఇలా!

- పాదయాత్రలో రైతుల కష్టాలు చూసి అండగా నిలుస్తానని హామీ ఇచ్చిన లోకేష్
- కడప వేదికగా నాడు మిషన్ రాయలసీమ ప్రకటన
- నేడు మదనపల్లెలో గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌కు శ్రీకారం
- ప్రపంచానికి ఫ్రూట్ బౌల్‌గా మారబోతున్న ఆంధ్రప్రదేశ్





మదనపల్లెలో శుక్రవారం 'రాయలసీమ గ్లోబల్ హార్టికల్చర్ హబ్'కు శంకుస్థాపన సభలో ప్రసంగిస్తున్న మంత్రి లోకేష్, సభకు హాజరైన రైతులు, ప్రజలు

**అమరావతి, అక్టోబరు 2 ప్రభాతవార్త ప్రతినిధి:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చరిత్రలో మరే ఇతర నాయకుడు చేయని విధంగా యువనేత నారా లోకేష్ రాయలసీమలో 124 రోజులు, 44 అసెంబ్లీ నియోజకవర్గాలు, 1,587 కి.మీ మేర పాదయాత్ర చేసి రికార్డు సృష్టించారు. అ సమయంలో లక్షలాది మంది రాయలసీమ రైతులను నేరుగా కలిసి, వారుపడుతున్న ఇబ్బందులను ప్రత్యక్షంగా చూసి చలించిపోయారు. కష్టాలు చూశాను... కన్నీళ్లు తుడుస్తానని ఆనాడు సీమ రైతాంగానికి భరోసా ఇచ్చారు. పాదయాత్ర 119వ రోజున 2023 జూన్ 7న కడప వేదికగా మిషన్ రాయలసీమను ప్రకటించారు. హార్టికల్చర్ హబ్‌గా రాయలసీమను మారుస్తామని, సీమ సాగునీటి ప్రాజెక్టులు పూర్తిచేసి ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామనిచెప్పారు. మామిడి, బొప్పాయి, దానిమ్మ, చీనీ, అరటి తదితర పంటలు వేసేందుకు ప్రోత్సాహం కల్పిస్తామని, 90శాతం సబ్సిడీతో డ్రిప్ ఇరిగేషన్ అందిస్తామని తెలిపారు. దేశానికి, అంతర్జాతీయ స్థాయిలో ఎక్స్ పోర్టు చేసే విధంగా కొత్తరకం విత్తనాలు, మొక్కలు సృష్టించేందుకు హార్టికల్చర్ రీసెర్చి సెంటర్ ఏర్పాటు చేస్తానని ఆనాడు ప్రకటించారు. సీడ్ హబ్‌గా ఎపిని మార్చడం ద్వారా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తామన్నారు. రాయలసీమలో ఫుడ్ ప్రాసెసింగ్, పల్పింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తామని నాడు రైతులకు హామీ ఇచ్చారు. యువగళం పాదయాత్ర సందర్భంగా ఆనాడు రాయలసీమ రైతాంగానికి యువనేత లోకేష్ ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం ఈరోజు సాకారం చేసింది. ఉమ్మడి ప్రకాశం సహా రాయలసీమలో రూ. 1 లక్ష కోట్ల పెట్టుబడి ప్రణాళికతో గ్లోబల్ హార్టికల్చర్ హబ్ (జిహెచ్‌హెచ్)కు శ్రీకారం చుట్టింది. గ్లోబల్ హార్టికల్చర్ హబ్ అభివృద్ధి కోసం రాబోయే మూడేళ్లలో ప్రభుత్వం రూ.40,352 కోట్లు వెచ్చిస్తుంది. ప్రైవేట్ రంగం నుంచి రూ.60,000 కోట్లు పెట్టుబడులు రాబట్టేలా ప్రణాళికలు రూపొందించారు. సీడ్ టు షిప్ మెంట్ విధానంలో ఉద్యాన రైతులకు అండగా నిలిచేలా ప్రతిష్టాత్మక జిహెచ్‌హెచ్‌కు రూపకల్పన చేశారు. ఇందులో భాగంగా ఉద్యాన రైతులకు మేలు కలిగేలా పెద్ద ఎత్తున సాగునీరు, డ్రిప్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ పనులను ప్రభుత్వం చేపడుతుంది. రహదారులు, లాజిస్టిక్స్ అభివృద్ధి పనులకూ జిహెచ్‌హెచ్‌లో ప్రాధాన్యత ఇస్తారు. వ్యవసాయ, ఉద్యాన, ఆర్థిక, ఇరిగేషన్ సహా వివిధ కీలక శాఖలతో వరుస సమీక్షల పాటు ముఖ్యమంత్రి కేంద్రంతో నిరంతరం సంప్రదింపులు జరిపారు. రాయలసీమ పరిస్థితులను అర్థం చేసుకుని గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌కు నిధులు సమకూర్చేందుకు కేంద్రం అంగీకారం తెలిపింది. దీనిద్వారా ఉద్యాన సాగు విస్తరణ, పంట దిగుబడి మొదలుకుని ఎగుమతుల వరకు జరిగే వివిధ ప్రక్రియలను బలోపేతం చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ద్వారా రాయలసీమ దేశానికే కాక ప్రపంచానికే "ఫ్రూట్ బౌల్"గా మారుతుంది. ఉద్యానవన రంగం రైతుల ఆదాయాన్ని పెంచడం, గ్రామీణ ఉపాధిని సృష్టించడం, స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాలను సాధించడంలో కీలక చోదక శక్తిగా నిలుస్తుంది. ఒకప్పుడు కరువుకు పర్యాయపదంగా ఉన్న రాయలసీమ, మామిడి, అరటి, టమాటా, దానిమ్మ, ఖర్జూరం, డ్రాగన్ ఫ్రూట్, పుచ్చకాయ, నిమ్మ, స్వీట్ ఆరెంజ్, అవకాడో, ఆపిల్, బెర్రీస్ వంటి ఉద్యాన పంటలలో దేశంలోనే అగ్రగామిగా నిలవబోతుంది.

## వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ఎపి విద్యార్థులకు చోటు

- మంత్రి లోకేష్ హర్షం

**విజయవాడ, అక్టోబరు 2 ప్రభాతవార్త ప్రతినిధి:** వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు స్థానం దక్కించుకోవడంపై విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఆయన అభినందించారు. మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నిర్వహించిన 'స్వచ్ఛ పాఠశాల్ల కార్యక్రమంలో 170 పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నట్లు మంత్రి తెలిపారు. 35 వేల మంది విద్యార్థులు దాదాపు 75,000 కిలోల పొడి చెత్తను సేకరించి వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించారని వెల్లడించారు. ఈ సందర్భంగా రికార్డు సృష్టించిన విద్యార్థులందరికీ మంత్రి లోకేష్ శుభాభినందనలు తెలిపారు. విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛత, శ్రమదానం పట్ల అవగాహన కల్పించేందుకు 'స్వచ్ఛ పాఠశాల్ల కార్యక్రమాన్ని నిర్వహించినట్లు చెప్పారు. దీనిని అందరూ కలిసి ఒక యజ్ఞంలా చేపట్టి విజయవంతం చేశారని అన్నారు. ఈ 'స్వచ్ఛ పాఠశాల్ల కార్యక్రమం నిరంతరం కొనసాగాలని ఆకాంక్షిస్తున్నట్లు మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు.

## ఉపాధ్యాయుల కేడర్ ఖరారు

- రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు

విజయవాడ, అక్టోబరు 2 ప్రభాతవార్త ప్రతినిధి: ఉపాధ్యాయుల కేడర్‌ను ఖరారు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ కీలక ఉత్తర్వులు జారీ చేశారు. జిఒ 202 ద్వారా ఎంపిపి, జడ్పీ పాఠశాలల్లో పనిచేసే స్కూల్ అసిస్టెంట్లను జిల్లా కేడర్ ఉద్యోగులుగా నిర్దేశించారు. అలాగే జిఒ 201 ద్వారా మరో 27 రకాల టీచర్లను సైతం జిల్లా కేడర్‌లోకి చేర్చారు. అయితే ప్రభుత్వ, ఎంపిపి, జడ్పీ పాఠశాలల్లో పనిచేసే గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయుల పోస్టులను మాత్రం జోనల్ కేడర్‌గా ప్రభుత్వం నిర్ధారించింది.



## మహాత్ముడి మార్గమే మహోన్నతం

**ఏలూరు, అక్టోబంరు 2 ప్రభాతవార్త:** గాంధీజీ చూపిన శాంతి, అహింసా మార్గాలను నేటి యువత ఆదర్శంగా తీసుకుని దేశాభివృద్ధికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి పిలుపునిచ్చారు. గాంధీజీ జయంతి సందర్భంగా స్థానిక కలెక్టరేట్‌లోని గాంధీజీ విగ్రహానికి, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అహింసను ఆయుధంగా చేసుకుని దేశానికి స్వాతంత్రం సాధించిన మహనీయుడు గాంధీజీ అని కొనియాడారు. ఆయన ఆశయాలు, సిద్ధాంతాలను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. గాంధీజీ పరిశుభ్రతకు ఎంతో ప్రాధాన్యం ఇచ్చేవారని, స్వచ్ఛతను ప్రతి ఒక్కరూ తమ జీవితంలో భాగంగా చేసుకోవాలని కోరారు. జిల్లా జాయింట్ కలెక్టర్ డా. ఎం.జె. అభిషేక్ గౌడ, అసిస్టెంట్ కలెక్టర్ సిహెచ్. శ్రావణ్ కుమార్, ఇన్‌చార్జి డీఆర్వో ఎం. ముక్కంటి, కలెక్టరేట్ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## గాంధీ ఆశయాలను ఎన్డీఏ ప్రభుత్వం అమలు

**తిరుపతి, అక్టోబరు 2 ప్రభాతవార్త ప్రతినిధి:** స్వాతంత్ర్యం కోసం సత్య,అహింసనినాదంతో పోరాడిన మహాత్మా గాంధీ ఆశయాలను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆధ్వర్యంలోని ఎన్డీఏ ప్రభుత్వం అమలు చేస్తోందని తిరుపతి జిల్లా బిజెపి సీనియర్ నాయకుడు గుండాల గోపీనాథ్ రెడ్డి అన్నారు. అహింస అనే ఆయుధంతో దేశానికి స్వాతంత్రం తీసుకు వచ్చిన మహనీయుడు మహాత్మా గాంధీ అని గుర్తు చేశారు. పల్లెలే దేశానికి పట్టుకొమ్మలు అన్న గాంధీ ఆశయాలను ప్రధాని నరేంద్ర మోడీ అమలు చేస్తూ ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలుస్తున్నారని కొని ఆడారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం ఉదయం తిరుపతి ఆర్టీసీ బస్టాండ్ కూడలిలోని మహాత్మా గాంధీ విగ్రహానికి బిజెపి నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యుడు గుండాల గోపినాథ్‌రెడ్డి, నాయకులు మస్తాన్, దస్తగిరి రెడ్డి,లోక ప్రభాకర్ నాయుడు, తొండమ నాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, కట్టమంచి చంద్రబాబు యాదవ్, డిఎంకె గణేష్, విజయ భాస్కర్ రెడ్డి, పొన్నాల జేజిరెడ్డి, మిట్టపల్లి బ్రహ్మానంద రెడ్డి పాల్గొన్నారు.



## పిఎం సూర్యఘర్ పై ప్రత్యేక అవగాహన

**తిరుపతి, అక్టోబరు 2 ప్రభాతవార్తప్రతినిధి:** కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పిఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజనపై ప్రజల్లో అవగాహన కల్పించి, రూఫ్‌టాప్ సోలార్ విద్యుత్ వ్యవస్థల ఏర్పాటును ప్రోత్సహించేందుకు కృషి చేస్తున్నామని సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి శుక్రవారం తెలిపారు. ఎస్పీడిసిఎల్ పరిధిలోని 9 జిల్లాల్లో సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17వతేదీ వరకు 'సేవా సేతుఖ్ క్యాంప్ ను నిర్వహించడం జరుగుతోందన్నారు. పిఎంసూర్యఘర్ పథకం ద్వారా గృహ వినియోగదారులు తమ ఇళ్లపై రూఫ్‌టాప్ సోలార్ విద్యుత్ వ్యవస్థలను ఏర్పాటు చేసుకుని, సౌర విద్యుత్‌ను వినియోగించుకోవచ్చని తెలియజేశారు. తద్వారా సంప్రదాయ విద్యుత్‌పై ఆధారపడటాన్ని తగ్గించుకోవడంతో పాటు విద్యుత్ బిల్లుల భారాన్ని కూడా తగ్గించుకునే అవకాశం ఉంటుందని వివరించారు.

## భక్తులకు అంకితభావంతో సేవలందించాలి



**తిరుమల, అక్టోబరు 2 ప్రభాతవార్త ప్రతినిధి:** జాతిపిత మహాత్మా గాంధీ స్ఫూర్తితో టిటిడి ఉద్యోగులు మరింత నిజాయితీ, క్రమశిక్షణ, అంకిత భావంతో విధులు నిర్వహించాలని టిటిడి జెఇఒ ప్రభల గోపీనాథ్ సూచించారు. తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఆయన కోరారు. స్వచ్ఛత, పరిశుభ్రతకు మరింత ప్రాధాన్యతనివ్వాలని పిలుపునిచ్చారు. పరిపాలనా భవనంలోని సమావేశ మందిరంలో శుక్రవారం మహాత్మాగాంధీ జయంతి వేడుకలు నిర్వహిం చారు. జెఇఒ గోపీనాథ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది భక్తులు విశ్వాసంతో శ్రీవారి దర్శనానికి వచ్చే పవిత్రమైన టిటిడిలో పనిచేయడం అదృష్టమని, సేవా భాగ్యమని పేర్కొన్నారు. ప్రతి ఉద్యోగి మానవతా దృక్పథంతో భక్తులకు సేవలందించాలని సూచించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో సత్యం, అహింస మార్గాల ద్వారా ప్రజలను ఏకం చేసిన మహాత్మాగాంధీ సామాజిక అసమానతల నిర్మూలనకు, అన్ని వర్గాల అభ్యున్నతికి విశేష కృషి చేశారని తెలిపారు. గాంధీ ఆశయాలను ప్రతి ఒక్కరూ తమ జీవితాల్లో ఆచరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ విభాగం డిప్యూటీ ఇఒ ఆనందరాజు, తిరుపతి ఎస్టేట్ అధికారిణి సువర్ణమ్మ, తిరుమల ఎస్టేట్ అధికారి వేంకటేశ్వర్లు, సిఎఒ వేంకటరమణ, శ్వేత ఇన్‌చార్జి సంచాలకుడు డాక్టర్ వేమా వెంకట రత్నం, అధికారులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, పాల్గొన్నారు.



## ట్రాన్స్‌జెండర్ల మానవత్వం

### ఎచ్చెర్లలో 'సేవా సంకల్ప్' రక్తదాన శిబిరానికి విశేష స్పందన

**రణస్థలం (శ్రీకాకుళం జిల్లా), అక్టోబరు 2 ప్రభాతవార్త:** ప్రధాని మోడీ 25 యేళ్ల ప్రజాసేవా ప్రస్థానాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా చేపట్టిన 'సేవా సంకల్ప్ అభియాన్'లో భాగంగా శుక్రవారం ఎచ్చెర్ల క్యాంప్ కార్యాలయ ప్రాంగణం మానవతా పరిమళాలతో వికసించింది. స్థానిక శాసనసభ్యులు నడుకుదిటి ఈశ్వరరావు ప్రత్యేక చొరవతో నిర్వహించిన ఈ రక్తదాన శిబిరం ఒక చారిత్రక, ఆదర్శవంతమైన ఘట్టానికి వేదికగా నిలిచింది. సమాజంలో రక్తదానం ప్రాముఖ్యతను వివరిస్తూ, యువత ప్రాణదాతలుగా ముందుకు రావాలని ఎమ్మెల్యే ఎన్.ఈ.ఆర్ ఇచ్చిన పిలుపునకు నియోజకవర్గవ్యాప్తంగా అపూర్వ స్పందన లభించింది. యువత, పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి రక్తదానం చేశారు.

**స్ఫూర్తిగా నిలిచిన ట్రాన్స్‌జెండర్లు:** ఈ శిబిరంలో రణస్థలం మండలం మెంటాడ గ్రామానికి చెందిన ట్రాన్స్‌జెండర్లు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేయడం అందరినీ విశేషంగా ఆకట్టుకుంది. సమాజంలో తాము ఎవరికీ తీసిపోమని, ఆపదలో ఉన్న తోటి మనుషుల ప్రాణాలను కాపాడటంలో తామూ ముందే ఉంటామని వారు చాటి చెప్పారు. రక్తానికి కులం, మతం, లింగభేదాలు ఉండవని, ప్రాణాన్ని కాపాడే గుణం మాత్రమే ఉంటుందని వారు నిరూపించిన తీరు శిబిరానికి వచ్చిన ప్రతి ఒక్కరినీ భావోద్వేగానికి గురిచేసింది. సమాజపు ఆలోచనా దృక్పథాన్ని మార్చేలా వారు చూపిన ఈ చొరవ అందరికీ ఆదర్శప్రాయంగా నిలిచింది.

**అభినందించిన ఎమ్మెల్యే ఎన్.ఈ.ఆర్:** శిబిరంలో రక్తదానం చేసిన ట్రాన్స్‌జెండర్లను ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు స్వయంగా శాలువాలతో సత్కరించి, ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ట్రాన్స్‌జెండర్లు చూపిన సేవాభావం వెలకట్టలేనిది. సమాజానికి నిజమైన స్ఫూర్తిప్రదాతలు మీరెంటూ ప్రాణదానంలో భాగస్వాములైన మీ గొప్ప మనసుకు హృదయపూర్వక ధన్యవాదాలంటూ కొనియాడారు. ఈ రక్తదాన శిబిరంలో పాల్గొని 1000 యూనిట్లు రక్తదానం చేసిన యువతకు శిబిరం నిర్వాహకుడు నడుకుదిటి తేజబాబు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు పాల్గొన్నారు.

## వైసిపి నుంచి నెల్లిమర్ల మాజీ ఎమ్మెల్యే అప్పలనాయుడు సస్పెన్షన్

### - పార్టీ అధిష్ఠానం ఉత్తర్వులు



**నెల్లిమర్ల, అక్టోబరు 2 ప్రభాతవార్త:** విజయనగరం జిల్లా వైసిపి సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పల నాయుడుకు పార్టీ అధిష్టానం మరోసారి షాక్ ఇచ్చింది. జిల్లా పరిషత్ చైర్మన్, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) వైసిపికి ఇటీవల గుడ్ బై చెప్పిన నేపథ్యంలో ఆయన వియ్యంకుడు బడ్డుకొండ అప్పలనాయుడును నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాధ్యతల నుంచి తప్పించారు. ఈ స్థానంలో నెల్లిమర్ల మండల జడ్పీటిసిగా ఉన్న గదల సన్యాసి నాయుడుకు బాధ్యతలు అప్పగించారు.

ఈ పరిణామాలపై అటు జిల్లాలోనూ, ఇటు నెల్లిమర్ల నియోజకవర్గంలోనూ గత కొద్దిరోజులుగా తీవ్ర చర్చ జరుగుతున్న నేపథ్యంలో తాజాగా బడ్డుకొండ అప్పలనాయుడును పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ అధిష్ఠానం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో బడుకొండకు తీరని షాక్ తగిలినట్లు అయింది. బడ్డుకొండ వియ్యంకుడు, వైసిపి జిల్లా అధ్యక్షుడు అయిన చిన్న శ్రీను పార్టీని వదలి వేయడంతో పాటు, బడ్డుకొండ కోడలు అయిన తన కుమార్తె సిరి సహస్రతో కలిపి వైసిపిని వీడి తెలుగుదేశం పార్టీలో చేరడంతో వైసిపి అధినేత మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఈ పరిణామాలను తీవ్రంగా పరిగణించారు. దీంతో కఠిన నిర్ణయాలు తీసుకున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. రెండుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి జిల్లా పరిషత్ చైర్మన్‌గా వ్యవహరిస్తూ నెలిమర్ల నియోజకవర్గం వైసిపి పెద్దదిక్కుగా బాధ్యతలు నిర్వర్తించిన బడ్డుకొండకు ఈ తరహా షాక్‌లు తగలడం ఆయన అభిమానుల్లో తీవ్ర ఆందోళన, నైరాస్యం నింపాయి.

చిన్న శ్రీను రాజకీయ వలసలను అడ్డుపెట్టుకొని బడ్డు కొండపై అధిష్టానం తీసుకున్న చర్యలపై పార్టీలో తీవ్ర చర్చ జరుగుతోంది. పార్టీ అధిష్టానం బడ్డుకొండతో ఎలాంటి సంప్రదింపులు జరగకుండా, కనీసం షోకాజ్ నోటీసులు కూడా జారీ చేయకుండా ఈ చర్యలకు దిగడం వెనుక బడ్డు కొండను పార్టీ నుంచి పార్టీ అధిష్టానం 'పొమ్మనలేక పొగ పెట్టినట్లు వ్యవహరించిందని సర్వత్రా అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో బడ్డుకొండ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్న విషయంపై అటు అభిమానుల్లోనూ, పార్టీ వర్గాల్లోనూ తీవ్ర చర్చ జరుగుతోంది.

3-10Pg7exHMNWJQE.qxd:3-10Pg7exHMNWJQE.qxd 1/1/02 8:11 AM Page 1



## భారత్ బాక్సర్ అంకుష్ పంఘల్‌కు ఎపి డిప్యూటీ సిఎం అభినందనలు

**విజయవాడ,అక్టోబరు 2,ప్రభాతవార్తప్రతినిధి:** ఆసి యా క్రీడలు2026లో పురుషుల 80 కేజీల బాక్సింగ్ విభాగంలో స్వర్ణ పతకం సాధించిన భారత బాక్సర్ అంకుష్ పంఘల్‌కు ఏపీ డిప్యూ టీ సీఎం అభినందనలు తెలిపారు. ఫైనల్‌లో దక్షిణ కొరియాకు చెందిన కిమ్ మిన్సియాంగ్‌పై విజయం సాధించి స్వర్ణ పతకం దక్కించుకున్నా రని ప్రశంసించారు. ధైర్యం, ప్రశాంతత, పట్టు దలతో ప్రతి సవాలును అధిగమించి అంకుష్ అగ్రస్థానానికి చేరుకున్నారని కొనియాడారు.

## పండుగలా ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

**గురజాల, అక్టోబరు 2 ప్రభాతవార్త :** గురజాల పట్టణంలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆధ్వర్యాన శుక్రవారం నిర్వహించిన ఎన్టీఆర్ కాంస్య విగ్రహ ఆవిష్కరణ పండుగలా జరిగింది. వేలాది మంది కూటమి నేతలు, ఎన్టీఆర్ అభిమానుల మధ్య రాత్రి వేల పగటిని తలపించేలా బాణాసంచా, విద్యుత్ దీపాల వెలుగులో విగ్రహావిష్కరణ జరిపారు. రాష్ట్రం, జిల్లా నుంచి అతిరథులు, మహారథులైన విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్, మాజీ శాసనమండలి ఛైర్మన్ షరీఫ్, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయుల, వినుకొండ శాసనసభ్యుడు జీవీ ఆంజనేయులు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు సైదా, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, నరసరావుపేట శాసనసభ్యుడు చదలవాడ అరవింద్‌బాబు, పెదకూరపాడు శాసనసభ్యుడు భాష్యం ప్రవీణ్, ఆర్టీసీ ఛైర్మన్ కొనకల నారాయణ, నాగార్జున సాగర్ కుడికాలువ ఛైర్మన్ కాంతారావు, యువనేత నిఖిల్ హాజరు కాగా గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు నేతృత్వంలో అంగరంగ వైభవంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ ప్రతి పేద వారి ఇంటా దైవం ఎన్టీఆర్ అన్నారు. నందమూరి తారక రామారావు స్థాపించిన టీడీపీ ప్రపంచంలోని తెలుగు వారందరికీ గుర్తింపును తెచ్చిపెట్టిందన్నారు.

# నెల్లూరు సిటీలో తొలి స్టేడియానికి శ్రీకారం

- పాలిటెక్నిక్ కాలేజీలో స్పోర్ట్స్ హబ్
- అధునాతన క్రికెట్ స్టేడియానికి శంకుస్థాపన
- వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు భూమిపూజ
- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో మంత్రి నారాయణ



**నెల్లూరు, అక్టోబరు 2, ప్రభాతవార్త - వైద్యం:** నెల్లూరు సిటీ నియోజకవర్గంలో క్రీడా రంగానికి కొత్త ఊపిరి పోసేలా తొలి స్టేడియం నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ప్రాంగణంలో అధునాతన క్రికెట్ స్టేడియం, స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణ పనులకు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ శంకుస్థాపన చేశారు. అదే ప్రాంగణంలో వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ పనులకు భూమిపూజ చేసి, మొక్కలు నాటారు. స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ భారత్ కార్యక్రమాల్లో భాగంగా రోడ్లను శుభ్రం చేసి పారిశుధ్య కార్మికులను సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ స్వచ్ఛాంధ్ర సాధన కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ప్రతి నెలా మూడో శనివారాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలకు కేటాయిస్తున్నారన్నారు. స్వచ్ఛాంధ్ర సాధనలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. గత ప్రభుత్వం 153 లక్షల టన్నుల చెత్తను వదిలేసి వెళ్లింది. ఆ చెత్తనంతా క్లియర్ చేస్తున్నాం. భవిష్యత్తులో నగరాల్లో చెత్త కుప్పలు కనిపించకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వైజాగ్, గుంటూరులో వేస్ట్ ఎనర్జీ ప్లాంట్లు పనిచేస్తున్నాయని. మరో ఆరు ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అవి పూర్తయితే ఏ రోజు చెత్తను అదే రోజు ప్రాసెస్ చేసి బర్న్ చేసే పరిస్థితి వస్తుందని తెలిపారు.

**- మూడు దశల్లో స్పోర్ట్స్ హబ్**

ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏర్పాటుకు శంకుస్థాపన చేశామని, పనులను వెంటనే ప్రారంభించి మూడు దశల్లో పూర్తి చేస్తామని మంత్రి వెల్లడించారు. అధునాతన క్రికెట్ స్టేడియంతో పాటు క్రీడలకు అవసరమైన మౌలిక వసతులను అభివృద్ధి చేసి కాలేజీ ప్రాంగణాన్ని స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. గొడ్డలి పార్టీ రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాలా తీయించి వెళ్లిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తన అపార అనుభవంతో రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి పథంలోకి తీసుకువెళుతున్నారన్నారు. పేదలకు శాశ్వత నివాస పత్రాలు ఇస్తున్నామన్నారు. గత ప్రభుత్వం పట్టాల పేరుతో ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చి మాట నిలబెట్టుకుంటామని పేర్కొన్నారు.

**- ప్రభుత్వ విద్యా సంస్థలకు మహర్దశ**

ఎమ్మెల్సీ బీద రవిచంద్ర మాట్లాడుతూ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో స్పోర్ట్స్ హబ్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. మంత్రి నారాయణ నెల్లూరు నగరంలోని ప్రభుత్వ పాఠశాలలను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేస్తున్నారని, ప్రభుత్వ పాలిటెక్నిక్, ఐటీ, కేఏసీ కాలేజీల అభివృద్ధికి కూడా బాటలు వేస్తున్నారని తెలిపారు. స్పోర్ట్స్ హబ్ ఏర్పాటుతో పాలిటెక్నిక్ కాలేజీకి మహర్దశ వస్తుందన్నారు. వేల కోట్ల రూపాయల నిధులు తీసుకువచ్చి నెల్లూరును అభివృద్ధి చేస్తున్న మంత్రి నారాయణకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ సుజాత, కమిషనర్ నందన్, పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ రామారావు, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, టీడీపీ నేతలు దొడ్డపనేని రాజానాయుడు, జహీర్, తిరుపతయ్య, సుధాకర్‌రెడ్డి, చంద్రమౌళి, జమీర్ తదితరులు పాల్గొన్నారు.

## బస్సు ఆటోని ఢీకొని ఒకరి మృతి

**కావలి (నెల్లూరు), అక్టోబరు 2 ప్రభాతవార్త:** బస్సు అతివేగంగా ఆటోని ఢీకొని నెల్లూరు, స్టోన్ హౌస్ పేట, బట్లవారి వీధికి చెందిన నాగినేని పెంచలయ్య (50) అక్కడికక్కడే మృతి చెందడం జరిగింది. కావలి రూరల్ పోలీసుల సమాచారం మేరకు నాగినేని పెంచలయ్య అతని ట్రక్కు ఆటోలో నెల్లూరు నగరం, అల్లిపురం నందు గల సాయిబాబా రైస్ మిల్లులో చేపలకు వేసే తవుడు తీసుకొని ఒంగోలు దగ్గర గల సంతనూతలపాడులోని షణ్ముఖ ట్రేడర్స్ నందు అన్ లోడ్ చేయుటకు బయలుదేరి వెళ్లడం జరిగిందన్నారు. శుక్రవారం అర్ధరాత్రి సమయంలో మార్గమధ్యంలో కావలి మండలం, రుద్రకోట ఫ్లైఓవర్ సమీపంలో ఆటో వెనుక టైర్ పంచరైనందున సిగ్నల్ లైట్స్ వేసుకొని, వెనుకకు వెళ్లి టైరు చెక్ చేసుకుంటున్నారు. అదే సమయంలో నెల్లూరు వైపు నుండి ఒంగోలు వైపు వెళ్తున్న శ్రీకృష్ణ ట్రావెల్స్ బస్సు డ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ వచ్చి ట్రక్కును వెనుక ఢీకొట్టింది. ట్రక్కులో ఉన్న బస్తాలు మీద పడి చనిపోయినట్లు మృతుడి కుమారుడైన గణేష్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఇంద్రసేనారెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## అన్నను హతమార్చిన తమ్ముడు

**మర్రిపాడు (నెల్లూరు), అక్టోబరు 2 ప్రభాతవార్త :** నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలంలోని నాగరాజుపాడు గ్రామంలో గురువారం రాత్రి కుంభగిరి రాజగోపాల్ మృతిచెందాడు. వివరాల్లోకి వెళితే నాగరాజుపాడుకు చెందిన నిందితుడు కుంభగిరి గోపి పెదనాన్న కొడుకు అయిన కుం భగిరి రాజగోపాల్ 8సంవత్సరాల క్రితం గొడ్డలి తో మెడపై దాడి చేయగా ఆగాయం కారణంగా కంభగిరి గోపి శారీరకంగా వైకల్యానికి గుర య్యాడు. అప్పటి నుండి రాజగోపాల్‌పై ఉన్న పాత కక్షను మనసులో పెట్టుకొని ఉద్దేశ పూర్వకంగా గురువారం రాత్రి గోపి రాజగోపాల్‌పై రోకలిబండతో దాడిచేశాడు. తలకు బల మైన గాయం కావడంతో రాజగోపాల్ అక్కడి కక్కడే మృతిచెందాడు. ఈ విషయమై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ తెలిపారు.

# దుర్గమ్మవారి ఆలయానికి స్వచ్ఛాంధ్రా అవార్డు

- బ్రహ్మశ్రీ సింహాచల శాస్త్రి హరికథామృతం



సిఎం చంద్రబాబు నుండి అవార్డు అందుకుంటున్న ఇఒ, ఛైర్మన్

**ఇంద్రకీలాద్రి, అక్టోబర్ 1, ప్రభాతవార్త :** దుర్గమ్మవారి ఆలయం స్వచ్ఛ ఆంధ్ర అవార్డును కైవసం చేసుకుంది. శుక్రవారం ఇఒ వికె శీనా నాయక్, ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణలు ఈ అవార్డును ముఖ్యమంత్రి ఎన్ చంద్రబాబు నాయుడు చేతుల మీదు గా అందుకున్నారు. పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణలో విశేష ప్రమాణాలు పాటిస్తున్నందున దుర్గమ్మవారి ఆలయానికి ఈ అవార్డు లభించింది. గాంధిజయంతిని పురస్కరించుకుని స్వచ్ఛ ఆంధ్రా, స్వర్ణాంధ్ర (ఎస్ఏఎస్ఏ)లో భాగంగా ఈ అవార్డును శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంకు రాష్ట్రస్థాయి స్వచ్ఛాంధ్ర అవార్డు 2026నకు ఎంపికచేశారు. శుక్రవారం విజయ వాడ ఎ కన్వెన్షన్‌లో జరిగిన కార్యక్రమంలో అవా ర్డు ప్రధానం జరిగింది. ఆలయ ప్రాంగణంలో పరిశుభ్రత (30%), వ్యర్థాల విభజన మరియు సేకరణ, స్వచ్ఛమైన మరుగుదొడ్ల నిర్వహణ, పరిసర ప్రాంతాల పారిశుద్ధ్యం, ప్లాస్టిక్ రహిత విధానాలు, భక్తుల్లో అవగాహన కల్పించడం వంటి కీలక ప్రాతిపదికల్లో దేవస్థానంలో అమలు జరగడంతో ఈ ఘనత సాధించింది. ఈ సందర్భంగా ఇఒ ఛైర్మన్లు మాట్లాడుతూ అధికారులు అందిస్తున్న మార్గదర్శకత్వం, దేవస్థాన పారిశుద్ధ్య, కార్మికుల చిత్తశుద్ధితో విధుల నిర్వహణ వల్ల ఈ గుర్తింపు లభించిందన్నారు. రానున్న దసరా ఉత్సవాల్లో మరింత పర్యావరణ రహితంగా, స్వచ్ఛతకు పెద్ద పీట వేస్తూ భక్తులకు మెరుగైన సేవలందిస్తామని పేర్కొన్నారు.

**- భక్తితన్మయత్వంలో ఓలలాడించిన హరికథామృతం :**

సనాతన ధర్మం ఆచరణ, భక్తి వైశిష్ట్యం ప్రాభవాన్ని తమ హరికథామృతంతో అద్భుతంగా వివరిస్తూ ఆద్యంతం భక్తులను భక్తిపారవశ్యంలో ఓలలాండించారు బ్రహ్మశ్రీ డా. ముప్పవరపు వేంకట సింహాచల శాస్త్రి. శుక్రవారం దుర్గమ్మవారి ఆలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన భక్తమార్కండేయ హరికథను తన గాత్ర మాధుర్యంతో పాండిత్య ప్రతిభతో, తనదైన శైలిలో విశిష్ట ఆంగిక, వాచక, అభినయంతో గానం చేస్తూ రక్తికట్టించారు. భగవంతునిపై అచంచల భక్తిప్రపత్తులుంటే మన యోగం, క్షేమం వహామ్యహం అంటూ అన్ని భగవంతుడే వహిస్తారని వివరించారు. సనాతన ధర్మాన్ని ఆచరణ మాత్రమే సమస్త మానవాళికి రక్ష అని వివరించారు. అనంతరం ఆయనకు దుర్గమ్మవారి దర్శనం ఏర్పాటు చేసిన ఇఒ వికె శీనా నాయక్, ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణలు దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

**- దుర్గమ్మవారి ఆలయానికి విరాళం:**

రాబోయే దసరా ఉత్సవాల్లో దుర్గమ్మవారి ఆలయానికి చెందిన బస్సులను రిపేర్ చేయించడానికి రు.2,50,000 లవిరాళాన్ని విజయవాడకు చెందిన అట్లూరి పల్లవి తమ కుటుంబసభ్యులతో కలిఇ శుక్రవారం ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణకు అందించారు. ట్రస్టుబోర్డు సభ్యులు రామబ్రహ్మం చేసిన విజ్ఞాపన మేరకు వారు ఈ విరాళం అందించారు. దాతలకు దుర్గమ్మవారి దర్శన ఏర్పాటు చేసిన అనంతరం శ్రీ అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటో అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

## పవిత్ర పెంచలకోన క్షేత్రంలో మద్యం సీసాలు





**రాపూరు (నెల్లూరు), అక్టోబరు 2 ప్రభాతవార్త :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోన నవనారసింహ క్షేత్రలలో ఒకటిగా బావించి పెద్ద ఎత్తున భక్తులు అను నిత్యం కోనకు వస్తుంటారు. ఇటువంటి మహా పుణ్యక్షేత్రంలో పర్యవేక్షణా లోపంతో కొంత మంది మద్యం సేవిస్తూ కోన పవిత్రతను దెబ్బతీస్తున్నట్లు ఆరోపణలు భక్తుల నుండి వెల్లువెత్తుతున్నాయి. పవిత్ర పుణ్యక్షేత్రం లో మద్యం సీసాలా అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్వామి సన్నిధిలో మద్యం సీసాలు గమనించిన పలువురు కోనలో స్వామి వారి ప్రతిష్టను కాపాడేవారు ఎవ్వరూ లేరా అని ప్రశ్నిస్తున్నారు. మద్యం ఖాళీ బాటీళ్ళు పలు ప్రదేశాలలో దర్శనమివ్వడం ఆశర్యపరుస్తుంది. కోనలోని అటవీ అతిథి గృహాల సమీపంలో బస్సుల పార్కింగ్ చేసే ప్రదేశంతో పాటు, అటవీశాఖ వారు ఏర్పాటు చేసిన వున్న పార్కులో సైతం ఈ మద్యం ఖాళీ బాటిళ్ళు దర్శనమిస్తున్నాయి. పర్యవేక్షణ లోపంగా చెపుతున్నారు. గత మూడు సంవత్సరాలుగా కోనకు పాలకమండలి లేకపోవడం, కోన దేవస్థానానికి రెగ్యులర్ డిప్యూటీ కమీషనర్ లేకపోవడంతో పాటు, కోనలోని ఉద్యోగులు సైతం కోనలో పలు ప్రవేటు వ్యాపారాలు, కాంట్రాకులు నిర్వహిస్తూ వారి విధులను మరిచిపోయి కేవలం ధన సంపాదన మీదే దృష్టి పెట్టడంతో కోనలో ఇటువంటి కార్యక్రమాలు యదేచ్ఛగా జరుగుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా రాష్ట దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు స్పందించి కోనలో మద్యం సేవనంపై కఠినంగా వ్యవహరించి కోన ప్రతిష్టతను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

## చైనాలో పోటీలకు భారత్ నుంచి హిందూపురం బాలిక



**హిందూపురం , అక్టోబర్ 2 ప్రభాతవార్త :** అసాధారణమైన క్రీడా ప్రతిభతో ఏకంగా నేషనల్ ఛాంపియన్ షిప్ కైవసం చేసుకుంది.. శ్రీసత్యసాయి జిల్లా హిందూపురానికి చెందిన చిచ్చరపిడుగు అనాయ ప్రణీత్. కర్ణాటక రాజధాని బెంగళూరులో జరిగిన అంతర్రాష్ట్ర జిమ్నాస్టిక్ ట్రంపోలిన్ అండ్ తంబ లింగ్ విభాగంలో నెంబర్ వన్ స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని సాధించి జాతీయ ఛాంపియన్‌గా నిలవడంతో తెలుగు జాతి కీర్తి పతాకం రెపరె పలాడింది. వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీ సత్య సాయి జిల్లా హిందూపురం పట్టణంలోని బాలాజీ సర్కిల్లో ఉన్న సిరి లక్ష్మీ నరసింహ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు ఎస్.పి. ప్రణీత్, సుహాసిని దంపతుల ప్రథమ కుమార్తె అనాయ ప్రణీత్ 12 ఏళ్ల వయసులోనే ఈ ఘనత సాధించింది. ఏడవ తరగతి చదువుతున్న చిన్నారి ఆరేళ్ల వయసు నుంచే జిమ్నాస్టిక్స్ నందు తల్లితండ్రుల ప్రోత్సాహంతో కఠిన పరిశ్రమతో 73 మెడల్స్ సాధించడం అసమాన ప్రతిభకు తార్కాణం. జిమ్నాస్టిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, జిమ్నాస్టిక్స్ అసోసియేషన్ ఆఫ్ కర్ణాటక సంయుక్త నిర్వహణలో బెంగళూరులోని వైట్ ఫీల్డ్ లో సెప్టెంబర్ 24 నుంచి 27వ తేదీ వరకు సబ్ జూనియర్ జాతీయస్థాయి పోటీలు నిర్వహించగా వివిధ రాష్ట్రాల నుంచి 400 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో అనాయ మొదటి స్థానం సాధించగా బెంగళూరుకు చెందిన మరో బాలిక ద్వితీయ స్థానంలో, మహారాష్ట్రకు చెందిన క్రీడాకారిని తృతీయ స్థానంలో నిలిచారు. కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 2027లో జరగనున్న నేషనల్ గేమ్స్ కు డైరెక్ట్‌గా అనాయ నామినేటెడ్ అయింది. అంతే కాకుండా వచ్చే నెల నవంబర్ లో చైనాలోని నింజాంగ్ లో జరగనున్న ప్రపంచ చాంపియన్ షిప్ జిమ్నాస్టిక్స్ 2026 పోటీలకు భారతదేశం తరపున ఎంపికయింది. ఆనాయపై ప్రశంసలు.. హిందూపురానికి చెందిన చిన్నారి అనాయ ప్రణీత్ జి టమ్నాస్టిక్స్ లో ఏకంగా నేషనల్ ఛాంపియన్ షిప్ సాధించడం తమ ప్రాంతానికి ఎంతో గర్వకారణం అని స్థానిక క్రీడాకారులు, యువత లో ప్రశంసలు వస్తున్నాయి. అనాయ తాత సూర్య ప్రభాకర్ గౌడ్, పెదనాన్న ఎస్.పి. ప్రశాంత్ గౌడ్, తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

# పట్టణ సమగ్రాభివృద్ధికి నిధులు కేటాయిస్తాం

- పురపాలకశాఖామంత్రి పొంగూరు నారాయణ
- మంచినీటి శాశ్వత పరిష్కారానికి అడుగులు
- ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్



సభలో మాట్లాడుతున్న పురపాలకశాఖామంత్రి పొంగూరు నారాయణ



**పొన్నూరు, అక్టోబర్ 2,ప్రభాతవార్త:** పట్టణ సమగ్రాభివృద్ధికి అవసరమైన నిధులను కేటాయిస్తామని పురపాలకశాఖామంత్రి పొంగూరు నారాయణ అన్నారు. పట్టణాభివృద్ధిలో భాగంగా రూ.32కోట్లతో వివిధ అభివృద్ధి పనులను చేపట్టేందుకు శుక్రవారం శంఖుస్థాపన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి నారాయణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రతి ఒక్కరికీ స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నారన్నారు. అమృత్ 2.0 పథకంలో భాగంగా పొన్నూరు పట్టణంలో సుమారు రూ.22కోట్లతో అభివృద్ధి పనులకు శంఖుస్థాపనలు చేయడం జరిగిందన్నారు. పట్టణ తాగునీటి అవసరాలను తీర్చడంతోపాటు నీటి సరఫరా వ్యవస్థను మరింత మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకొంటున్నట్లు చెప్పారు.అదేవిధంగా సిఆర్‌డిఎ నిధులు రూ.10కోట్లతో పట్టణంలో సీసీ రోడ్లు, గ్రీనరీ తదితర అభివృద్ధి పనులను చేపట్టనున్నట్లు తెలిపారు. హెచ్‌ఏఎం ప్రాజెక్టు కింద పొన్నూరు మునిసిపాలిటీకి రూ.28కోట్లు మంజూరు చేసినట్లు మంత్రి వెల్లడించారు. ఈ ప్రాజెక్టు ద్వారా పట్టణ మౌలిక వసతులను మరింత అభివృద్ధి చేస్తామన్నారు. పొన్నూరు మునిసిపాలిటీకి అవసరమైన నిధులను కేటాయిస్తూ పట్టణాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. పిఎంఏవై పథకం కింద పట్టణంలో 50మందికి మంజూరైన గృహ పత్రాలను అందజేశారు. ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ మాట్లాడుతూ మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా అడగులు వేస్తున్నట్లు చెప్పారు. ప్రజలకు మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. పట్టణ జనాభా భవిష్యత్తులో లక్షకు చేరుకునే అవకాశం ఉన్న నేపథ్యంలో, భవిష్యత్తులో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు.ప్రస్తుతం ఉన్న మంచినీటి పైపులైన్ల సామర్థ్యాన్ని పెంచడం ద్వారా తాగునీటి సరఫరా వ్యవస్థను మరింత పటిష్టం చేస్తామన్నారు. పురపాలక సంఘం అభివృద్ధికి మునిసిపల్ శాఖామంత్రి పొంగూరు నారాయణ ఎంతో సహకారం అందిస్తున్నారన్నారు. పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. అనంతరం మునిసిపల్‌శాఖామంత్రి నారాయణను శ్రీ వీరాంజనేయస్వామివారి చిత్రపటం, శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు, రాష్ట్ర అర్బన్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ డైరెక్టర్ వడ్రాణం మార్కండేయబాబు, వ్యవసాయ మార్కెట్‌యార్డు ఛైర్మన్ పఠాన్ జరీనాబేగం, నాయకులు షేక్ బాజిసాహెబ్, పఠాన్ ఫిరోజ్‌ఖాన్, బండారుపల్లి శ్రీనివాసరావు, జాగర్లమూడి సుధీర్, గోవాడ వెంకటకృష్ణారావు, మాదల వెంకటేశ్వరరావు, బొర్రు రామారావు, చలమశెట్టి సీతారామయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భూముల కోసం రైతుల పోరుబాట

- అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన
- గ్రామసభను అడ్డుకున్న రైతులు



**విజయనగరం(భోగాపురం), అక్టోబర్ 2 ప్రభాతవార్త;** భూములను కాపాడుకోవాలనే డిమాండ్‌తో భోగాపురం గ్రామానికి చెందిన రైతులు శుక్రవారం తీవ్ర ఆందోళనకు దిగారు. తమ సమస్యలను పరిష్కరించకుండా భూములకు సంబంధించిన చర్యలు చేపట్టడాన్ని నిరసిస్తూ రైతులు గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. అనంతరం పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేస్తూ అర్ధనగ్న ప్రదర్శన చేపట్టారు. తమ తాతల కాలం నుంచి సాగు చేసుకుంటూ వస్తున్న భూములను ఎట్టి పరిస్థితుల్లోనూ కోల్పోయే ప్రసక్తే లేదని రైతులు స్పష్టం చేశారు. భూముల విషయంలో తమ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండా ముందుకు వెళ్లడం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ భూములకు న్యాయం జరిగే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు. ఇదిలా ఉండగా, భూముల అంశంపై జరగాల్సిన గ్రామసభను రైతులు బహిష్కరించారు. అనంతరం కొంతమంది అధికారులు రైతులతో మాట్లాడి గ్రామసభ నిర్వహించేందుకు ప్రయత్నించినప్పటికీ, రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ గ్రామసభను అడ్డుకున్నారు. దీంతో అక్కడ కొంతసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. భూములను కాపాడుకునేందుకు ఎంతటి పోరాటానికైనా సిద్ధమేనని రైతులు తేల్చిచెప్పారు. తమ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే వరకు వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు.

# రాయలసీమ ముఖచిత్రం మార్చే బృహత్తర యత్నం "హార్టికల్చర్ హబ్"

- మంత్రులు సత్య కుమార్ యాదవ్, సవిత



**శ్రీ సత్యసాయి జిల్లా, అక్టోబర్ 02, ప్రభాతవార్త ప్రతినిధి:** రాయలసీమ ముఖ చిత్రాన్ని మార్చే బృహత్తర యత్నమే లక్ష కోట్ల రూపాయలతో "హార్టికల్చర్ హబ్" అభివృద్ధి అని మంత్రులు సత్య కుమార్ యాదవ్, సవిత లు పేర్కొన్నారు. శుక్రవారం శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలోని గణేష్ సర్కిల్ లోనీ సాయి ఆరామంలో రాయలసీమ ప్రాంతాన్ని, ముఖ్యంగా శ్రీ సత్యసాయి జిల్లాను వ్యవసాయ, ఉద్యానవన రంగాలలో సమగ్రంగా అభివృద్ధి చేసి ప్రపంచ స్థాయి హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, బీసీ సంక్షేమ మరియు చేనేత జౌళి శాఖ మంత్రి సవితమ్మ జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్,పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి పేర్కొన్నారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ,

రాయలసీమ ప్రాంతాన్ని వ్యవసాయం, ఉద్యానవన రంగాల్లో మరింత అభివృద్ధి చేసి, ప్రపంచ స్థాయి హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. గతంలో కరువు కాటకాలు, వలసలకు నిలయంగా ఉన్న రాయలసీమ ప్రాంతాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకురావడానికి దివంగత నందమూరి తారక రామారావు హంద్రీ-నీవా, తెలుగుగంగ వంటి సాగునీటి ప్రాజెక్టులకు నాంది పలికారని సత్యకుమార్ యాదవ్ గుర్తుచేశారు. ప్రస్తుతం పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా పూర్తి చేయడంతో పాటు, కృష్ణా జలాలను రాయలసీమకు తరలించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు.

బీడ్జ్ సే బజార్ తక్ అనే ఆలోచనతో రైతు పంట సాగు చేసే దశ నుంచి ఉత్పత్తులను మార్కెట్‌లో విక్రయించే వరకు అవసరమైన మద్దతు కల్పిస్తున్నట్లు మంత్రి తెలిపారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలు , ఈనామ్ వంటి వ్యవస్థల ద్వారా స్థానిక మార్కెట్ల నుంచి అంతర్జాతీయ మార్కెట్ల వరకు రైతులకు మెరుగైన మార్కెట్ అవకాశాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి, అన్నదాత సుఖీభవ, కిసాన్ క్రెడిట్ కార్డులు, డ్రిప్, స్ప్రింక్లర్ సబ్సిడీల ద్వారా రైతులకు ఆర్థిక, సాంకేతిక సహాయం అందుతోందని తెలిపారు. రాయలసీమలో అందుబాటులో ఉన్న వాతావరణ పరిస్థితులు, భూసారం, నీటి వనరులను దృష్టిలో ఉంచుకుని ఆధునిక వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడం ద్వారా తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించేలా రైతులను ప్రోత్సహిస్తున్నామని మంత్రి తెలిపారు. మంత్రి సవితమ్మ మాట్లాడుతూ, ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుల కృషితో, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందన్నారు.

ఒకప్పుడు కరువు, వెనుకబాటుతనానికి నిలయంగా ఉన్న రాయలసీమ ప్రాంతాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకురావడంలో మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు కృష్ణా జలాల సాధనకు నాంది పలికారని ఆమె గుర్తుచేశారు. ప్రస్తుతం హంద్రీ-నీవా సుజల స్రవంతి, వెలుగొండ తదితర ప్రాజెక్టులతో పాటు కుప్పం, మడకశిర వంటి చివరి ప్రాంతాలకు సైతం సాగునీటిని అందించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. కార్ల తయారీ పరిశ్రమలు, ఫైటర్ జెట్ తయారీ వంటి భారీ పరిశ్రమలతో పాటు వ్యవసాయ ఆధారిత పరిశ్రమలకు కూడా ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు. సుమారు రూ.20,000 కోట్లు సాగునీటి ప్రాజెక్టులకు, రూ.5,500 కోట్లు గ్రామీణ రహదారుల అభివృద్ధికి కేటాయించనున్నట్లు వివరించారు.శ్రీ సత్యసాయి జిల్లాలో సైతం రూ.1,600 కోట్లతో హార్టికల్చర్ అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని మంత్రి తెలిపారు. రాయలసీమలో ఆపిల్, డ్రాగన్ ఫ్రూట్, మామిడి, దానిమ్మతో పాటు వివిధ రకాల పూల పంటల సాగుకు రైతులను ప్రోత్సహిస్తున్నట్లు పేర్కొన్నారు.రైతులు సమూహంగా ముందుకు వచ్చి వ్యవసాయానికి అవసరమైన ఫార్మ్ పాండ్స్ ఏర్పాటు చేసుకుంటే 75 శాతం వరకు, వ్యక్తిగతంగా ఏర్పాటు చేసుకుంటే 50 శాతం వరకు సబ్సిడీ అందించే విధానం అమల్లో ఉందన్నారు. అదేవిధంగా కోల్డ్ స్టోరేజీలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, రవాణా వాహనాలకు సబ్సిడీలు, వ్యవసాయ ఉత్పత్తులకు ఎగుమతి అవకాశాలు కల్పించడం ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి సవితమ్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లతో పాటు, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు, కూటమి పార్టీల నాయకులు, రైతులు పాల్గొన్నారు

3-10Pg5.qxd:3-10Pg5.qxd 1/1/02 6:53 AM Page 1



# గాంధీజికి 'శాంతి' అల్లంత దూరంలోనే!



## ఐదుసార్లు నామినేట్ అయినా లభించని ఫలితం

### వైఫల్యాన్ని చారిత్రక తప్పిదంగా అంగీకరించిన కమిటీ

**న్యూఢిల్లీ, అక్టోబరు 2:** అహింసా మార్గంలో ప్రపంచానికి స్ఫూర్తినిచ్చిన మహనీయుడు మహాత్మా గాంధీ. శాంతికి ప్రతీకగా నిలిచిన ఆయన పేరు నోబెల్ శాంతి బహుమతికి ఏకంగా ఐదుసార్లు నామినేట్ అయింది. కానీ, ఒక్కసారి కూడా ఆ అత్యున్నత పురస్కారం ఆయనకు దక్కలేదు. 1937, 1938, 1939, 1947, 1948 సంవత్సరాల్లో ఆయన పేరు పలుమార్లు షార్ట్‌లిస్ట్ వరకు వెళ్లినా, చివరికి తిరస్కరణకు గురైంది. దీని వెనుక అనేక కారణాలు ఉన్నాయి. గాంధీజీ పేరును 1937లో తొలిసారిగా నార్వే పార్లమెంటు సభ్యుడు ఒలే కోల్బ్జోర్న్‌సెన్ నోబెల్ శాంతి బహుమతికి నామినేట్ చేశారు. ఆ సమయంలో కమిటీ సలహాదారు జాకబ్ వార్మ్‌ముల్లర్, గాంధీ గొప్పతనాన్ని అంగీకరిస్తూనే కొన్ని సందేహాలు వ్యక్తం చేశారు. గాంధీ విధానాల్లో ఆకస్మిక మార్పులు వస్తున్నాయని, ఆయన ఒకేసారి స్వాతంత్ర్య సమరయోధుడిగా, అదే సమయంలో జాతీయవాదిగా కనిపిస్తున్నారని నివేదిక ఇచ్చారు. దీంతో ఆ ఏడాది బహుమతి లార్డ్ సెసిల్ ఆఫ్ చెల్వుడ్‌కు దక్కింది. ఇదే తరహా కారణాలతో 1938, 1939 నామినేషన్లు కూడా ముందుకు సాగలేదు. భారతదేశానికి స్వాతంత్రం వచ్చిన 1947లో గాంధీజీ పేరు మరోసారి షార్ట్‌లిస్ట్‌కు చేరింది. ఈసారి కమిటీ ఆయన అహింసా సిద్ధాంతాలపై సానుకూలంగా స్పందించింది. దేశ విభజన సమయంలో చెలరేగిన హింస, భారత్ పాకిస్థాన్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు కమిటీ నిర్ణయాన్ని ప్రభావితం చేశాయి. గాంధీజీ ఒక పక్షానికే ఎక్కువగా కట్టుబడి ఉన్నారనే భావన కొందరు సభ్యుల్లో వ్యక్తమైంది. అదే సమయంలో ఆయన ప్రార్థనా సమావేశంలో చేసిన ఒక వ్యాఖ్యపై అసంపూర్ణ వార్తా కథనం కూడా సందేహాలకు తావిచ్చింది. దీంతో ఆ ఏడాది పురస్కారాన్ని క్వేకర్స్ సంస్థకు ప్రకటించారు. 1948 జనవరి 30న గాంధీజీ హత్యకు గురయ్యారు. నోబెల్ నామినేషన్ల గడువుకు కేవలం రెండు రోజుల ముందు ఈ ఘోరం జరిగింది. ఆ ఏడాది ఆయన పేరు మీద ఆరు నామినేషన్లు రాగా, కమిటీ మరోసారి ఆయన పేరును షార్ట్‌లిస్ట్ చేసింది. మరణానంతరం పురస్కారం ఇవ్వాలా వద్దా అని కమిటీ తీవ్రంగా చర్చించింది. ఆల్ఫ్రెడ్ నోబెల్ ఉద్దేశాలకు ఇది విరుద్ధమని భావించి, మరణానంతర పురస్కారాన్ని నిరాకరించింది. విశేషమేమిటంటే, ఆ ఏడాది అర్హులైన సజీవ అభ్యర్థి ఎవరూ లేరు అని ప్రకటిస్తూ నోబెల్ శాంతి బహుమతిని ఎవరికీ ఇవ్వలేదు. ఇది పరోక్షంగా ఆ పురస్కారం గాంధీకే దక్కాల్సిందనే విషయాన్ని తెలియజేసింది. తర్వాతి కాలంలో నోబెల్ కమిటీ సభ్యులు ఈ చారిత్రక తప్పిదాన్ని బహిరంగంగా అంగీకరించారు. 1989లో దలైలా మాకు నోబెల్ శాంతి బహుమతి ప్రకటించి నప్పుడు, కమిటీ ఛైర్మన్ మాట్లాడుతూ ఈ పురస్కారం కొంతవరకు మహాత్మాగాంధీ స్మృతికి నివాళి అని వ్యాఖ్యానించారు. ఇది గాంధీ విషయంలో జరిగిన పొరపాటుకు పశ్చాత్తాపంగా చరిత్రలో నిలిచిపోయింది.



# ఫ్లైదుబాయి కెప్టెన్‌కు ప్రధాని మోడీ పరామర్శ

## యోగక్షేమాలపై ఆరా

### కష్ట సమయంలో హనుమాన్ చాలీసా పఠించానన్న కెప్టెన్ స్మిత్

**న్యూఢిల్లీ, అక్టోబరు 2:** విమానంలో తోటి పైలట్ దాడిని ఎదుర్కొని, 174 మందికి పైగా ప్రయాణికుల ప్రాణాలను కాపాడిన ఫ్లైదుబాయ్ విమాన కెప్టెన్ స్మిత్ మచ్చర్‌తో భారత ప్రధాని నరేంద్ర మోడీ శుక్రవారం ఫోన్‌లో మాట్లాడారు. ప్రస్తుతం యూఏఈలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న స్మిత్ యోగక్షేమాలను ప్రధాని అడిగి తెలుసుకున్నారు. ఆయన ధైర్యసాహసాలను కొనియాడుతూ, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రధాని నుంచి ఫోన్ కాల్ రావడంతో స్మిత్ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. తనకు అతిపెద్ద ఆరాధ్య దైవం, ఆదర్శప్రాయుడు ప్రధాని మోడీయేనని, ఆయనతో మాట్లాడే అవకాశం వస్తుందని కలలో కూడా ఊహించలేదని ఆనందం వ్యక్తం చేశారు. దుబాయ్ నుంచి టెల్ అవీవ్‌కు వెళ్తున్న ఫ్లైదుబాయ్ విమానంలో ఈ ఘటన చోటుచేసుకుంది. కాక్‌పిట్‌లో ఉన్న కెప్టెన్ స్మిత్ మచ్చర్‌పై తోటి పైలట్ కత్తితో దాడికి పాల్పడ్డాడు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడి కుప్పకూలినప్పటికీ, స్మిత్ అసామాన్యమైన ధైర్యాన్ని ప్రదర్శించారు. చివరి క్షణంలో కాక్‌పిట్ డోర్ లాచ్‌ను నొక్కి తలుపు తెరిచారు. దీంతో ప్రయాణికులు వెంటనే లోపలికి ప్రవేశించి, దాడి చేస్తున్న పైలట్‌ను అదుపులోకి తీసుకున్నారు. స్మిత్ సమయస్ఫూర్తి వల్ల 9/11 తరహా పెను ప్రమాదం తప్పిందని, 174 మందికి పైగా సురక్షితంగా బయటపడ్డారని ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధానితో సంభాషణ సందర్భంగా స్మిత్ ఒక ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. తాను కష్ట సమయాల్లో ఉన్నప్పుడు హనుమాన్ చాలీసా పఠిస్తానని, విమానంలో దాడి జరిగినప్పుడు కూడా ప్రాణాలతో పోరాడుతూ హనుమాన్ చాలీసానే చదువుకున్నానని వివరించారు.

అనంతరం ప్రధాని మోడీ, స్మిత్ తల్లి గీతా బెన్‌తో కూడా మాట్లాడారు. భగవద్గీత విలువలు, బోధనలతో కుమారుడిని పెంచినందుకు ఆమెను అభినందించారు. స్మిత్ త్వరగా కోలుకోవడానికి అవసరమైన వైద్య సహాయంతో పాటు అన్ని విధాలుగా కేంద్ర ప్రభుత్వం అండగా ఉంటుందని ప్రధాని మోడీ వారి కుటుంబానికి భరోసా ఇచ్చారు.

# కలినిన్‌గ్రాడ్‌పై దాడిచేస్తే అణ్వాయుధ దాడి తప్పదు

## యూరోప్ దేశాలకు పుతిన్ హెచ్చరిక



**మాస్కో, అక్టోబరు 2:** రష్యా భూభాగమైన కలినిన్‌గ్రాడ్‌పై నేరుగా దాడి జరిగితే అణ్వాయుధాలను ప్రయోగించేందుకు కూడా వెనుకాడబోమని అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ హెచ్చరించారు. తమ దేశంపై దాడి జరిగితే అందుబాటులో ఉన్న అన్ని రకాల ఆయుధాలను ఉపయోగించే అంశాన్ని తక్షణమే పరిశీలిస్తామని స్పష్టం చేశారు. ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో పశ్చిమ దేశాలు ఉద్రిక్తతలను మరింత పెంచితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. మాస్కోలో జరిగిన వాల్డాయ్ ఫోరమ్‌లో గురువారం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రష్యాకు యూరప్‌లోని ఏ దేశంపైనా దాడి చేసే ఉద్దేశం లేదని పుతిన్ తెలిపారు. ఐరోపా దేశాలతో శాంతియుతంగా కలిసి జీవించాలన్నదే తమ ఆకాంక్షగా పేర్కొన్నారు. అయితే రష్యా భూభాగంపై ప్రత్యక్ష దాడి జరిగితే మాత్రం తీవ్రంగా ప్రతిస్పందిస్తామని స్పష్టం చేశారు. ముఖ్యంగా నాటో సభ్యదేశాలైన పోలండ్, లిథువేనియా మధ్య ఉన్న కలినిన్‌గ్రాడ్ ప్రాంతం తమకు వ్యూహాత్మకంగా కీలకమని పేర్కొన్నారు. ఈ ప్రాంతంపై దాడి జరిగితే అణ్వాయుధాల వినియోగం అనివార్యమయ్యే పరిస్థితి రావచ్చని హెచ్చరించారు. నాటో సైనికంగా రష్యా కంటే రెండింతలు పెద్దదని పుతిన్ వ్యాఖ్యానించారు. ఫ్రాన్స్, బ్రిటన్ అణ్వాయుధ సామర్థ్యంపై తమకు పూర్తి అవగాహన ఉందన్నారు. అయితే తమ వద్ద కూడా ప్రత్యర్థులపై ఆధిక్యం సాధించగల ఆయుధాలు ఉన్నాయని పేర్కొన్నారు. కలినిన్‌గ్రాడ్‌ను దిగ్బంధించేందుకు నాటో ప్రయత్నిస్తే అణ్వాయుధాలు ఉపయోగించేందుకు సిద్ధమని రష్యా దౌత్యపరమైన హెచ్చరిక పంపినట్లు నాటో వెల్లడించిన నేపథ్యంలో పుతిన్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అణ్వాయుధ బెదిరింపులు సరికాదని నాటో ప్రధాన కార్యదర్శి మార్క్ రుట్టే స్పష్టం చేశారు. 2022లో ఉక్రెయిన్‌పై రష్యా పూర్తిస్థాయి సైనిక చర్య ప్రారంభించినప్పటి నుంచి పశ్చిమ దేశాలతో మాస్కో సంబంధాలు తీవ్ర ఉద్రిక్తతల మధ్య కొనసాగుతున్నాయి. రష్యా తమపై విధ్వంసక చర్యలకు పాల్పడుతోందని ఐరోపా దేశాలు ఆరోపిస్తుండగా మాస్కో వాటిని ఖండిస్తోంది. ఇదే సమయంలో ఉద్రిక్తతలు మరింత పెరిగితే వెనక్కి తగ్గలేని పరిస్థితి తలెత్తవచ్చని పుతిన్ ఆందోళన వ్యక్తం చేశారు.

అణ్వాయుధాల వినియోగం ప్రపంచానికి పెను ప్రమాదాన్ని తెచ్చిపెడుతుందని, అటువంటి పరిస్థితి రాకుండా దేశాలు జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. ఉక్రెయిన్‌పై నల్లసముద్ర ప్రాంతంలో రష్యా దాడులను నిలిపివేసే ప్రసక్తే లేదని పుతిన్ స్పష్టం చేశారు. రష్యా చమురు శుద్ధి కేంద్రాలపై ఉక్రెయిన్ దాడుల వల్ల తమ స్థూల దేశీయో త్పత్తిలో ఒక శాతం మేర నష్టం వాటిల్లిందని వెల్లడించారు. ఉక్రెయిన్‌కు ఆయుధాలు సరఫరా చేస్తున్న ఐరోపా కర్మాగారాలపై తక్షణమే దాడులు చేసే ఆలోచన తమకు లేదని తెలిపారు. సరైన అజెండా ఖరారైతే చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో కలిసి త్రైపాక్షిక సమావేశంలో పాల్గొనేందుకు సిద్ధమని కూడా పుతిన్ ప్రకటించారు.

# ధర్మం, దేశం వేర్వేరు కానేకాదు

## ఆర్ఎస్ఎస్ చీఫ్ భగవత్



**నాగ్‌పూర్, అక్టోబరు 2:** భారతదేశంలో ధర్మం, దేశం వేర్వేరు కావని, ప్రపంచం ఎదుర్కొంటున్న అనేక సవాళ్లకు భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానమే పరిష్కారం చూపగలదని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) సర్ సంఘచాలక్ మోహన్ భగవత్ పేర్కొన్నారు. శుక్రవారం నిర్వహించిన అఖిల భారత విహార్ సేవా గ్రూప్ 14వ మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా భగవత్ మాటాడుతూ, మన దేశం, ధర్మం పరస్పర భిన్నమైనవి కావు. దేశానికి ధర్మమే ప్రాణాధారం, ధర్మమే దేశాన్ని సుస్థిరపరుస్తుంది. ఈ రెండూ ఒకదానిపై ఒకటి ఆధారపడి ఉన్నాయని స్పష్టం చేశారు. నేడు ప్రపంచం అభివృద్ధిపర్యావరణ పరిరక్షణ, వ్యక్తిగత స్వేచ్ఛకుటుంబ వ్యవస్థ, మత విశ్వాసం సంఘర్షణ వంటి అనేక వైరుధ్యాలతో సతమతమవుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచం ప్రస్తుతం అస్తవ్యస్తంగా ఉంది. ఏ ఆనందమూ పరిపూర్ణంగా లభించడం లేదు. ఎక్కడా సమతుల్యత కనిపించడం లేదు, అతివాదం పెచ్చరిల్లుతోందని ఆయన విశ్లేషించారు. ఇలాంటి సంక్లిష్ట పరిస్థితులకు పరిష్కారం కోసం ప్రపంచం భారతదేశం వైపు ఆశగా చూస్తోందని భగవత్ అన్నారు. ఈ సమస్యల నుంచి గట్టెక్కించే మార్గం భారత్ నుంచే వస్తుందని ప్రపంచ దేశాలకు తెలుసని ఆయన వ్యాఖ్యానించారు. వేదాలు, ఉపనిషత్తులు, రామాయణం, భారతాలు, భగవద్గీతతో పాటు జైన ఆగమాలు, త్రిపిటకాలు, గురు గ్రంథ్ సాహిబ్ వంటి అత్యున్నత జ్ఞాన సంపద మన దేశానికి ఉందని గుర్తుచేశారు. ఈ జ్ఞానాన్ని పుణికిపుచ్చుకున్న వారిని, వారి సంప్రదాయాలను కాపాడటం కేవలం ఒక మతపరమైన బాధ్యత మాత్రమే కాదని, అది సమస్త మానవాళికి చేసే సేవ అని కొనియాడారు. "మీరు కేవలం ఒకరి ప్రాణాన్ని కాపాడటం లేదు, మొత్తం మానవజాతి సురక్షిత భవిష్యత్తును రక్షిస్తున్నారని భగవత్ ఉద్ఘాటించారు.

# హెచ్1బి వీసాఫీజులపై భారతీయ నిపుణులకు మరింత ఊరట

**వాషింగ్టన్, అక్టోబరు 2:** అమెరికాలో హెచ్1బి వీసాలపై ట్రంప్ సర్కార్ విధించిన లక్ష డాలర్ల భారీ ఫీజు విధానానికి మరోసారి చుక్కెదురైంది. ఈ వివాదాస్పద ఫీజు వసూలును తక్షణమే నిలిపివేయాలని రెండో ఫెడరల్ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ తీర్పుతో, హెచ్1బి వీసాలపై ఎక్కువగా ఆధారపడిన భారతీయ నిపుణులకు భారీ ఊరట లభించినట్లయింది. నార్తర్న్ డిస్ట్రిక్ట్ ఆఫ్ కాలిఫోర్నియాకు చెందిన యూఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి హేవుడ్ ఎస్.గిలియమ్ జూనియర్ ఈ కీలక తీర్పును వెలువరించారు. ఈ ఫీజును అమలు చేసే క్రమంలో ఫెడరల్ ఏజెన్సీలు అడ్మినిస్ట్రేటివ్ ప్రొసీజర్ యాక్ట్ కింద పాటించాల్సిన నియమ నిబంధనలను విస్మరించాయని కోర్టు స్పష్టం చేసింది. ఆరోగ్య సంరక్షణ సంస్థలు, విద్యాసంస్థలు, తయారీ కంపెనీలు, కార్మిక సంఘాలు కలిసి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన కోర్టు ఈ ఆదేశాలిచ్చింది. సెప్టెంబర్ 2025లో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జారీ చేసిన ఆదేశాలు, దానిని గత నెలలో పొడిగిస్తూ తీసుకున్న నిర్ణయాలను అమలు చేయకుండా ఈ తీర్పు అడ్డుకుంటుంది. హెచ్1బి వీసాల్లో 71 శాతంతో భారతీయులే అగ్రస్థానంలో ఉన్నందున, ఈ ఫీజు విధానం వారిపై తీవ్ర ప్రభావం చూపింది. ఈ లక్ష డాలర్ల ఫీజు వల్ల భారతీయ పౌరులు తీవ్రంగా నష్టపోయారు. ఇది ఉపాధి అవకాశాలను, కుటుంబాల భవిష్యత్తును ప్రమాదంలో పడేసిందని ఈ కేసులో భాగస్వామి అయిన సౌత్ ఏషియన్ అమెరికన్ జస్టిస్ కొలాబరేటివ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కల్పనా వి.పెద్దిభొట్ల అన్నారు. అమెరికన్ ఉద్యోగులను రక్షించడానికే ఈ ఆంక్షలు విధించామని ట్రంప్ ప్రభుత్వం వాదిస్తున్నప్పటికీ, కోర్టులు మాత్రం ప్రభుత్వ వాదనతో ఏకీభవించడం లేదు. కాగా, ఈ ఫీజును నిలిపివేయడం ఇది రెండోసారి. గత జూన్‌లో కూడా మసాచుసెట్స్ రాష్ట్రంలోని ఫెడరల్ కోర్టు ఇదే విధమైన తీర్పు ఇచ్చింది. ప్రభుత్వం దానిపై అప్పీల్ చేసినప్పటికీ, ఆ తీర్పుపై స్టే ఇచ్చేందుకు కూడా కోర్టు నిరాకరించింది. తాజా తీర్పుతో ట్రంప్ సర్కార్ విధానానికి మరో న్యాయ పరమైన ఎదురుదెబ్బ తగిలినట్లయింది.

# అమెరికన్ల ఉద్యోగాలు కొల్లగొడుతున్న హెచ్1బి వీసాలు

## వీటిని రద్దుచేస్తే మద్దతిస్తా: ఉపాధ్యక్షుడు జెడివాన్స్



**వాషింగ్టన్, అక్టోబరు 2:** అమెరికాలో ఉద్యోగాలు చేయాలనుకుంటున్న వేలాది మంది భారతీయ నిపుణులకు ఆందోళన కలిగించే పరిణామం చోటుచేసుకుంది. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ హెచ్1బీ వీసా విధానంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ విధానం పూర్తిగా విఫలమైందని పేర్కొన్న ఆయన, దానిని పూర్తిగా రద్దు చేయడానికి తాను మద్దతిస్తానని స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలు అమెరికాలో పనిచేస్తున్న, పనిచేయాలని ఆశిస్తున్న భారతీయ టెక్కీలలో తీవ్ర చర్చకు దారితీశాయి. ఎయిర్ ఫోర్స్ టూ విమానంలో ప్రముఖ వ్యాఖ్యాత జాక్ పోసోబిక్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో జేడీ వాన్స్ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. టెక్నాలజీ కంపెనీలు, అకౌంటింగ్ సంస్థలతో పాటు ఇతర యాజమాన్యాలు ఈ వీసా విధానాన్ని పూర్తిగా దుర్వినియోగం చేస్తున్నాయని ఆయన ఆరోపించారు. అమెరికన్ ఉద్యోగుల స్థానంలో తక్కువ జీతాలకు విదేశీ కార్మికులను నియమించుకోవడానికి హెచ్1బీ వీసాలను ఒక సాధనంగా వాడుకుంటున్నారని మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన ఒక ఉదాహరణను కూడా ప్రస్తావించారు. ఒక అమెరికన్ అకౌంటెంట్ ఏడాదికి 60,000 డాలర్ల జీతం తీసుకుంటుంటే, అతని స్థానంలో హెచ్1బీ వీసాపై వచ్చిన విదేశీయుడిని 45,000 డాలర్లకే నియమించుకుంటున్నారు. ఇది అమెరికన్ ఉద్యోగాలను నాశనం చేయడమే కాకుండా, అమెరికా ప్రజలను మోసం చేయడమే అవుతుందని వాన్స్ వ్యాఖ్యానించారు. అత్యంత నైపుణ్యం కలిగిన నిపుణులను దేశంలోకి తీసుకురావాలనే అసలు ఉద్దేశం దెబ్బతింటోందని ఆయన అన్నారు. ఈ విధానం అమల్లో ఉన్నంత వరకు అమెరికన్ ఉద్యోగుల ప్రయోజనాలను కాపాడటమే తమ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని వాన్స్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ ఈ వ్యవస్థలో సంస్కరణలు తీసుకురావడం అసాధ్యమని భావించిన తర్వాత, గతంలో ట్రంప్ ప్రభుత్వం కొన్ని కొత్త హెచ్1బీ పిటిషన్లపై అధిక ఫీజులు విధించే చర్యలు చేపట్టిందని [illegible] అయితే, ఈ [illegible] న్యాయపరమైన సవాళ్లను ఎదుర్కొంది.

**భారతీయ టెక్కీలకు షాక్:** అమెరికాలో ప్రత్యేక నైపుణ్యం కలిగిన వృత్తులలో విదేశీయులను నియమించుకోవడానికి హెచ్1బీ వీసాలు అనుమతిస్తాయి. ముఖ్యంగా భారతీయ ఐటీ నిపుణులు ఈ వీసాలపైనే అధికంగా ఆధారపడి ఉన్నారు. ఇప్పుడు ఉపాధ్యక్షుడి స్థాయి నుంచి దీనిని రద్దు చేయాలనే వ్యాఖ్యలు రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. వాన్స్ వ్యాఖ్యలకు డొనాల్డ్ ట్రంప్ జూనియర్ బహిరంగంగా మద్దతు తెలపడం ఈ అంశానికి రాజకీయ ప్రాధాన్యతను మరింత పెంచింది. ఈ పరిణామాల నేపథ్యంలో హెచ్1బీ వీసా భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకున్నాయి.

# ఫ్లైదుబాయి కెప్టెన్‌పై దాడి ఇరాన్ పనే..

## అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుమానం




**వాషింగ్టన్, అక్టోబరు 2:** ఫ్లైదుబాయ్ విమానంలో భారత సంతతి కెప్టెన్‌పై జరిగిన కత్తిదాడి ఘటనలో ఇరాన్ హస్తం ఉండొచ్చని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ విషయంపై దర్యాప్తు ఇంకా కొనసాగుతోందని, అయితే తనకు అందుతున్న ప్రాథమిక సమాచారం ప్రకారం దాడి వెనుక ఇరాన్ ఉండే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ ఘటన అంతర్జాతీయంగా తీవ్ర కలకలం రేపడంతో పాటు పశ్చిమాసియా కొత్త ఉద్రిక్తతలకు దారితీసే సూచనలు కనిపిస్తున్నాయి. దుబాయ్ నుంచి టెల్ అవీవ్‌కు వెళుతున్న విమానంలో జరిగిన ఈ దాడికి, ఇరాన్‌కు మధ్య సంబంధంపై విలేకరులు ప్రశ్నించగా ట్రంప్ స్పందించారు. "నాకు అందుతున్న సమాచారాన్ని బట్టి చూస్తే, సమాధానం అవుననే చెబుతాను. కానీ మేము ప్రస్తుతం దానిపై పూర్తిస్థాయిలో పనిచేస్తున్నాం" అని ఆయన అన్నారు. ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) ఈ కోపైలట్‌ను విమానంలోకి పంపించిందా లేక మరేదైనా మార్గంలో రాడికలైజ్ చేసిందా అని అడగ్గా, "అలా జరిగి ఉండవచ్చు, అవును" అని ట్రంప్ బదులిచ్చారు. ఒకవేళ ఈ దాడి వెనుక ఇరాన్ హస్తం ఉన్నట్లు తేలితే ఆ దేశం తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఆయన పరోక్షంగా హెచ్చరించారు. అయితే, ఇదే అంశంపై ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహును ప్రశ్నించగా, ఆయన ఆచితూచి స్పందించారు. ఇప్పుడే ఇరాన్ ప్రమేయంపై ఒక నిర్ధారణకు రావడం తొందరపాటు అవుతుందని, దర్యాప్తు పూర్తయ్యే వరకు వేచి చూడాలని అన్నారు. అయితే, దాడికి పాల్పడిన కోపైలట్ ఇస్లామిస్ట్ రాడికలైజేషన్‌కు గురైనట్లు తమ వద్ద ఉన్న ప్రాథమిక ఆధారాలు సూచిస్తున్నాయని ఆయన తెలిపారు. కోపైలట్ వ్యక్తిగత సమాచారాన్ని, అతని నేపథ్యాన్ని లోతుగా పరిశీలిస్తున్నామని, కొన్ని రోజుల్లో ఈ ఘటనపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉందని నెతన్యాహు వివరించారు. సెప్టెంబర్ 30న ఫ్లైదుబాయ్ విమానందుబాయ్ నుంచి టెల్ అవీవ్‌కు బయలుదేరిన సమయంలో ఈ దారుణ ఘటన చోటుచేసుకుంది. విమానం గాల్లో ఉండగా, ఒమన్ జాతీయుడిగా గుర్తించిన కోపైలట్, కెప్టెన్ స్మిత్ మచ్చర్‌పై అకస్మాత్తుగా కత్తితో దాడికి పాల్పడ్డాడు. ప్రాణాపాయ స్థితిలోనూ కెప్టెన్ స్మిత్ ధైర్యంగా ప్రతిఘటించారు. ఆయన ప్రతిఘటనతో అప్రమత్తమైన ప్రయాణికులు, ఇతర విమాన సిబ్బంది వెంటనే స్పందించి దాడి చేసిన కోపైలట్‌ను పట్టుకుని బంధించారు. అనంతరం విమానాన్ని అత్యవసరంగా సౌదీ అరేబియాలోని తబూక్ నగరంలో సురక్షితంగా ల్యాండ్ చేశారు. ప్రస్తుతం ఈ ఘటనపై పలు దేశాల అధికారులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. దాడికి పాల్పడిన కోపైలట్‌కు ఇరాన్‌తో సంబంధాలు ఉన్నట్లు ఇంతవరకు అధికారికంగా ఎలాంటి ఆధారాలు లభించలేదు. అయితే, అమెరికా అధ్యక్షుడి తాజా వ్యాఖ్యలతో ఈ ఘటనపై దర్యాప్తు మరింత వేగవంతం అయ్యే అవకాశం ఉంది. అబ్రహం ఒప్పందాల్లో భాగంగా ఇజ్రాయెల్, యూఏఈ మధ్య సంబంధాలు బలపడుతున్న తరుణంలో ఈ దాడి జరగడం అనేక అనుమానాలకు తావిస్తోంది.

# మధ్యప్రాచ్యంలో మరోసారి భీకరపోరుకు అమెరికా సమాయత్తం

**వాషింగ్టన్, అక్టోబరు 2:** మధ్యప్రాచ్యంలో మరోసారి యుద్ధ మేఘాలు దట్టంగా అలుముకుంటున్నాయి. ఇరాన్‌పై మరింత కఠినంగా వ్యవహరించేందుకు అమెరికా వేగంగా పావులు కదుపుతోంది. ఈ క్రమంలోనే ఏకంగా 9,000 మందికి పైగా సైనికులను యుద్ధనౌకల్లో మిడిల్ ఈస్ట్‌కు తరలిస్తున్నట్లు ఒక అమెరికా అధికారి తెలిపారు. యుఎస్ఎస్ థియోడోర్ రూజ్‌వెల్ట్ క్యారియర్ స్ట్రైక్ గ్రూప్, యుఎస్ఎస్ మేకిన్ ఐలాండ్ యాంఫిబియస్ రెడీనెస్ గ్రూప్‌లతో పాటు యుఎస్ఎస్ చోసిన్, యుఎస్ఎస్ జాన్ పి.ముర్తా, యుఎస్ఎస్ యాంకోరేజ్ వంటి కీలక యుద్ధనౌకలు ఈ కేటాయింపుల్లో ఉన్నాయి. ఇప్పటికే ఆ ప్రాంతంలో యుఎస్ఎస్ జార్జ్ హెచ్.డబ్ల్యూ. బుష్, యుఎస్ఎస్ జార్జ్ వాషింగ్టన్ విమాన వాహక నౌకలతో పాటు యుఎస్ఎస్ బాక్సర్ గ్రూప్ ఉన్నాయి. గతంలో సుదీర్ఘకాలం మోహరించిన విమాన వాహక నౌక యుఎస్ఎస్ అబ్రహం లింకన్ స్థానంలో, పసిఫిక్ మహాసముద్రం నుంచి జార్జ్ వాషింగ్టన్‌ను ఇక్కడికి తరలించారు.

# మెట్రో, ఎక్స్‌ప్రెస్ సర్వీసులకు విస్తరించిన ఉచిత ప్రయాణం

## తమిళనాట సిఎం విజయ్ స్వయంగా టికెట్లు జారీ చేసిన వైనం



**చెన్నై,అక్టోబరు 2:** తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ మహిళల కోసం ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని మరింత విస్తరించారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని నేడు వెట్రి పయనం పేరుతో ఈ విస్తృత పథకాన్ని ఆయన ప్రారంభించారు. చెన్నైలోని కోయంబేడు బస్ టెర్మినస్‌లో జరిగిన కార్యక్రమంలో సీఎం స్వయంగా మహిళా ప్రయాణికులకు ఉచిత టికెట్లు అందజేసి పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఇప్పటివరకు సాధారణ సిటీ, టౌన్ బస్సులకే పరిమితమైన ఈ పథకాన్ని ఇప్పుడు మరిన్ని సర్వీసులకు వర్తింపజేశారు. దీని ప్రకారం, ఇకపై మెట్రోపాలిటన్, పట్టణ ప్రాంతాల్లో నడిచే ఎక్స్‌ప్రెస్, లిమిటెడ్ స్టాప్ సర్వీస్ (ఎల్ఎస్ఎస్), డీలక్స్ బస్సుల్లో కూడా మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చు. అలాగే 40 కిలోమీటర్లు దాటిన మొఫుసిల్ ఆర్డినరీ, కొండ ప్రాంతాల్లోని ఆర్డినరీ బస్సులకు కూడా ఈ పథకం వర్తిస్తుంది. ఈ విస్తరణతో రాష్ట్రంలోని ఏడు ప్రభుత్వ రవాణా సంస్థలకు చెందిన మొత్తం 12,692 బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. ఇది మొత్తం బస్సుల్లో సుమారు 69 శాతం. ఈ పథకం ద్వారా ప్రతిరోజూ సుమారు 84.32 లక్షల మంది మహిళలు లబ్ధి పొందుతారని అంచనా వేస్తున్నారు. ఉద్యోగాలు, కళాశాలలు, ఇతర పనుల కోసం ప్రయాణించే మహిళల ఖర్చులను తగ్గించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం. దీనికి ఎలాంటి ఆదాయ పరిమితి గానీ, ప్రయాణాలపై పరిమితి గానీ లేదు. మహిళలతో పాటు ట్రాన్స్‌జెండర్లకు కూడా ఈ సౌకర్యం వర్తిస్తుంది. అయితే, స్టేట్ ఎక్స్‌ప్రెస్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎస్ఈటీసీ) బస్సులకు ఈ పథకం నుంచి మినహాయింపు ఇచ్చారు.

# సంక్షిప్త వార్తలు

## ఇడి మనీలాండరింగ్ కేసులో మమత పేరు

**కోల్‌కత్తా, అక్టోబరు 2:** మనీలాండరింగ్ కేసుకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విడుదల చేసిన ఒక ప్రకటనలో బెంగాల్ మాజీ సిఎం మమతా బెనర్జీ, మాజీమంత్రి ఇంద్రనీల్ సేన్ పేర్లను ప్రస్తావించింది. ఇంద్రనీల్ సేన్‌కు చెందిన ఆక్టేవ్ రికార్డ్ అనే సంస్థ ఖాతా నుంచి మమత బెనర్జీ బ్యాంకుఖాతాలోకి దాదాపు రూ.30లక్షలు బదిలీ అయినట్లు ఈడీ తన ప్రకటనలో పేర్కొనడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ నగదు బదిలీపై ఇంద్రనీల్ సేన్‌ను ప్రశ్నించగా, ఆ మొత్తాన్ని రాయల్టీ రూపంలోనే మమతకు చెల్లించానని ఆయన చెప్పినట్లు ఈడీ వెల్లడించింది.

## టిఎంసిని కాంగ్రెస్ పార్టీలో విలీనం చేయాలి: ఆధిర్‌రంజన్ చౌదరి




**కోల్‌కతా, అక్టోబరు 2:** పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) అధినేత్రి,మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తన పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేయాలని కాంగ్రెస్ సీనియర్ నేత అధీర్ రంజన్ చౌదరి బహిరంగంగా పిలుపునిచ్చారు. పార్టీలో చేరే ముందు ఆమె తనకున్న భారాన్ని వదిలించుకోవాలని షరతు పెట్టడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. కోల్‌కతాలో మీడియాతో మాట్లాడిన అధీర్ రంజన్ చౌదరి.. మమతకు ఈ ఆఫర్ ఇచ్చారు.

## బంకాట్ చెరువులో మునిగి నలుగురు బాలికలు మృతి



**బంకాట్, అక్టోబరు 2:** బిహార్‌లో విషాదం జరిగింది. ఒక బిహార్, ఈస్ట్ చంపారన్ జిల్లా, ఇనర్వ భార్ పంచాయత్ పరిధిలోని బంకాట్ గ్రామంలో చెరువులో మునిగిన నలుగురు బాలికలు ప్రాణాలు కోల్పోయారు. శుక్రవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాల్ని పహార్‌పూర్ పోలీస్ స్టేషన్ పోలీసులు వెల్లడించారు. బంకాట్ గ్రామానికి చెందిన ఐదుగురు బాలికలు స్థానిక చెరువుకు ఉదయం 9.30 గంటల సమయంలో స్నానం చేసేందుకు వెళ్లారు. ఐదుగురు బాలికలలో నలుగురు నీటిలోకి వెళ్లగా ఒక బాలిక ఒడ్డునే ఉండిపోయింది. లోపలికి వెళ్లిన బాలికలు లోతును అంచనా వేయలేకపోయారు. అలా ఇంకా నీటిలోకి వెళ్లి మునిగిపోయారు.

## భారత్ మిషన్‌శక్తితో యుఎస్ నిఘా వ్యవస్థ అప్రమత్తం



**వాషింగ్టన్, అక్టోబరు 2:** భారత్ 2019లో చేపట్టిన మిషన్ శక్తి యాంటీ శాటిలైట్ టెస్ట్ అమెరికాలో కంగారు పెట్టించిందని, ఈ టెస్టుతో యూఎస్ ఇంటెలిజెన్స్ వర్గాలు ఊహించని విధంగా అప్రమత్తమయ్యాయని మాజీ యూఎస్ ఎయిర్‌ఫోర్స్ ఇంటెలిజెన్స్ అధికారి డేవిడ్ గ్రుష్ వెల్లడించారు. జోరోగన్ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడినగ్రుష్ తాను ఆ సమయంలో అమెరికా నేషనల్ రీకనైసెన్స్ ఆఫీస్‌లో ఆపరేషన్ సెంటర్‌లో డ్యూటీలోఉన్నానని తెలిపారు. 2019లో భారత్ ఊహించని విధంగా మిస్సైల్ టెస్ట్‌చేసింది.తన శాటిలైట్‌లలో ఒకదాన్ని లక్ష్యంగా చేసుకుని కూల్చేసింది.

## ఉక్రెయిన్ శాంతి కోసం మోడీ ప్రయత్నాలను ప్రశంసించిన పుతిన్

**మాస్కో, అక్టోబరు 2:** ఉక్రెయిన్ వివాదానికి శాంతియుత పరిష్కారం కోసం ప్రధాని నరేంద్ర మోడీ చేస్తున్న ప్రయత్నాలను రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రశంసించారు. మోడీకి చాలా మంచి ఆలోచనలు ఉన్నాయని పేర్కొన్న పుతిన్, ఇరుపక్షాలకు ఆమోదయోగ్యమైన పరిష్కారాలను కనుగొనేందుకు ఆయన ఆసక్తి చూపుతున్నారన్నారు. రష్యాభారత్ మధ్య మంచి, స్నేహ పూర్వక సంబంధాలు ఉన్నప్పటికీ ప్రధాని మోడీ ప్రతి సందర్భంలోనూ ఉక్రెయిన్‌లో కొనసాగుతున్న సంఘర్షణకు ముగింపు పలకాల్సిన అవసరాన్ని ప్రస్తావిస్తున్నారని పుతిన్ చెప్పారు.

## రూ.50వేలు కట్నం తెస్తేనే టాయిలెట్ వాడుకో..



**భదోహి, యుపి, అక్టోబరు 2:** పుట్టింటి నుంచి రూ.50 వేలు కట్నం తెచ్చేవరకూ ఇంట్లో టాయిలెట్ వాడకూడదని అత్తింటి వేధింపులు ఓకోడలిని భరించలేకుండా చేసాయి. ఉత్తరప్రదేశ్‌లోని భదోహిలో వెలుగుచూసిన ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. భదోహిలోని రోషన్ తారా ప్రాంతానికి చెందిన షబ్నమ్ (20) తన అత్తింటి వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. సెప్టెంబరు మొదటి వారంలో తన తండ్రి నుంచి రూ.50 వేలు తీసుకురావాలని అత్తింటివారు డిమాండ్ చేశారని తాను నిరాకరించడంతో వేధింపులు మొదలయ్యాయని ఆమె ఆరోపించింది.

3 -10Pg6exHMNWJQE.qxd:3 -10Pg6exHMNWJQE.qxd 1/1/02 6:57 AM Page 1



# మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రికి సిఎం నివాళి



**విజయవాడ, అక్టోబరు 2 ప్రభాతవార్త ప్రతినిధి:** జాతిపిత మహాత్మా గాంధీ, భారతరత్న లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఎక్స్ వేదికగా వారు పోస్టు పెట్టారు. సిఎం చంద్రబాబు తన పోస్టులో జాతిపిత మహాత్మా గాంధీ 157వ జయంతి సందర్భంగా, ఆ మహనీయునికి నా వినయపూర్వక నివాళి అర్పిస్తున్నానని తెలిపారు. "సత్యం, అహింస, పరిశుభ్రత, గ్రామ స్వయం పరిపాలన వంటి గాంధీ ఆదర్శాలు నేటికీ మనకు మార్గదర్శకంగా నిలుస్తున్నాయి. దేశ స్వాతంత్ర్యం కోసం ఆయన చేసిన త్యాగాలు, ప్రజలను ఏకం చేసి నడిపించిన తీరు శాశ్వతంగా స్మరణీయం. గాంధీజీ కలలు కన్న స్వచ్ఛమైన, స్వయం సమృద్ధిగల, పేదరిక రహిత సమాజాన్ని నిర్మించేందుకు మనమందరం కృషి చేద్దాం. భారతదేశ నిర్మాణంలో భాగంగా, అభివృద్ధి చెందిన భారతదేశం, స్వర్ణాంధ్ర కోసం గాంధీజీ చూపిన మార్గంలో నడుద్దాం" అని సిఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. లాల్ బహూద్దూర్ శాస్త్రి జయంతి సందర్భంగా సిఎం చంద్రబాబు నివాళి అర్పించారు. "స్వతంత్ర భారతదేశపు రెండో ప్రధానమంత్రి, భారతరత్న లాల్ బహదూర్ శాస్త్రి 122వ జయంతి సందర్భంగా నివాళి అర్పిస్తున్నాను. ఆయన నిరాడంబరతకు ప్రతీక, దేశభక్తి, నిజాయితీకి ఒక ప్రకాశవంతమైన ఉదాహరణ" అని సిఎం చంద్రబాబు పేర్కొన్నారు, సిఎం చంద్రబాబు మదనపల్లి పర్యటనకు ముందు తన కార్యాలయంలో జాతిపిత గాంధీ, దివంగత ప్రధాని లాల్ బహుదూర్ చిత్రపట్టాలకు నివాళి అర్పించారు.

**మహాత్మా గాంధీ ఆదర్శాలను ముందుకు తీసుకెళ్దాం: డి.సిఎం పవన్ కల్యాణ్**

మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా ఆ మహనీయుని సేవలను స్మరిస్తూ నివాళి అర్పిస్తున్నానని డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. "ప్రపంచంలో మీరు చూడాలనుకుంటున్న మార్పు మీరే అవ్వండి. గాంధీ జయంతి సందర్భంగా, సత్యం, అహింస, నిస్వార్థ సేవ పట్ల అచంచలమైన విశ్వాసంతో ఒక జాతికి స్ఫూర్తినిచ్చి, తరతరాలకు స్ఫూర్తినిస్తూనే ఉన్న మహాత్మా గాంధీజీకి నివాళి అర్పిస్తున్నాను. గ్రామ స్వరాజ్యంపై ఆయనకున్న దార్శనికత, భారత్ బలం అట్టడుగు స్థాయి నుండే మొదలవుతుందని మనకు గుర్తు చేస్తుంది. మన గ్రామాలను బలోపేతం చేయడం, సమాజాలకు సాధికారత కల్పించడం, స్వావలంబనను ప్రోత్సహించడం ద్వారా మనం మరింత బలమైన, సుసంపన్నమైన భారత్‌ను నిర్మించగలం. మన చేతల ద్వారా, మన పనుల ద్వారా, సమాజ సేవ ద్వారా ఆయన ఆదర్శాలను ముందుకు తీసుకువెళ్దాం" అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. లాల్ బహుద్దూర్ శాస్త్రికి పవన్ నివాళిని అర్పించారు. దేశం సంక్షోభ సమయంలో ఉన్నప్పుడు ఆయన అనుసరించిన మార్గం ఎన్నటికి ఆదర్శనీయం అన్నారు.

**మహాత్మా గాంధీ చూపిన మార్గంలో పయనిద్దాం: మంత్రి లోకేశ్**

భారత జాతిపిత మహాత్మా గాంధీ జయంతి నేడు. ఈ సందర్భంగా ఆయనకు ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్య శాఖల మంత్రి నారా లోకేశ్ నివాళి అర్పించారు. "మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా ఆ మహనీయుని సేవలను స్మరిస్తూ నివాళి అర్పిస్తున్నాను. మన దేశ స్వేచ్ఛా స్వాతంత్ర్యం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన ధన్యజీవి బాపూజీ చూపిన శాంతి, సహన, సత్య మార్గంలో పయనిద్దాం. గాంధీజీ కలలుగన్న సమానత్వం, గ్రామ స్వరాజ్యం, స్వావలంబన, స్వచ్ఛత సాధించి, ఆ మహాత్ముని ఆశయాల సాకారానికి కృషి చేద్దాం" అని ఆయన పేర్కొన్నారు.

# మద్యం దుకాణాల దరఖాస్తుల గడువు పొడిగింపు

**అమరావతి, అక్టోబరు 2 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో 2026-27 ఎక్సైజ్ పాలసీ ప్రకారం 807 ఏ4 మద్యం దుకాణాల తాజా కేటాయింపునకు దరఖాస్తుల స్వీకరణ గడువును ప్రభుత్వం మరో మూడు రోజులు పొడిగించింది. దరఖాస్తు చేసుకునేందుకు ఆసక్తి ఉన్న వారికి అదనపు అవకాశం కల్పిస్తూ అక్టోబరు 6 అర్ధరాత్రి 12 గంటల వరకు దరఖాస్తులను స్వీకరించనున్నారు. అనంతరం అక్టోబరు 7న దరఖాస్తుల పరిశీలన చేపట్టి, అర్హత కలిగిన దుకాణాలకు అక్టోబరు 8న డ్రా ఆఫ్ లాట్స్ నిర్వహించి లైసెన్సులు కేటాయించనున్నట్లు అబ్కారీ, మద్య నిషేధ శాఖ కమిషనర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా తాజా కేటాయింపుల కోసం గుర్తించిన 807 ఏ4 దుకాణాల్లో 799 ఓపెన్ కేటగిరీ, 8 రిజర్వ్డ్ కేటగిరీ దుకాణాలు ఉన్నాయి. పునరుద్ధరణ జరగని లేదా ప్రస్తుతం పనిచేయని దుకాణాల స్థానంలో ఈ తాజా కేటాయింపులు చేపడుతున్నారు. 21 సంవత్సరాలు పైబడిన, నిబంధనల ప్రకారం అనర్హత లేని వ్యక్తులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఒక వ్యక్తి ఎన్ని దుకాణాలకైనా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉండగా, ఒక్కో దుకాణానికి ఎన్ని దరఖాస్తులైనా సమర్పించవచ్చు. ప్రతి దరఖాస్తుకు రూ.3 లక్షల నాన్‌రిఫండబుల్ అప్లికేషన్ ఫీజు, రూ.1,000 ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాలి. ఏ4 మద్యం దుకాణాల లైసెన్స్ కోసం అర్హత కలిగిన దరఖాస్తుదారులు నోటిఫికేషన్‌లో పేర్కొన్న విధంగా ఆన్‌లైన్, హైబ్రిడ్ లేదా ఆఫ్‌లైన్ విధానాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వారు ఓపెన్,రిజర్వ్డ్ కేటగిరీలకి వెబ్‌సైట్ల ద్వారా దరఖాస్తులు సమర్పించవచ్చు. ఎంపికైన దరఖాస్తుదారులు నిర్దేశిత చట్టపరమైన, నియంత్రణ నిబంధనలు పూర్తి చేసిన అనంతరం ఏ4 లైసెన్స్ పొందాల్సి ఉంటుంది. దుకాణాన్ని ఏర్పాటు చేసి నిర్వహించేందుకు పెర్మిట్ రూమ్ లైసెన్స్ పొందడం కూడా తప్పనిసరి అని కమిషనర్ శ్రీధర్ తెలిపారు.

# అడవి పంది దాడిలో మహిళ మృతి

**మైదుకూరు, అక్టోబర్ 02, ప్రభాతవార్త:** కడప జిల్లా మైదుకూరు మండలం శెట్టివారిపల్లి గ్రామ సమీపంలోని వ్యవసాయ పొలాల్లో అడవి పంది దాడిలో ఓ మహిళ మృతి చెందిన విషాద ఘటన శుక్రవారం చోటుచేసుకుంది.గ్రామానికి చెందిన నారపురెడ్డి వెంకటేశ్వరరెడ్డి కుటుంబ సభ్యులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమై ఉండగా, వెంకట కొండారెడ్డి భార్య నారపురెడ్డి బాలసుబ్బమ్మ (60) తన మనవడు సందీప్‌రెడ్డితో కలిసి పశువులకు చొప్ప కోసేందుకు పొలాల వద్దకు వెళ్లారు. అయితే తిరిగి వచ్చేసరికి బాలసుబ్బమ్మ అడవి పంది దాడికి గురై కొంత దూరం పరిగెత్తి కిందపడిపోయి మృతి చెంది ఉండటాన్ని మనవడు గుర్తించాడు. దీంతో అతడు కేకలు వేయడంతో చుట్టుపక్కల వ్యవసాయ పొలాల్లో ఉన్న వారు అక్కడికి చేరుకుని చూడగా బాలసుబ్బమ్మ మృతి చెందినట్లు తెలిపారు. సమీపంలోని చెరువు వద్ద నీటి కోసం అడవి పందులు వచ్చి ఈ ప్రాంతంలో సంచరిస్తుంటాయని వారు పేర్కొన్నారు.ఘటన విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారి చలపతి నాయుడు, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# జాతీయ సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో ఎపి బాలికల జట్టుకు స్వర్ణ పతకం

- క్రీడాకారులను సత్కరించిన ఎంపి కేశినేని చిన్ని



**విజయవాడ, అక్టోబరు 2 ప్రభాతవార్త :** జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ క్రీడాకారులు సత్తా చాటారు. మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్ వేదికగా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సెప్టెంబరు 27 నుంచి 30 వరకు నిర్వహించిన 39వ సబ్ జూనియర్ నేషనల్ సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్లో ఆంధ్రప్రదేశ్ బాలికల జట్టు అద్భుత ప్రతిభ కనబరిచి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. టోర్నమెంట్ ఆద్యంతం సమష్టి ప్రతిభను ప్రదర్శించిన ఎపి బాలికల జట్టు ఫైనల్‌లోబలమైన కేరళజట్టుతో ఉత్కంఠభరితంగా తలపడి ఘన విజయం సాధించింది. తద్వారా జాతీయ స్థాయిలో ఛాంపియన్‌గా నిలిచి రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచింది. బాలుర విభాగంలోనూ ఆంధ్రప్రదేశ్ జట్టు అత్యుత్తమ ఆటతీరును ప్రదర్శించి నాలుగో స్థానాన్ని సాధించింది. జాతీయ స్థాయిలో స్వర్ణ పతకం సాధించిన ఎపి బాలికల జట్టుతో పాటు ప్రతిభ కనబరిచిన బాలుర జట్టు, శిక్షకులను విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేనిశివనాథ్ (చిన్ని) అభినందించారు. క్రీడాకారులను శాలువాలతో తన కార్యాలయంలో ఘనంగా సత్కరించి వారి విజయాన్ని ప్రశంసించారు. ఈ సందర్భంగా ఎంపి చిన్ని మాట్లాడుతూ చిన్న వయసులోనే జాతీయ స్థాయిలో సత్తా చాటడం అభినందనీయమని, క్రమశిక్షణ, పట్టుదలతో క్రీడ ల్లో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా క్రీడాకారులకు తన వంతుగా అవసర మైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రానికి జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చిన క్రీడాకారులను ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. క్రీడ ల్లో ప్రతిభ ఉన్న యువతను ప్రోత్సహించేందుకు అవసరమైన సహకారం అందించేందుకు తాను ఎల్లప్పుడూ ముందుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ టిడిపి నాయకులు బుద్దయ్యతో పాటు క్రీడాకారులు, శిక్షకులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

# పెళ్లి పేరుతో మోసం

## నిందితుడి అరెస్టు



**తిరుపతిక్రైమ్, అక్టోబర్ 2ప్రభాతవార్త:** పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసగించి, శారీరక సంబంధం కొనసాగించి, ఆపై మతం మారాలని బెదిరింపులకు పాల్పడిన నిందితుడిని అలిపిరి పోలీసులు హైదరాబాద్‌లో చాకచక్యంగా అరెస్టు చేశారు. భాధితుల ఫిర్యాదు మేరకు అలిపిరి పోలీస్ స్టేషన్‌లో రెండు రోజుల ముందు కేసు నమోదైంది. బాధితురాలు జార్జియా దేశంలో ఎంబీబీఎస్ చదువుతున్న సమ యంలో, హైదరాబాద్‌కు చెందిన రయీద్ పరిచయమయ్యాడు. నిందితుడు ఆమెను వివాహం చేసు కుంటానని నమ్మించి, శారీరక సంబంధం పెట్టు కున్నాడు. ఆ తర్వాత బాధితురాలు పెళ్లి ప్రస్తావన తేగా, నిందితుడు తన మతంలోకి మారాలని బలవంతం చేశాడు. అందుకు అంగీకరించకపోతే ఆమె వ్యక్తిగత ఫోటోలు, వీడియోలను సోషల్ మీడియాలో పెడతానని, బంధువులకు పంపుతానని తీవ్రంగా బెదిరించాడు.తిరుపతి ఎస్పీ ఆదేశాల మేరకు బాధితురాలి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన అలిపిరి పోలీసులు ప్రత్యేక బృందంగా ఏర్పడి హైదరాబాద్‌కు వెళ్లారు. హైదరాబాద్‌లోని మల కపేట్, అక్బర్ బాగ్ ప్రాంతంలో గల నివాసం వద్ద నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

# విఆర్ఒల రాష్ట్ర కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

**విజయవాడ, అక్టోబరు 2 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ అధికారు సంఘం (విఆర్ఒ) రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విజయవాడలోని రెవెన్యూ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో విఆర్ఓలు హాజరై నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎ.పి. రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చేబ్రోలు కృష్ణమూర్తి ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ఈ ఎన్నికలలో రాష్ట్ర అధ్యక్షునిగా కోన ఆంజనేయ కుమార్ (మచిలీ పట్నం), రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎం.బాపూజీ (రామచంద్రపురం, కోనసీమ జిల్లా), సహ అధ్యక్షులుగా టి.శ్రీనివాసరావు (దుగ్గిరాల, గుంటూరు జిల్లా), ఉపాధ్యక్షురాలుగా జి. అనుపమ (గుంటూరు), ప్రచార కార్యదర్శిప్రచార కార్యదర్శి జి. దిల్లేశ్వరరావు (శ్రీకాకుళం జిల్లా), కార్యనిర్వాహక కార్యదర్శిగా సాహితీ (విజయవాడ), కార్య వర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎ. పి. రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు, రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు, ఎన్నికల సహాయ అధికారి బత్తిన రామకృష్ణ, ఉపాధ్యక్షురాలు పొన్నూరు విజయలక్ష్మి,రాష్ట్ర కార్యదర్శి, విఆర్ఓ అసోసియేషన్ పూర్వ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్, రాష్ట్ర కార్యదర్శి డి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

# గాంధీజీ కలలు.. కూటమి ప్రభుత్వంతోనే సాకారం

- మంత్రి పార్థసారథి



**నూజివీడు, అక్టోబరు02, (ప్రభాతవార్త) :** జాతిపిత మహాత్మ గాంధీ ఆశయాలను, ఆయన కలలను సాకారం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా ఏలూరు జిల్లా నూజివీడులోని క్యాంపు కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి, చిన్న గాంధీ బొమ్మ సెంటర్, పెద్ద గాంధీ బొమ్మ సెంటర్, గాంధీనగర్ ప్రాంతాల్లోని విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి మాట్లాడుతూ అక్టోబరు02ను ఐక్యరాజ్యసమితి ప్రపంచ అహింసా దినోత్సవంగా ప్రకటించిందని తెలిపారు. గాంధీజీ అహింసా మార్గం ప్రపంచాన్ని ప్రభావితం చేసిందన్నారు. దేశవ్యాప్తంగా ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వచ్ఛతకు ప్రాధాన్యత ఇస్తున్నారని, స్వచ్ఛతా కార్యక్రమాలను నామమాత్రంగా కాకుండా చిత్తశుద్ధితో అమలు చేయాలని సూచించారు.గాంధీజీ దేశ సేవతో పాటు పరిశుభ్రత ప్రాధాన్యతను కూడా ఆనాడే చాటిచెప్పారని గుర్తుచేశారు.

# తిరుమల సమాచారం

## భక్తులకు అంకితభావంతో సేవలందించాలి

- టిటిడి జెఇఒ ప్రభల గోపీనాథ్



**తిరుమల, అక్టోబరు 2 ప్రభాతవార్త ప్రతినిధి:** జాతిపిత మహాత్మా గాంధీ స్ఫూర్తితో టిటిడి ఉద్యోగులు మరింత నిజాయితీ క్రమశిక్షణ, అంకితభావంతో విధులు నిర్వహించాలని టిటిడి జెఇఒ ప్రభల గోపీనాథ్‌సూచించారు. తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఆయన కోరారు. స్వచ్ఛత, పరిశుభ్రతకు మరింత ప్రాధాన్యతనివ్వాలని పిలుపునిచ్చారు. పరిపాలనా భవనంలోని సమా వేశ మందిరంలో శుక్రవారం మహాత్మా గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జెఇఒ గోపీనాథ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది భక్తులు విశ్వాసంతో శ్రీవారి దర్శనానికి వచ్చే పవిత్రమైన టిటిడిలో పనిచేయడం మన అదృష్టమని, సేవా భాగ్యమని పేర్కొన్నారు. ప్రతి ఉద్యోగి మానవతా దృక్పథంతో భక్తులకు సేవలందించాలని సూచించారు. పరిశుభ్రత అనేది ప్రతి ఒక్కరి సామూహిక బాధ్యత అని స్పష్టం చేశారు. స్వాతంత్ర్య ఉద్యమంలో సత్యం, అహింస మార్గాల ద్వారా ప్రజలను ఏకం చేసిన గాంధీ సామాజిక అసమానతల నిర్మూలనకు, అన్ని వర్గాల అభ్యున్నతికి విశేష కృషి చేశారని తెలిపారు. గాంధీ ఆశయాలను ప్రతి ఒక్కరూ తమ జీవితాల్లో ఆచరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ విభాగం డిప్యూటీ ఇఒ ఆనందరాజు, తిరుపతి ఎస్టేట్ అధికారిణి సువర్ణమ్మ, తిరుమల ఎస్టేట్ అధికారి వేంకటేశ్వర్లు, సిఎఒ వేంకటరమణ, శ్వేత ఇన్‌చార్జి సంచాలకుడు డాక్టర్ వేమా వెంకటరత్నం, అధికారులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, పాల్గొన్నారు.

## శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలకు మరింత ఆకర్షణగా స్వాగత తోరణాలు

- టిటిడి జెఇఒ డాక్టర్ శరత్



**తిరుమల, అక్టోబరు 2 ప్రభాతవార్త ప్రతినిధి:** మలివిడత శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు అక్టోబరు 12 నుండి 20వ తేదీ వరకు జరుగనున్న నేపథ్యంలో తిరుపతిలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లను సమన్వయంతో పూర్తి చేయాలని టిటిడి జెఇఒ డాక్టర్ ఎ. శరత్ అధికారులను ఆదేశించారు. తిరుపతి జెఇఒ (వైద్యం, విద్య) ప్రభల గోపీనాథ్‌తో కలిసి శుక్రవారం ఉదయం పలు శాఖల అధికారులతో వర్చువల్‌గా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శరత్ మాట్లాడుతూ నవరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుపతిలోని ప్రధాన ప్రాంతాల్లో ఆకర్షణీయమైన విద్యుత్ అలంకరణలు, ఎల్ఇడి స్క్రీన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. పార్కింగ్ ప్రాంతాలు, హోల్డింగ్ పాయింట్ల వద్ద భక్తులకు అవసరమైన త్రాగునీరు, మరుగుదొడ్లు, సమాచార ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలన్నారు. భక్తులకు అవసరమైన సమాచారం స్పష్టంగా అందేలా సూచికలు, ప్రకటనలు ఏర్పాటు చేయాలన్నారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసేందుకు ప్రత్యేక కోఆర్డినేషన్ సెంటర్ ఏర్పాటు చేసి, రోజువారీగా ఏర్పాట్లను పర్యవేక్షించాలని జెఇఒ సూచించారు. తిరుపతికి కలిసే నాలుగు ప్రధాన కూడళ్ల వద్ద మరింత ఆకర్షణీయంగా స్వాగత తోరణాలు ఏర్పాటు చేసి భక్తులకు ఆధ్యాత్మిక వాతావరణం కల్పించాలని తెలిపారు. ప్రధాన రహదారులు, భక్తుల రాకపోకలు ఉండే ప్రాంతాల్లో పరిశుభ్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. ఈ వర్చువల్ సమీక్షలో సిఇ మనోహరం, ఎస్ఇ వేంకటేశ్వర్లు, విఎస్ఒ గిరిధర, డిప్యూటీ ఇఒ సెల్వం, టిటిడి రవణా జిఎం రాము, ముఖ్యవైద్యాధికారిణి కుసుమ కుమారి, డిఇలు రవిశంకర్ రెడ్డి, సరస్వతి, ఇఇ మల్లికార్జున ప్రసాద్, అదనపు హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పరిశుభ్రతపై అవగాహనే లక్ష్యంగా 'స్వచ్ఛ థాన్'

- స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్
- 23 రాష్ట్రాల నుండి 10,000 మంది పాల్గొన్న స్వచ్ఛథాన్



స్వచ్ఛథాన్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న కొమ్మారెడ్డి పట్టాభిరామ్

**విజయవాడ, అక్టోబరు 2 ప్రభాతవార్త ప్రతినిధి :** పరిశుభ్రత, ఫిట్‌నెస్, బాధ్యతాయుతమైన పౌరసత్వాన్ని ప్రోత్సహించడానికి ఒక నిరంతర వేదికను సృష్టిస్తూ, స్వచ్ఛ థాన్ వార్షిక కార్యక్రమంగా కొనసాగుతుందని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పటాభిరామ్ ప్రకటించారు. అమరావతి రన్నర్స్ సహకారంతో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ విజయవాడలో శుక్రవారం ఉదయం హెచ్ డిఎఫ్‌సి బ్యాంక్ 'స్వచ్ఛథాన్ 2026' నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. స్వచ్ఛత వైపు ముందడుగు వేయాలంటూ గాంధీ చూపించిన స్వచ్ఛత మార్గంలో ఆయన జయంతిని పురస్కరించుకొని స్వచ్ఛత దివస్ నాడు స్వచ్ఛథాన్ కార్యక్రమాన్ని నిర్వహించటం ఇది రెండోసారని తెలిపారు. స్వచ్ఛథాన్ 1.1 దిగ్విజయంగా పూర్తి చేసుకుని రెండో సంవత్సరంలోకి అడుగుపెట్టి, స్వచ్ఛత వైపు ప్రతి ఒక్కరికి అవగాహన కల్పిస్తూ, సింగిల్ యూస్ ప్లాస్టిక్ బ్యాన్, స్వచ్ఛమైన రాష్ట్రం వంటి అంశాలతో అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. పరిశుభ్రత, బాధ్యతాయుతమైన పౌరసత్వంపై ప్రజల్లో అవగాహన కల్పించడంలో ఇది ఒక కీలక ముందడుగుగా నిలిచింది. గాంధీ జయంతి సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమం, పరుగు (రన్నింగ్) అనే శక్తివంతమైన మాధ్యమం ద్వారా విజయవాడ వీధుల్లోకి స్వచ్ఛత సందేశాన్ని తీసుకు వెళ్లింది. "స్వచ్ఛథాన్" అంటే పరిశుభ్రత కోసం పరుగు అనే ఈ భావనకు దేశవ్యాప్తంగా ప్రజల నుండి విశేష స్పందన లభించింది. ఈ స్వచ్ఛథాన్ విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియం నుండి ప్రారంభమై, విజయవాడలోని ప్రముఖ ప్రాంతాల మీదగా సాగింది. ఎంపి కేశినేని శివనాథ్, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ పరిపాలన,పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శిగా ఎస్. సురేష్ కుమార్, కార్పొరేషన్ ఎండీ సునీల్ కుమార్ రెడ్డి, పోలీస్ కమిషనర్ రాజా శేఖర్ బాబు,మున్సిపల్ కమిషనర్ ధ్యాన్‌చంద్ జెండాలు ఊపి స్వచ్ఛథాన్ రన్‌ని ప్రారంభించారు. మున్సిపల్ స్టేడియం నుంచి ఎంజీ రోడ్, పోలీస్ కంట్రోల్ రూమ్, వన్ టౌన్ ఫ్లై ఓవర్, వినాయక ఆలయం, సీతమ్మ వారి పాదాలు, ప్రకాశం బ్యారేజీ, అమరావతి సీడ్ యాక్సెస్ రోడ్‌లోని స్టీల్ బ్రిడ్జ్, మంతెన సత్యనారాయణ రాజు ఆశ్రమం మీదగా మళ్లీ మున్సిపల్ స్టేడియం చేరింది. నగరం అంతటా స్వచ్ఛత సందేశాన్ని చాటుతూనే, విజయవాడలోని కొన్ని ముఖ్యమైన ప్రదేశాలను చూసే అవకాశం వారికి లభించింది. బలమైన దేశవ్యాప్త భాగస్వామ్యం, మద్దతు ఈ స్వచ్ఛథాన్‌కు లభించింది. ఈ కార్యక్రమం కోసం 23 రాష్ట్రాల నుండి దాదాపు 10,000 మంది రన్నర్లు, యువతీ యువకులు, వృద్ధులు సాధారణ ప్రజలు నమోదు చేసుకుని విజయవాడ ఈ స్వచ్ఛథాన్‌లో పాల్గొన్నారు. పోలీస్ కమిషనర్ రాజా శేఖర్ బాబు, అమరావతి రన్నర్స్ అధ్యక్షుడు రమేష్ రావి, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు ఎపి ఇన్ చార్జి(ఆపరేషన్స్) పవన్, జోనల్ హెడ్ రోహిణీ కుమార్, టిడిపి యువనేత బోండా సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.

# ఆంధ్రప్రదేశ్‌లో సినీ పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం సహకరించాలి

- మా ఎపిఅధ్యక్షులు దిలీప్ రాజా
- అమరావతిలో ఫిలిం నగర్, ఎన్టీఆర్ స్టూడియోస్ట్ ఏర్పాటు చేయాలి
- ఎపి ఎఫ్‌డిసి చైర్మన్ పి. భరత్ భూషణ్‌తో మా ఏప్రీ ప్రతినిధుల భేటీ
- ఎపిఎఫ్‌డిసి చైర్మన్ భరత్ భూషణ్‌కు మా ఏపీ ఘన సత్కారం..

**విజయవాడ,అక్టోబరు2,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలనచిత్ర, నాటక, టీవీ అభివృద్ధి సంస్థ (ఏపీ ఎఫ్‌డీసీ) గౌరవ చైర్మన్‌గా నూతనంగా నియమితులైన భరత్ భూషణ్‌ను "మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ (మాఏపీ 24 క్రాఫ్ట్స్ యూనియన్) ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సత్కరించారు,విజయవాడ పండిట్ నెహ్రూ బస్ స్టేషన్ కాంపౌండ్ లోని డా . ఎన్ టి ఆర్ అడ్మినిస్ట్రేటివ్ బ్లాకు లోని ఏపీ ఎఫ్ డీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో "మాఏప్రీ ప్రతినిధులు, సభ్యులు చైర్మన్ పి. భరత్ భూషణ్‌ను కలిసి శాలువా, ఫ్లవర్ బోకెలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాఏపీ అధ్యక్షులు, టాలీవుడ్ ఫిల్మ్ డైరెక్టర్ దిలీప్ రాజా మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధికి, స్థానిక నటీనటులు, 24 విభాగాల సినీ కళాకారులు, సాంకేతిక నిపుణుల సంక్షేమానికి నూతన చైర్మన్ నాయకత్వంలో విస్తృతమైన సహకారం అందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సినీ రంగం మరింత ముందుకు వెళ్లేలా సంస్థకు పూర్తి సహకారం అందిస్తామని పేర్కొన్నారు.ఆంధ్రప్రదేశ్‌లో సినీ పరిశ్రమ అభివృద్ధికి, స్థానిక కళాకారులకు మరిన్ని అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా సహకరించాలని "మా ఏప్రీ (మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్-ఏపీ) అధ్యక్షుడు దిలీప్ రాజా కోరారు. రాష్ట్రంలో సినీ పరిశ్రమను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక రోడ్‌మ్యాప్ రూపొందించాలని విజ్ఞప్తి చేశారు.ఇటీవల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు "మా ఏప్రీ అసోసియేషన్ లోగోను ఆవిష్కరించిన నేపథ్యంలో, అసోసియేషన్ ప్రతినిధులు ఏపీ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీ ఎఫ్‌డీసీ) చైర్మన్ భరత్ భూషణ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

హైదరాబాద్ తరహాలో రాజధాని అమరావతిలో ప్రత్యేకంగా "ఫిలిం నగర్‌ను ఏర్పాటు చేయాలని దిలీప్ రాజా కోరారు. అలాగే తెలుగు సినీ పరిశ్రమకు ఎనలేని సేవలందించిన మాజీ ముఖ్యమంత్రి, నటుడు నందమూరి తారక రామారావు పేరు మీద "ఎన్టీఆర్ స్టూడియోస్ట్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సినిమా పరిశ్రమకు సంబంధించిన మౌలిక సదుపాయాలు రాష్ట్రంలో సినీ పరిశ్రమ అభివృద్ధికి దోహదపడతాయని తెలిపారు.

# మనవడికి పుట్టువెంట్రుకల మొక్కు చెల్లించుకున్నాం

- శ్రీవారిసేవలో ఎమ్మెల్సీ నాగబాబు



**తిరుమల, అక్టోబరు 2 ప్రభాతవార్త ప్రతినిధి:** మనవడికి పుట్టువెంట్రుకలు తీయించి మొక్కులు చెల్లించుకున్నామని, తెలుగుప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని తిరుమల శ్రీవారిని వేడుకున్నట్లు ఎమ్మెల్సీ, సినీ నటుడు కొణిదల నాగబాబు తెలిపారు. ఏడుకొండలస్వామి దర్శనంతో మనసు సంతోషంగా ఉందని, స్వామివారి దర్శనం బాగా జరిగిందని అన్నారు. స్వామివారి లడ్డూప్రసాదం నాణ్యత రుచి అద్భుతంగా ఉందన్నారు. భక్తులకు టిటిడి కల్పిస్తున్న సౌకర్యాలు బాగున్నాయని తెలిపారు. వరుణ్‌తేజ్, లావణ్యత్రిపాఠితో కుటుంబసభ్యులతో కలసి శుక్రవారం ఉదయం ఆలయం వద్దకు విచ్చేసిన నాగబాబుకు ఆలయ అధికారులు స్వాగతం పలికారు. ఆలయంలో తొలుత ధ్వజస్తంభానికి నమస్కరించారు. శ్రీవారి మూలవిరాట్టును దర్శించుకుని కానుకలు సమర్పించారు. ఆలయ అదికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

# రాయలసీమ సస్యశ్యామలం కావాలి

- శ్రీవారి సుప్రభాత సేవలో మంత్రి అచ్చెన్నాయుడు



**తిరుమల, అక్టోబరు 2 ప్రభాతవార్త ప్రతినిధి:** రైతులకు ప్రకృతి వైపరీత్యాల ప్రభావం తగ్గి పంటలు సమృద్ధిగా పండి, ప్రతి రైతు కుటుంబం సుఖసంతోషాలతో జీవించాలని తిరుమల వేంకటేశ్వర స్వామిని ప్రార్థించినట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు తెలిపారు. సకాలంలో వర్షాలు కురిసి, రైతుల కష్టానికి తగిన ప్రతిఫలం లభించి, అన్నదాతల ఇళ్లలో ఆనందం వెల్లివిరియాలని స్వామివారిని కోరుకున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖశాంతులతో జీవించాలని ఆకాంక్షించినట్లు తెలిపారు.శుక్రవారం తెల్లవారుజామున మంత్రి అచ్చెన్నాయుడు కుటుంబ సమేతంగా శ్రీవారిని సుప్రభాత సేవలో దర్శించు కున్నారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

3 -10 Pg9th cheli.qxd:3 -10 Pg9th cheli.qxd 1/1/02 7:02 AM Page 1



ఫ్యాషన్ ఫ్యాషన్

# అదరహో ! యూత్ ఫుల్ కోట్ !






ఈ తరం అమ్మాయిలు.. ఫ్యాషన్‌కి ఐకాన్‌లు, పండగైనా, పెళ్లైనా స్టైల్ స్టేట్‌మెంట్ కనిపించాలని కోరుకుంటున్నారు. వారికి మెప్పించేందుకు డిజైనర్లు ఎన్నో ప్రయోగాలు చేస్తున్నారు. క్రాప్‌టాప్.. దానికి జతగా లాంగ్ కోట్. అవునండీ! లంగా ఓణీకి ప్రత్యామ్నాయంగా.. ఇటు సంప్రదాయాన్నీ, అటు ఆధునిక శైలినీ కలగలిపిన చేసిన డ్రెస్ ఇది. డైమండ్ సిల్క్, రాసిల్క్, జార్జెట్, టిష్యూ.. వంటి జాలువారే వస్త్రాలతో శుభకార్యాల్లో తళుక్కుమనేలా తీర్చిదిద్దన ఈ యువతను బాగా ఆకట్టుకుంటున్నాయి. చీర, హాఫ్‌శారీ కట్టుకోవడానికి ఇబ్బంది పడేవారికి ఇవీ మరీ నచ్చేస్తున్నాయి. అందుకే, సందర్భానికో రకం అన్నట్లుగా.. కట్‌వర్క్, జర్దోసీ, ప్రింట్లూ, పెయింట్లు.. వంటి హంగులెన్నో చేరి అదరహో అనిపిస్తున్నాయి. మన అభిరుచిని బట్టి ప్రత్యేకంగా కుట్టించుకోవచ్చు. లేదంటే రెడీమేడ్‌గానూ కొనుక్కోవచ్చు. కట్టుకంటే క్లాసీ లుక్‌తో మెరిసిపోవడం ఖాయం.

'ఫస్ట్‌ర్యాంకుకు రెండు మార్కులు తగ్గితే కోప్పడతావు. ఇన్ని మార్కులు తెచ్చుకున్నాననని ప్రశంసించవు ప్రతి సారీ వంద శాతం వస్తేనే.. అంటారు కొంత మంది తల్లులు. పిల్లలను పొగిడితే

## పొగడ్తలోనూ స్వాంతన !



చెప్పినమాట వినరు అనుకోకుండా సందర్భంబట్టి కాస్తంత పొగిడి చూడండి అంటున్నారు నిపుణులు. అది వారికి ప్రోత్సహించి లక్ష్యసాధనవైపు నడిపించేలా ఉండాలట. అలాగే పొగడ్లకూ ఒక లెక్క ఉందట. పిల్లలు సంతోషిస్తారని లేదా పొగడ్త ఇవ్వకపోతే బాధపడతారని కాకుండా నిజాయితీగా ప్రశంసించాలి. అది కూడా నిర్దష్టంగా ఉండాలి. తను చేసిన పని వల్ల లేదా చదువులో ముందుండటం తో కలిగే ప్రయోజనాలను వివరించి పొగడాలి. భవిష్యత్తులో ఈ మార్గాన్నే అనుసరించాలనే సూచన పిల్లల మెదడుకు చేరాలి. ఇతరు లపై తను చూపించే ప్రేమ, పక్కవారికి సాయం చేసే గుణం వంటివి ప్రదర్శించి నప్పుడు మీ పొగత్తన తప్పనిసరి. మున్ముందు కూడా ఆ తత్వాన్ని అలవరుచుకోవడం ఎంత మంచి విషయమో చెప్పి మరీ ప్రశంసిం చాలి. పిల్లలు కష్టపడి ప్రయత్నిస్తు న్నప్పుడు ప్రశంస ప్రోత్సాహ పూర్వకమైనదిగా ఉండాలి. ప్రశంసాపూర్వకమైన చిన్న సంజ్ఞ కూడా వారి ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. మంచి పని చేసినప్పుడే కాదు. వాళ్లల్లో ప్రతికూలమైన ప్రవర్తన కనిపించినప్పుడు కూడా సానుకూల శ్రద్ధ కనబరుస్తూ ప్రశంసలు కలపాలి. ఎలాగంటే, గతంలో నువ్వెంతో మంచిగా ఉన్నావు.ఇప్పుడెందుకిలా ప్రవర్తిస్తున్నావు అని విమర్శనాత్మకంగా లేదా గట్టిగా అరవకుండా, అదే పదాలను మృదువుగా చెప్పాలి. పిల్లలు ప్రతికూల అభిప్రాయా లకంటే, అందులోని ప్రశంసకే స్పందిస్తారు. అతిగా ప్రశంసించడం నివారించుకోవాలి. అతిశయోక్తి చేయకూడదు. ఎందుకంటే ఇది నిజమైన పొగడ్త ప్రాముఖ్యతను తగ్గిస్తుంది. మనకు నచ్చింది చేశారని కాకుండా, పిల్లల తీసుకునే చిన్న చిన్న నిర్ణయాలు వారి లోఆ్యన్ని సాధింఒచగలరనే నమ్మకం కలిగినప్పుడు ప్రశంసించాలి. అది వాళ్లలో స్వతంత్ర నిర్ణయాలు తీసుకోగలిగే నైపుణ్యాలను పెంచుతుంది. ◻

## సమతుల ఆహారం !

ప్రతి మనిషి శారీరక మానసిక వికాసానికి అవసరమైన సమతుల్య ఆహారం లభ్యత ఒక సవాల్‌గా మారిందనే చెప్పాలి. ప్రపంచంలో మూడింట ఒక వంతు ప్రజలకి అంటే దాదాపు 2690 కోట్ల మందికి ఆరోగ్యకరమైన ఆహారం కొనగలిగే శక్తి లేదు. ఇక మన దేశంలో 50% పైగా జనాభాకి కొనగోలు శక్తి లేదని (ఎఫ్‌ఎఓ) ఆహార వ్యవసాయ సంస్థ అంచనా వేసింది. ఒక వ్యక్తి రోజువారీ శక్తి అవసరాల్ని తీర్చడానికి విటమిన్లు ఖనిజాలున్న ఆహారాన్ని అంతర్జాతీయ పర్చేజింగ్ పవర్ పారిటీ (పిపిపి) డాలర్లలో లెక్కించడం కద్దు. నిరంతర శక్తి కోసం తక్కువ ఖర్చు కోసం ప్రధాన ధాన్యాల్ని (బ్రీన్‌రైస్/ఓట్స్)పెద్ద మొత్తంలో కొనాల్సి ఉంటుంది. మార్కెట్‌లో లోపాలున్న ఉత్పత్తుల్ని కొనండి. అవి చూడటానికి పోషకమైనవే కాక తక్కువ ధర కల్గి ఉంటుంది. మంచి ఆహారం తినడానికి సృజనాత్మక, తక్కువ ఖర్చుతో కూడిన మార్గలు అనేకం ఉంటాయి. అందుకే ఆరోగ్యం ఆహారం ముఖ్యమైది. ఇది అన్ని జీవనశైలికి ఆర్థిక పరిస్థితులకి సరిపోతుంది. వంట పద్ధతుల్ని మార్చడం నుండి వ్యాయామాన్ని రోజువారీ అలవాటుగా చేసుకోవడం వరకు, తక్కువ ఖర్చుతో కూడిన మార్పులు గొప్ప ఫలితాల్ని, అనుభూతుల్ని అందిస్తాయి. స్వీయ సంరక్షణ ఖరీదైనది కానవసరం లేదు. మొదట ఆరోగ్యం బైటి కన్నా ఇంట్లోనే మొదలవుతుంది. కాబట్టి తక్కువ ఖర్చులో నిలకడగా ఉండే ఆరోగ్య అలవాట్లని సరిగ్గా అలవాటు చేసుకోవాలి. ప్రతి వ్యక్తికీ రోజూవారీ అవసరమయ్యే ఆహార ధాన్యలు (బియ్యం, గోధుమలు) కాలరీల ఖర్చు కేవలం 13% మాత్రమే పండ్లు, కూరగాయలు,పాలు, మాంసం, పప్పు ధాన్యల ఖర్చుమొత్తం ఆహార వ్యయంలో 70%కంటే ఎక్కువగా ఉంటుంది. అమెరికా, యుఎస్, యుకె, దేశాల్లో ప్రజల ఆదాయం ఎక్కువగా ఉండడం వల్ల ఆహార సమస్య తక్కువగా ఉంటుంది. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో రోజువారీ ఆదాయం లోఎక్కువ భాగం ఆహారానికే వెచ్చించాల్సి ఉంటుంది. దీనికానేక కారణాల ఎన్నాయి. స్థానిక ప్రజల ఆహార అవసరాలకు సరిపడా ఆహారోత్పత్తులు పెరగకపోవడం, సరఫరా వ్యవస్థలో అడ్డంకులు, అధిక రవాణా ఖర్చులు, గిట్టుబాటు లేని ధరలు, దళారీల మోసం, అకాల వర్షాలు, కరువులు, పంటనష్టాలు, పాల ఉత్పత్తుల లభ్యత తగ్గిపోవడం, స్థానిక, సరఫరా వ్యవస్థ లు సరిగా పనిచేయక పోవడం అపరిశుభ్రతవల్ల, గిడ్డంగులకొరత, వస్తువుల నాణ్యతా ప్రమాణాలు సరిగా పాటించకపోవడం వల్ల ఆకాశన్నండే ధరలు వల్ల సరైన ఆహారం చౌకగా, అందరికీ అందుబాటులో లేకపోవడం వల్ల అనేక పోషకాహార లోపాలు తలెత్తుతు న్నాయి. మీ ఆరోగ్య ప్రయాణాన్ని మెల్లగా, చిన్నగా మీ బడ్జెట్‌కి అనుగుణంగా ప్రవేశపెట్టండి. స్థానిక కాలానుగుణ ఉత్పత్తుల్ని చేర్చుకొని తక్కువ ఖర్చుతోకూడిన పోషణతో మొత్తం ఆరోగ్యాల్ని మెరుగుపర్చు కోవాలి. అవసరమైన పోషకాలతో సమృద్ధిగా ఉన్నవాటిని ఎంపిక చేసుకుని మీ ఆహారపు అలవాట్లని మెరుగుపర్చుకొని డబ్బున కూడా ఆదా చేసుకోవచ్చు. ఖరీదైన ఫాస్ట్‌ఫుడ్ మరియు అతిగా ప్రాసెస్‌చేసిన ఆహార ఉత్పత్తుల్ని కొనడం ఆపండి. స్వీయ ఆహార సంరక్షణ విషయంలో అన్ని విధాలా చురుకుగా ఉండటమే ముఖ్యం. ఉదా: మామిడి పండ్లు వేసవికాలం కంటే శీతకాలంలో ఖరీదైనవి కాబట్టి చౌకగా లభ్యమయ్యే సీజనల్ ఫ్రూట్స్, కాయగూరలు, నట్స్ తీసుకోవాలి. రుచికరమైన ఆరోగ్యకరమైన ప్రణాళికా బద్ధమైన ఆహారాన్ని వాటి ఆరోగ్య ప్రయోజనాలకి భంగం కల్గికుండా తీసుకోవడమే నేటి ఆరోగ్య సూత్రం. ◻



డాక్టర్ కె.ఉమాదేవి
తిరుపతి



## ధర్మ స్వరూపం

శ్రీరాముడు .. మూర్తీభవించిన ధర్మ స్వరూపుడు అనే విషయాన్ని ఆధ్యాత్మిక గ్రంధాలు చెబుతున్నాయి. ఎదుటి వారి మనసును నొప్పించడం .. ఇచ్చిన మాటను తప్పడం రాముడికి తెలియదు. తండ్రి ఆజ్ఞ మేరకు ఆయన రాజ్య సుఖాలను వదిలి కట్టుబట్టలతో వనవాసానికి బయలు దేరాడు. తాను అడవులకు వెళ్లడానికి కారణమైన కైకేయిని కూడా రాముడు ఒక్క మాట అనలేదు. తన శరణు కోరిన సుగ్రీవుడిని .. విభీషణుడిని రక్షి ంచి వాళ్లను రాజులుగా చేసిన శరణాగత వత్సలుడు రాముడు. తనయుడిగా .. సోదరుడిగా.. శిష్యుడిగా.. స్నేహితుడిగా.. భర్తగా .. ప్రజాసేవకుడిగా రాముడు నిర్వహించిన పాత్ర ఎప్పటికీ ఆదర్శనీయమే. సత్యం .. ధర్మం .. ఓర్పు .. సహనం .. ధైర్యం శ్రీరాముడికి సహజ మైన ఆభరణాలుగా కనిపిస్తాయి. ఒకే మాట .. ఒకే బాణం .. ఒకే భార్య రామచంద్రుడి ప్రతిజ్ఞా పాలనకు అద్దం పడ తాయి. శ్రీరాముడు ఎంతటి పరాక్రమవంతుడో .. అంతటి క్షమాగుణం కలిగినవాడు అనడానికి అనేక సంఘటనలు నిలువెత్తు నిదర్శనాలుగా కనిపిస్తాయి. సాక్షాత్తు శ్రీమన్నా రాయణుడి అవతారమైన శ్రీరాముడిని దర్శించుకోవడం వలన సమస్త పాపాలు నశిస్తాయి. రాముడు అనుసరించిన మార్గాన్ని సూచించే రామాయణం చదవడం వలన, గాయత్రి మంత్రాన్ని జపించిన ఫలితం దక్కుతుందనేది మహర్షుల మాట. ◻

## 'బా బా బ్లాక్ షీప్' ట్రైలర్ లాంచ్ ఈవెంట్



అన్ని వర్గాల ప్రేక్షకులను మెప్పించేలా డిఫరెంట్ కాన్సెప్ట్‌తో రూపొందుతోన్న న్యూ ఏజ్ క్రైమ్ కామెడీ 'బా బా బ్లాక్ షీప్'. దోనేపూడి చక్రపాణి సమర్పణలో చిత్రాలయం స్టూడియోపై వేణు దోనేపూడి నిర్మిస్తున్న ఈ మూవీకి గుణి మంచికంటి దర్శకత్వం వహిస్తున్నారు. అక్టోబర్ 9న సినిమా రిలీజ్ అవుతుంది. ప్రముఖ నటుడు ఉపేంద్ర లిమాయె మాట్లాడుతూ.. ముందుగా నా ప్రాణ స్నేహితుడు సందీప్ రెడ్డి వంగాకు నా మనస్ఫూర్తిగా ధన్యవాదాలు. నన్ను నా సొంత వాయిస్‌తో తెలుగు ఇండస్ట్రీకి పరిచయం చేసింది ఆయనే. నటుడు విష్ణు ఓయ్ మాట్లాడుతూ మా 'బా బా బ్లాక్ షీప్'ట్రైలర్ లాంచ్‌కు సహకరించిన వారికి ధన్యవాదాలు. ఈ సినిమా కథ విన్నప్పుడు నేను ఎంతగానో ఎంజాయ్ చేశాను. నటి మాళ్వీ మల్హోత్రా మాట్లాడుతూ"బా బా బ్లాక్ షీప్ అనేది చాలా ఫన్, కొంచెం వెరైటీగా ఉండే ఒక ఆసక్తికరమైన టైటిల్. దర్శకుడు గుణి నాకు ఈ కథ చెప్పినప్పుడు నేను ఎంతో ఎగ్జైట్ అయ్యాను. నటి సమృద్ధి ఆర్యాళ్ మాట్లాడుతూ"సినిమా కంటే కూడా, ఈ మూవీ యూనిట్‌తో వర్క్ చేస్తూ నేను పొందిన అనుభవం నాకెంతో ప్రత్యేకం. నటీనటులు, దర్శకుడు, నిర్మాతలు.. ఇలా ప్రతి ఒక్కరూ చాలా ఆప్యాయంగా చూసుకున్నారు. నటుడు అక్షయ్ లగుసాని మాట్లాడుతూ నేను ఈ సినిమాతో పాటు మరో రెండు సినిమాలు కూడా చేస్తున్నాను. రాబోయే నాలుగు నెలల్లో అవి కూడా విడుదల కానున్నాయి. మీ అందరి సపోర్ట్, ఆశీస్సులు ఇలాగే ఉండాలని కోరుకుంటు న్నాను. నిర్మాత వేణు దోనేపూడి మాట్లాడుతూ ఈ సినిమా కోసం ఎంతో కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్క టెక్నీషియన్‌కు, నటీనటులకు నా కృతజ్ఞతలు. జాతీయ అవార్డు గ్రహీత ఉపేంద్ర లిమాయే గారితో కలిసి ప్రయాణించడం నాకు , ఎంతో గౌరవంగా ఉంది. మీరందరూ కుటుంబంతో కలిసి థియేటర్లలో ఈ సినిమాను చూసి ఆశీర్వదించాలని కోరుకుంటున్నాన్న అని అన్నారు.దర్శకుడు గుణి మంచికంటి మాట్లాడుతూ "ముందుగా నిర్మాత వేణు గారికి చాలా పెద్ద థాంక్స్. ప్రస్తుతం ఉన్న కాంపిటీషన్‌లో ఒక డెబ్యూ డైరెక్టర్‌కు సినిమా రావడం చాలా కష్టమైన విషయం. కానీ వేణునేను చెప్పిన ఒక్క నరేషన్‌తోనే ఈ సినిమాను ఒకే చేశారు.

## 'తెల్ల కాగితం' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్



హీరో హర్ష రోషన్ మాట్లా డుతూ.. "ఈ వారం రోజుల్లో నేను రెండు షాకులు చూశాను. మొదటి ది పాన్ ఇండియా సూపర్ స్టార్ ప్రభాస్ అన్న మా ట్రైలర్ గురించి పోస్ట్ చేసి మాకు కొండంత ధైర్యం ఇవ్వడం, రెండోది సినిమా విడుదలకు మూడు రోజుల ముందు మా చిత్రం నుంచి ఒక వీడియో లీక్ కావడం. ఆ లీక్ అయిన వీడియోపై వచ్చిన ప్రతి మీమ్, ట్వీట్, రీల్ చూశాను. హీరోయిన్ నక్షత్ర మాట్లాడుతూ.. "తెల్ల కాగితం మూవీ 2006 బ్యాక్‌డ్రాప్‌లో నడిచే కథ అయినా.. ప్రస్తుత జనరేషన్‌తో పాటు రాబోయే తరాలకు కూడా అర్థమయ్యే ఒక అందమైన సందేశం ఇందులో ఉంది. తెల్ల కాగితం మూవీ డైరెక్టర్ రమేష్ బండ్రెడ్డి మాట్లాడుతూ.. "మా నిర్మాత కృష్ణ నన్ను నమ్మి, చిన్న పిల్లల మైనా సరే నడిపించి, బడ్జెట్ పరిమితులు పెట్టకుండా కథకు కావాల్సినవన్నీ సమకూర్చారు. ఈ రోజు నన్ను ఇక్కడ నిలబెట్టిన ఆయన డెడికేషన్‌కి ఎప్పటికీ రుణపడి ఉంటాను. నిర్మాత, టీఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు మాట్లాడుతూ.. "నిర్మాత కృష్ణ ఈ ప్రాజెక్ట్ ప్రారంభంలో రైటర్ నందుతో నాకు కథ చెప్పించినప్పుడే ఇది 2000ల కాలం నాటి నేపథ్యంలో సాగే ఎంతో స్వచ్ఛ మైన, ఇన్నోసెంట్ లవ్ స్టోరీ అనిపించింది. గతంలో మా బ్యానర్ నుంచి వచ్చిన 'కొత్త బంగారు లోకం' సినిమాలో ఎలాంటి అమాయకత్వంతో కూడిన ప్రేమకథ ఉందో.. ఇందులోనూ అలాంటి ఫీల్ కనిపించింది. డైరెక్టర్ అనిల్ రావిపూడి మాట్లాడుతూ.. 'నేను దిల్ రాజు బ్యానర్‌లో పనిచేసిన రోజుల నుంచి నాకు బాగా కావాల్సిన వ్యక్తి, నిర్మాత కృష్ణన్న కోసమే నేను ఇక్కడికి వచ్చాను. డైరెక్టర్ కొరటాల శివ మాట్లాడుతూ.. "నిర్మాత కృష్ణన్న వల్ల చాలా రోజుల తర్వాత మైక్ పట్టుకుని స్టేజ్ ఎక్కే అవకాశం వచ్చింది. సినిమా చూసినప్పుడు చాలా ముచ్చటేసింది.

తెర

## 'హనుమాన్ అంశ్' 9న తెలుగులో విడుదల

ప్రముఖ నిర్మాణ సంస్థ హోంబలే ఫిల్మ్స్ ద్వారా తెలుగు ప్రేక్షకుల ముందుకు వస్తున్న నీమ్ కరోలి బాబా బయోపిక్ కొన్ని సినిమాలు విడుదలైన వెంటనే ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి. మరికొన్ని సినిమాలు రోజులు గడిచేకొద్దీ మౌత్ టాక్‌తో మరింత బలపడతాయి. 'హనుమాన్ అంశ్'హనుమాన్ అంశ్ కూడా అలాంటి చిత్రమే. ప్రముఖ ఆధ్యాత్మిక గురువు నీమ్ కరోలి బాబా, భక్తులు ప్రేమగా మహారాజ్‌జీ అని పిలుచుకునే ఆయన జీవితం, బోధనల స్ఫూర్తితో రూపొందిన ఈ హిందీ చిత్రం.. ఈ ఏడాదిలో అనూహ్య విజయాన్ని అందుకున్న చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. పరిమిత స్థాయిలో తెరకెక్కిన ఈ సినిమా దేశవ్యాప్తంగా ప్రేక్షకాదరణను సొంతం చేసుకుంది. డాక్టర్ విశాల్ చతుర్వేది రచన, దర్శకత్వంలో 'హనుమాన్ అంశ్' తెరకెక్కింది. నీమ్ కరోలి బాబా పాత్రలో శోబినావ్ సత్యా నటించారు. చందన్ ఆనంద్, పూర్ణిమా తివారీ తదితరులు కీలక పాత్రల్లో కనిపించారు. శ్రేయాస్ ధర్మాధికారి సంగీతాన్ని అందించగా, రిషి పాఠక్ కూడా సంగీత దర్శకుడిగా క్రెడిట్ పొందారు. హిందీలో



విజయవంతమైన థియేట్రికల్ జర్నీ అనంతరం ఇప్పుడు ఈ చిత్రం తెలుగు ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. హోంబలే ఫిల్మ్స్ తమ ఓవర్సీస్ డిస్ట్రిబ్యూషన్ విభాగం ద్వారా గతంలో "హనుమాన్ అంశ్‌ను అంతర్జాతీయ ప్రేక్షకులకు చేరువ చేసింది. అక్టోబర్ 9న"హనుమాన్ అంశ్ తెలుగు వెర్షన్ థియేటర్లలో విడుదల కానుంది. అలాగే తమిళం, కన్నడ, మలయాళం మార్కెట్లలోనూ ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు. హిందీలో ఇప్పటికే ప్రేక్షకులపై బలమైన ప్రభావాన్ని చూపిన"హనుమాన్ అంశ్.. ఇప్పుడు తెలుగు ప్రేక్షకులను పలకరించబోతోంది. మహారాజ్‌జీ ఆధ్యాత్మిక ప్రయాణాన్ని మరింత మందికి చేరువ చేయాలనే లక్ష్యంతో అక్టోబర్ 9న తెలుగు థియేటర్లలోకి వస్తోంది.హిందీ థియేటర్ల నుంచి ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల వరకు.. అక్కడి నుంచి ఇప్పుడు దక్షిణ భారతదేశంలోని ప్రేక్షకుల వరకు హనుమాన్ అంశ్ ప్రయాణం కొనసాగుతోంది.

## 'టాల్కమ్ పౌడర్' ఎంటర్టైనింగ్ గ్లింప్స్ రిలీజ్



'పెళ్లిచూపులు', 'మెంటల్ మదిలో', 'చూసి చూడంగానే' వంటి వైవిధ్యమైన, కంటెంట్ బేస్డ్ చిత్రాలను నిర్మించిన నేషనల్ అవార్డ్ విన్నింగ్ ప్రొడ్యూసర్ రాజ్ కందుకూరి మరో ఆసక్తికరమైన సినిమాతో రాబోతున్నారు. ఆయన ధర్మపథ క్రియేషన్స్ బ్యానర్‌పై శివ కందుకూరి హీరోగా"టాల్కమ్ పౌడర్" అనే చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సాయి నాథ్ పొన్నా రచన, దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో ద్రిషికా చందర్ కథా నాయికగా నటిస్తున్నారు. గ్లింప్స్‌లో బంటీ అనే డ్రగ్ పెడ్లర్ చుట్టూ కథను ఆసక్తికరంగా పరిచయం చేశారు. తెలియక చేసిన ఓ తప్పు కారణంగా బంటీ అనూహ్యమైన పరిస్థితుల్లో చిక్కుకుంటాడు. ఓవైపు పోలీసులు, మరోవైపు గ్యాంగ్‌స్టర్లు అతని కోసం వేట మొదలుపెట్టడంతో పరిస్థితులు మరింత గందరగోళంగా మారుతాయి. క్రైమ్, కామెడీ, డ్రామాను కలిపి రేసీ నెరేషన్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రం అనూహ్యమైన మలుపులు, ఫన్‌తో కూడిన సన్ని వేశాలతో అలరించ బోతున్నట్లు గ్లింప్స్ చూస్తే తెలుస్తోంది. దర్శకుడు సాయినాథ్ పొన్నా అద్భుతమైన కథనంతో సినిమాకు ప్రత్యేకమైన టచ్ ఇచ్చారు. శివ కందుకూరి ఎనర్జిటిక్ స్క్రీన్ ప్రెజెన్స్ ఆకట్టుకోగా, వెంకటేష్ మహా, జీవన్ కుమార్ తదితరుల పాత్రలను కూడా గ్లింప్స్‌లో పరిచయం చేశారు.టెక్నికల్‌గా కూడా సినిమా ఆకట్టుకుంది. సినిమాటోగ్రాఫర్ జీవీ అజయ్ కుమార్ స్టైలిష్ విజువల్స్ అందించగా, ఓషో వి తన సంగీతంతో కథకు మరింత ఎనర్జీని జోడించారు. సూర్య పొన్నపల్లి ఎడిటింగ్ రేసీగా వుంది.డిఫరెంట్ కాన్సెప్ట్, క్విర్కీ క్యారెక్టర్స్, క్రైమ్‌కామెడీతో వచ్చిన ది ఫస్ట్ స్ప్రింకిల్ టాల్కమ్ పౌడర్‌పై ఆసక్తిని పెంచింది. ఈ న్యూ ఏజ్ క్రైమ్ డ్రామెడీ నవంబర్ 13న థియేటర్లలోకి రానుంది.

## 'కుకూన్స్' సినిమా పోస్టర్ లాంచ్



జగన్ జోగిరాజ్, సాగర్ కిరణ్, వికాస్ చైతన్య, సంగన దుగ్గ, సురభి దీప్తి, దీప్తి పద్మనిమ్మనగోటి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా 'కుకూన్స్'. ఈ చిత్రాన్ని న్యూ వేవ్ పిక్చర్స్, ఎం.ఆర్ట్స్ ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్స్ పై సుఖేష్ పొట్ల, మమత రెడ్డి కాసం, మహేశ్ గౌరి నిర్మిస్తున్నారు. డైరెక్టర్ మహేశ్ గౌరి దర్శకత్వం వహిస్తున్నారు . యూత్ తో పాటు ఫ్యామిలీ ఆడియెన్స్‌కు నచ్చే మంచి ఎంటర్ టైనర్ గా తెరకెక్కు తున్న ఈ సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ రోజు 'కుకూన్స్' చిత్ర పోస్టర్ ను బ్లాక్ బస్టర్ డైరెక్టర్ అనిల్ రావిపూడి రిలీజ్ చేశారు. అనంతరం డైరెక్టర్ అనిల్ రావిపూడి మాట్లాడుతూ 'కుకూన్స్' సినిమా పోస్టర్ రిలీజ్ చేయడం హ్యాపీగా ఉంది. ఈ పోస్టర్ కొత్తగా ఉండి ఆకట్టుకుంది. డైరెక్టర్ మహేశ్ గౌరి సరికొత్త ఆలోచనలు ఈ పోస్టర్‌లో తెలుస్తున్నాయి. టైటిల్ కూడా చాలా బాగుంది. ఈ సినిమాలో వన్ ఆఫ్ ది లీడ్ రోల్ చేసిన వికాస్ గతంలో డ్రామా జూనియర్స్ ప్రోగ్రాంకు మెంటార్ గా పనిచేశారు. ఇప్పుడీ చిత్రంతో నటుడిగా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. జగన్, సాగర్, వికాస్ తో పాటు మిగతా 'కుకూన్స్' టీమ్ అందరికీ నా బెస్ట్ విశెస్ తెలియజేస్తున్నా. అన్నారు.

## 'నా వైఫ్ మిస్సింగ్' త్వరలో స్ట్రీమింగ్



ఎప్పటికప్పుడు ఎగ్జైటింగ్ కంటెంట్‌తో సబ్ స్క్రైబర్స్ ను ఎంగేజ్ చేస్తోన్న ఆహా ఓటీటీ ఇప్పుడు మరో ఎగ్జైటింగ్ సిరీస్ ను మన ముందుకు తీసు కొస్తోంది. వరుణ్ సందేశ్, శ్వేతా బసు ప్రధాన పాత్రల్లో ఆహా ఒరిజినల్ 'నా వైఫ్ మిస్సింగ్' త్వరలో స్ట్రీమింగ్‌కు రెడీ అవుతోంది. ఈ సిరీస్ తెలుగుతో పాటు తమిళంలోనూ సబ్ స్క్రైబర్స్ కు అందుబాటులో ఉండనుంది. ప్రతి కేసుకు ఒక కథ ఉంటుంది, ఈ కేస్ లో నిజం ఏంటి అనే క్యాప్షన్ తో 'నా వైఫ్ మిస్సింగ్' అప్డేట్ ఇచ్చింది ఆహా. తన భార్య మిస్సయ్యిందంటూ వరుణ్ సందేశ్ పోలీస్ స్టేషన్ లో కంప్లైంట్ ఇవ్వడాన్ని గతంలో రివీల్ చేసింది ఆహా. ఇప్పుడా కేసులో ఉన్న నిజం ఏంటో సిరీస్ లో చూడాలనే క్యూరియాసిటీ ఆడియెన్స్ లో క్రియేట్ అవుతోంది. త్వరలో 'నా వైఫ్ మిస్సింగ్' స్ట్రీమింగ్ డేట్ ను ఆహా ఓటీటీ అనౌన్స్ చేయబోతోంది. కొత్త బంగారులోకం వంటి సూపర్ హిట్ సినిమా చేసిన పెయిర్ వరుణ్ సందేశ్, శ్వేతాబసు ప్రసాద్ లాంగ్ గ్యాప్ తర్వాత చేస్తున్న ప్రాజెక్ట్ ఇదే కావడం విశేషం.

3-10pg10.qxd:3-10pg10.qxd 1/1/02 7:09 AM Page 1



# వెస్టిండీస్‌తో నేడు మూడో వన్డే



## భారత్ తుది జట్టులో స్వల్ప ఛేంజింగ్స్

**న్యూఢిల్లీ:** వెస్టిండీస్‌తో మూడు వన్డేల సిరీస్‌లో అదరగొట్టిన టీమిండియా ఆఖరి పోరుకు సిద్ధమైంది. న్యూ చండీగఢ్ వేదికగా ఈ నెల 3వ తేదీన జరగనున్న నామమాత్రపు ఆఖరి వన్డేలో వెస్టిండీస్‌తో తలపడనుంది. విరాట్ కోహ్లి, శుభ్‌మన్ గిల్, రోహిత్ శర్మల విధ్వంసకర బ్యాటింగ్‌తో వరుసగా రెండు మ్యాచ్‌ల్లో గెలిచిన భారత్ ఇప్పటికే 2-0తో సిరీస్ కైవసం చేసుకుంది. న్యూ చండీగఢ్ వేదిక కూడా బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉంటుంది. ఈ ఆఖరి వన్డేలో కూడా బౌండరీ మోత మోగే అవకాశం ఉంది. ఇప్పటికే సిరీస్ గెలిచిన నేపథ్యంలో భారత తుది జట్టులో మార్పులు జరిగే అవకాశం ఉంది. బెంచ్ ఆటగాళ్లకు అవకాశం దక్కవచ్చు. వరుసగా రెండు మ్యాచ్‌ల్లో ఆడిన టీమిండియా స్టార్ ఓపెనర్ రోహిత్ శర్మకు విశ్రాంతి ఇచ్చే అవకాశం ఉంది. అతని స్థానంలో యశస్వి జైస్వాల్‌ను ఓపెనర్‌గా ఆడించవచ్చు. రోహిత్‌ను కొనసాగించాలనుకుంటే మాత్రం జైస్వాల్ బెంచ్‌కే పరిమితమవుతాడు. రెండో వన్డేలో రోహిత్ విధ్వంసకర శతకంతో చెలరేగాడు. వరుసగా సెంచరీ, డబుల్ సెంచరీ సాధించిన కెప్టెన్ శుభ్‌మన్ గిల్ సూపర్ ఫామ్‌లో ఉన్నాడు. రోహిత్‌ను తప్పించలేని పరిస్థితుల్లో జైస్వాల్‌కు అవకాశం ఇవ్వాలనుకుంటే, కెప్టెన్ గిల్ తన స్థానాన్ని త్యాగం చేయాల్సి ఉంటుంది. సూపర్ ఫామ్‌లో ఉన్న విరాట్ కోహ్లి ఫస్ట్ డౌన్‌లో ఆడనుండగా, నాలుగో స్థానంలో రుతురాజ్ గైక్వాడ్ బరిలోకి దిగనున్నాడు. రుతురాజ్, కేఎల్ రాహుల్, రవీంద్ర జడేజాలకు పెద్దగా బ్యాటింగ్ చేసే అవకాశాలు రాలేదు. ఆకీబ్ నబీకి మరో అవకాశం ఇస్తామని హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ఇప్పటికే స్పష్టం చేశాడు. కాబట్టి నితీష్‌రెడ్డి మరోసారి బెంచ్‌కే పరిమితం కానున్నాడు. తొలి రెండు వన్డేలకు దూరంగా ఉన్న మహమ్మద్ సిరాజ్ ఆఖరి వన్డే ఆడే అవకాశం ఉంది. ప్రసిధ్ కృష్ణ గాయంతో దూరమవగా, అతని స్థానంలో అన్షుల్ కాంబోజ్ జట్టులోకి వచ్చినా తుది జట్టులో చోటు కష్టమే. ప్రసిధ్ కృష్ణ స్థానంలో సిరాజ్ ఆడనుండగా, రెండో పేసర్ ఆకీబ్ నబీ, మూడో పేసర్‌గా గుర్నూర్ బ్రార్ బరిలోకి దిగనున్నారు. నితీష్‌ను ఆడించాలనుకుంటే గుర్నూర్ బ్రార్ బెంచ్‌కు పరిమితం కావాల్సి ఉంటుంది. నమన్ ధీర్, కుల్దీప్ యాదవ్, రవీంద్ర జడేజా స్పిన్ బాధ్యతలు పంచుకోనున్నారు. ధ్రువ్ జురెల్‌కు మరోసారి నిరాశే ఎదురవ్వనుంది.



### ఆసియా క్రీడలు బాక్సింగ్..
## పర్వీన్, లవ్లీనాలకు డబుల్ స్వర్ణం
### పురుషుల విభాగంలో అంకుష్‌కు పసిడి

**నిషియో:** ఆసియా క్రీడలు మహిళల, పురుషుల బాక్సింగ్స్ ఫైనల్లో శుక్రవారం ఒకే రోజు భారత్‌కు మూడు స్వర్ణపతకాలు లభించాయి. మహిళల బాక్సింగ్ ఫైనల్లో పర్వీన్ హుడా, లవ్లీనా బోర్గోహైన్‌లు రెండు స్వర్ణాలు గెలుచుకోగా, పురుషుల ఫైనల్‌లో అంకుష్ పంఘల్ స్వర్ణ పతకాన్ని దక్కించుకున్నాడు. మహిళల 65 కేజీల విభాగంలో భారత బాక్సర్ పర్వీన్ హుడా హోరాహోరీ ఫైనల్‌లో చైనీస్ తైపీ నీన్ చిన్ చెను ఓడించి స్వర్ణం కైవసం చేసుకుంది. 26 యేళ్ల పర్వీన్ తొలి రౌండ్‌ను 5-0 ఏకగ్రీవంగా, రెండవ రౌండ్‌లో కూడా 5-0తో గెలుచుకోవడంతో పోటీ ఫలితం ఫైనల్ రౌండ్‌కు చేరింది. నిర్ణయాత్మక రౌండ్‌లో ఆమె 3-2 తేడాతో విజయం సాధించి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. అలాగే లవ్లీనా బోర్గోహైన్ 75 కేజీల బాక్సింగ్ ఫైనల్‌లో చైనాకు చెందిన బావో జియిని 5-0 ఏకగ్రీవ నిర్ణయంతో ఓడించి స్వర్ణాన్ని సాధించింది. హోరాహోరీగా సాగిన తొలి రౌండ్‌ను 3-2 తేడాతో గెలుచుకున్న లవ్లీనా బౌట్‌లో ఆధిపత్యం చెలాయించింది. రెండు, మూడవ రౌండ్‌లలో ఆ 4-1 తేడాతో గెలుచుకుని విజయాన్ని ఖాయం చేసుకుంది. నలుగురు న్యాయనిర్ణేతలు ఈ బౌట్‌కు 29-28 స్కోరును ఆమెకు అనుకూలంగా ఇవ్వగా, ఒక న్యాయనిర్ణేత 30-27 తీర్పును వెలువరించారు. ఇక దక్షిణ కొరియాకు చెందిన మిన్సియోంగ్ కిమ్‌పై 4-0 తేడాతో విజయం సాధించి అంకుష్ పంఘల్ స్వర్ణ పతకాన్ని సాధించాడు. ఈ పోరులో ఐదుగురు న్యాయనిర్ణేతలలో నలుగురు ఈ పోటీకి 30-26 స్కోరును అతనికి అనుకూలంగా ఇవ్వగా, ఐదవ న్యాయనిర్ణేత 28-28 డ్రాగా నమోదు చేశారు.



### ఆసియా గేమ్స్ సెపక్‌టక్రాలో..
## భారత్ పురుషుల టీమ్‌కు కాంస్యం

**నగోయా:** ఆసియా క్రీడల సెపక్‌టక్రా పురుషుల క్వాడ్రంట్ ఈవెంట్ సెమీఫైనల్‌లో జపాన్ చేతిలో 0-2 తేడాతో ఓడిపోయిన భారత్ కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. నగోయా సిటీలో శుక్రవారం జరిగిన ఈ మ్యాచ్‌లో మలెంగన్బా సింగ్ సోరోఖైబామ్, రామ్ కుమార్ శర్మ, బాబీ కుమార్, ఆకాష్ యుమ్నామ్‌లతో కూడిన భారత క్వార్టెట్, హోరాహోరీగా జరిగిన సెమీఫైనల్‌లో జపాన్‌కు చెందిన యూకీ సాటో, రియోటా హారు హార, వటారు నరవా, యోటా ఇచికావాల చేతిలో 12-15, 13-15 తేడాతో ఓటమి పాలైంది. లోఖోన్ సింగ్ ఎలంగ్‌బామ్, టెకాంగ్ అరుణ్‌లు భారత్‌కు ప్రత్యామ్నాయంగా బరిలోకి దిగగా, సేయా టకానో, తోషిటకా నైటో జపాన్‌కు ప్రత్యామ్నాయంగా నిలిచారు. పురుషుల క్వాడ్రంట్ ఈవెంట్‌లో మూడు మ్యాచ్‌లలోనూ విజయం సాధించి భారత్ గ్రూప్ ఎలో అగ్రస్థానంలో నిలిచింది. గ్రూప్‌దశలో ప్రపంచ కప్ ఛాంపియన్ మయన్మార్‌పై ఈ జట్టు ఒక ముఖ్యమైన విజయాన్ని నమోదు చేయగా, వియత్నాం మరియు లావోస్‌లను ఓడించి సెమీఫైనల్స్‌కు చేరుకుంది. ఇక గ్రూప్ ఎ లో ఒక్క విజయం కూడా సాధించకుండా నాలుగో స్థానంలో నిలవడంతో భారత మహిళల క్వాడ్రంట్ ప్రచారం గ్రూప్ దశలోనే ముగిసింది. మహిళల డబుల్స్ జట్టు కూడా గ్రూప్ బి లో నాలుగో స్థానంలో నిలవగా, పురుషుల రెగ్యు జట్టు ఒక విజయం, రెండు ఓటములతో గ్రూప్ బిలో మూడో స్థానంలో నిలిచి నాకౌట్ దశకు చేరుకోవడంలో విఫలమైంది.

## ఆసియా గేమ్స్ రికర్వ్.. భారత్ జట్టుకు రజతం



**ఒకాజాకి:** ఆసియా క్రీడల పురుషుల రికర్వ్ టీమ్ ఈవెంట్ ఫైనల్‌లో, తొమ్మిది సార్లు ఛాంపియన్‌గా నిలిచిన దక్షిణ కొరియా చేతిలో 1-5 తేడాతో ఓడిపోయిన భారత్ జట్టు రజత పతకంతో సరిపెట్టుకుంది. ఒకాజాకిలో శుక్రవారం జరిగిన ఈ మ్యాచ్‌లో నీరజ్ చౌహాన్, యశ్‌దీప్ భోగే, ధీరజ్ బొమ్మదేవరలతో కూడిన భారత త్రయం, కిమ్ జే డియోక్, కిమ్ వూజిన్, లీ వూసోక్‌లతోకూడిన కొరియా జోడీని అధిగమించలేకపోవడంతో కొరియా తన ఆధిపత్యాన్ని కొనసాగిం చింది. భారత్, కొరియా జట్లు 56 పాయింట్లు సాధించి తొలి సెట్‌ను సమంగా పంచుకుని ఫైనల్‌ను ప్రారంభించాయి. తమ తొలి మూడు బాణాలతో 28 పాయింట్లు సాధించిన భారత ఆర్చర్లకు ఆ సెట్‌ను గెలుచుకునే అవకాశం లభించినప్పటికీ, వారు 10, 8, 9 పాయింట్లతో ముగించి స్కోరును సమం చేశారు. ఆ తర్వాత రెండో సెట్‌లో కొరియా ఒత్తిడి పెంచి, నాలుగు 10లు సాధించి 57-50 తేడాతో గెలుపొందింది. భారత్ నిలకడ కోసం ఇబ్బంది పడింది, యశ్‌దీప్, నీరజ్ చెరో ఎనిమిది నమోదు చేయగా, బొమ్మదేవర కూడా రెండు ఎనిమిది స్కోర్లు సాధించాడు. 1-3తో వెనుకబడిన భారత్, పోటీలో నిలవాలంటే మూడో సెట్ గెలవాల్సిన అవసరం ఏర్పడింది. భారత త్రయం తమ తొలి మూడు బాణాలతో 28 పాయింట్లు సాధించి, కొరియా స్కోరును సమంచేసింది. ఆ తర్వాత నీరజ్ ఏడు పాయింట్లు సాధించాడు. యశ్‌దీప్, బొమ్మదేవర వరుసగా తొమ్మిది, పది పాయింట్లు సాధించగా, కొరియా తమ చివరి మూడు బాణాలతో 28 పాయింట్లు సాధించి, సెట్‌ను 56-54 తేడాతో కైవసం చేసుకుంది.

## ఆసియా గేమ్స్ సెయిలింగ్.. నేత్రకు కాంస్యం



**గమగోరి:** భారత మహిళా నావికురాలు నేత్ర కుమనన్ శుక్రవారం ఐచినగోయా క్రీడల్లో మహిళల డింగీ విభాగంలో కాంస్య పతకం గెలుచుకోవడం ద్వారా, 12 యేళ్ల తర్వాత ఆసియా క్రీడల్లో పతకం సాధించారు. శుక్రవారం కైయో యాచ్ హార్బర్‌లో జరిగిన రెండు రేసుల ఫైనల్ సిరీస్ తర్వాత నేత్ర 14 నికర పాయింట్లతో ముగించింది. క్వాలిఫికేషన్ సిరీస్ నుండి తిరిగి లెక్కించిన ఏడు పాయింట్లతో నేత్ర ఫైనల్స్‌లోకి ప్రవేశించింది. ఫైనల్ 1లో ఆరవ స్థానంలో నిలిచి ఆరు పాయింట్లు జోడించుకున్న ఆమె, ఫైనల్ 2లో గెలిచి తన ఖాతాలో కేవలం ఒక పాయింట్ మాత్రమే చేర్చుకుంది. ఆమె హాంకాంగ్‌కు చెందిన స్టెఫానీ నార్టన్‌తో 14 నికర పాయింట్లతో సమంగా నిలిచినప్పటికీ, సిరీస్ మొత్తంలో మెరుగైన హెడ్ టుహెడ్ రికార్డును కలిగి ఉండటంతో టైబ్రేక్‌లో కాంస్యం కైవసం చేసుకుంది.



### ఆసియా గేమ్స్ హాకీ ..
## భారత్ మహిళల హాకీ టీమ్‌కు స్వర్ణం
### ఫైనల్లో 1-0తో చైనా ఓటమి

**కాకమిగహారా:** ఫైనల్‌లో చైనాను 1-0 తేడాతో ఓడించి, భారత్ 44 యేళ్ల నిరీక్షణకు తెరదించి ఆసియా క్రీడల మహిళల హాకీ జట్టు స్వర్ణాన్ని కైవసం చేసుకుంది. శుక్రవారం కాకమిగహారాలో జరిగిన ఈ మ్యాచ్‌లో భారత్ తరపున లాల్‌రెమ్సియామి 10వ నిమిషంలో నిర్ణయాత్మక గోల్ చేసింది. పట్టుదలగా ఆడిన చైనాను నిలువరించి, ఆసియా క్రీడల టైటిల్‌ను భారత్ తిరిగి కైవసం చేసుకోవడానికి ఈ ఫార్వర్డ్ చేసిన గోల్ సరిపోయింది. మ్యాచ్ ఆద్యంతం స్కోరును సమం చేయడానికి చైనా తీవ్రంగా ప్రయత్నించింది. పెనాల్టీ కార్నర్లు, పెనాల్టీ స్ట్రోక్‌తో సహా పలు అవకాశాలను సృష్టించుకుంది. కానీ భారత గోల్ కీపర్ సవిత పునియా, రక్షణ విభాగం దృఢంగా నిలబడి తమ స్వల్ప ఆధిక్యాన్ని కాపాడుకున్నారు. ఆఖరి నిమిషాల్లో చైనా తమ గోల్ కీపర్‌ను వెనక్కి పిలిచి, అదనంగా ఒక ఫీల్డ్ ప్లేయర్‌ను ముందుకు పంపింది, కానీ భారత్ గోల్స్ ఇవ్వడానికి నిరాకరించింది. ఈ విజయంతో 1982 తర్వాత భారతదేశానికి ఆసియా క్రీడల మహిళల హాకీలో తొలి స్వర్ణం సాధించింది.

## దలాల్ స్ట్రీట్‌కు షాకిచ్చిన పిబి ఫిన్‌టెక్




**ముంబయి, అక్టోబరు 2:** స్టాక్ మార్కెట్లో ప్రభుత్వ నియంత్రణ సంస్థల నిర్ణయాలు ఎంతటి దిగ్గజ కంపెనీనైనా క్షణాల్లో తలకిందులు చేయగలవనడానికి పాలసీబజార్ మాతృసంస్థ పిబి ఫిన్‌టెక్ తాజా సంక్షోభమే నిలువెత్తు నిదర్శనం. నిన్నమొన్నటి వరకు మార్కెట్ డార్లింగ్‌గా దూసుకెళ్లిన ఈ షేరుపై ఒకే ఒక్క ప్రతిపాదన పెను తుఫాను సృష్టించింది. కేవలం ఆరు ట్రేడింగ్ సెషన్లలోనే ఐదేళ్ల కష్టార్జితం, ఇన్వెస్టర్ల సంపద ఆవిరైపోయి, షేరు ఏకంగా ఐపిఓ ధర కంటే పాతాళానికి కుప్పకూలింది. 2025 జనవరిలో ఏకంగా రూ.2,254 గరిష్ట స్థాయిని తాకి ఇన్వెస్టర్లకు కాసుల వర్షం కురిపించిన పిబి ఫిన్‌టెక్ షేరు, ఈనెల ఒకటో తేదీకి రూ.984 వద్ద ముగిసింది. ట్రేడింగ్ సమయంలో ఒక దశలో కంపెనీ 2021 నాటి ఐపిఓ ఇష్యూ ధర అయిన రూ.980 కంటే దిగువకు పడిపోవడం దలాల్ స్ట్రీట్‌ను షాక్‌కు గురిచేసింది. కేవలం వారం వ్యవధి లోనే ఈ షేరు 17 శాతానికి పైగా కుదేలైంది. దీంతో ఐపిఓ అలాట్‌మెంట్ వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు లాభాలను చూసిన దీర్ఘకాలిక మదుపరులు సైతం ఒక్కసారిగా నష్టాల ఊబిలోకి జారుకున్నారు. ఈ భారీ పతనానికి అసలు సూత్రధారి బీమా రంగ నియంత్రణ సంస్థ ఐఆర్‌డిఎఐ జారీ చేసిన తాజా ముసాయిదా పత్రం అని తెలుస్తోంది. బీమా పాలసీల విక్రయాలపై ఏజెంట్లు, డిస్ట్రిబ్యూటర్లకు ఇచ్చే కమిషన్ల నిబంధనలలో సమూల మార్పులు చేయాలని ఐఆర్‌డిఎఐ ప్రతిపాదించింది. పాలసీబజార్ ప్రధాన ఆదాయ మార్గమే పాలసీల అమ్మకాల ద్వారా లభించే కమీషన్లు. కొత్త నిబంధనలు గనుక అమల్లోకి వస్తే సంస్థ వ్యాపార నమూనాకే పెద్ద దెబ్బ తగలడంతో పాటు, లాభాల్లో భారీ కోత పడటం ఖాయమని మార్కెట్ విశ్లేషకులు ఒక నిర్ణయానికి వచ్చారు. ఈ ముప్పును పసిగట్టిన పెద్ద ఇన్వెస్టర్లు, విదేశీ సంస్థలు ఒక్కసారిగా అమ్మకాలకు తెగబడటంతో కౌంటర్లలో నష్టాలు ఎదురయ్యాయి. స్టాక్ పతనాన్ని చూసి ప్రముఖ గ్లోబల్ బ్రోకరేజ్ సంస్థలు అప్రమత్తమై రేటింగులను దారుణంగా తగ్గించాయి. మూడు దిగ్గజ సంస్థలూ పీబీ ఫిన్‌టెక్ టార్గెట్ ధరను కేవలం రూ.1,150కే పరిమితం చేశాయి. దీన్నిబట్టి సమీప భవిష్యత్తులో ఈ షేరు కోలుకోవడం ఎంత కష్టమో అర్థం చేసుకోవచ్చు అని నిపుణులు చెపుతున్నారు. ఏ కంపెనీ వ్యాపారమైనా ఎంత అద్భుతంగా ఉన్నప్పటికీ, నియంత్రణ సంస్థల (రెగ్యులేటరీ) విధానాలు ఆ కంపెనీ మూలాలనే దెబ్బతీసే ప్రమాదం ఉందని పాలసీబజార్ ఉదంతం కళ్లకు కట్టింది.

# 4 రోజుల్లో రూ.34,965 కోట్లు ఎఫ్‌ఐఐల విత్‌డ్రా




**ముంబయి, అక్టోబరు 2:** భారత స్టాక్ మార్కెట్లలో విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల అమ్మకాలుజోరుగా సాగుతున్నాయి. ఎఫ్‌ఐఐలు రూ.9,484 కోట్ల విలువైన భారత ఈక్విటీలను విక్రయించారు. దీంతో వరుసగా నాలుగు ట్రేడింగ్ సెషన్లలో విదేశీ మదుపరుల మొత్తం విక్రయాలు దాదాపు రూ.34,965 కోట్లకు చేరాయి. ఎఫ్‌ఐఐల భారీ అమ్మకాలకు ప్రతిగా దేశీయ సంస్థాగత మదుపరులు కొనుగోళ్లను కొనసాగిస్తున్నారు. ఒకటోతేదీ డీఐఐలు రూ.10,042కోట్ల విలువైన షేర్లను కొనుగోలు చేసినట్లు ఎక్స్ఛేంజీల ప్రొవిజనల్ డేటా వెల్లడించింది. ఎఫ్‌ఐఐలు గతనెల30న రూ.10,148కోట్లు, అదే నెల 29న రూ.9,980 కోట్లు, 28న రూ.5,353 కోట్ల విలువైన షేర్లను విక్రయించారు. అక్టోబర్ 1న మరో రూ.9,484 కోట్ల విక్రయాలతో నాలుగు సెషన్లలో మొత్తం ఔట్‌ఫ్లో రూ.34,965 కోట్లకు చేరింది. భారత ఈక్విటీ మార్కెట్లలో కొనసాగుతున్న బలహీనత, అంతర్జాతీయంగా పెరిగిన క్రూడ్ ఆయిల్ ధరలు, అమెరికా ట్రెజరీ ఈల్డ్స్ పెరుగుదల, డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువపై ఒత్తిడి వంటి అంశాలు విదేశీ పెట్టుబడులపై ప్రభావం చూపుతున్నాయి.

సెప్టెంబర్ 30న ఎఫ్‌ఐఐలు రూ.10,148.41 కోట్ల విలువైన షేర్లను విక్రయించడం ప్రత్యేకంగా మార్కెట్ వర్గాల దృష్టిని ఆకర్షించింది. దాదాపు ఆరు నెలల కాలంలో ఇదే అతిపెద్ద సింగిల్‌డే ఔట్‌ఫ్లోగా నమోదైంది. అంతకుముందు సెప్టెంబర్ 29న ఎఫ్‌ఐఐలు రూ.9,980.22 కోట్ల షేర్లను విక్రయించారు.

రోజువారీ ఫ్లో డేటా ప్రకారం, మార్చి 23న నమోదైన సుమారు రూ.10,414 కోట్ల విక్రయాల తర్వాత సెప్టెంబర్ 30న నమోదైన విత్‌డ్రాలు అత్యధికం. ఆగస్టు 31న ఎంఎస్‌సీఐ రీబ్యాలెన్సింగ్ సందర్భంగా నమోదైన రూ.7,985.88 కోట్ల ఔట్‌ఫ్లోను కూడా సెప్టెంబర్ 30నాటి విక్రయాలు అధిగమించాయి. ప్రొవిజనల్ ఎక్స్ఛేంజ్ డేటా ప్రకారం, సెప్టెంబర్‌లో మొత్తం 21 ట్రేడింగ్ సెషన్లలో 16 సెషన్లలో ఎఫ్‌ఐఐలు నికర విక్రయ దారులుగా ఉన్నారు. ఎ విదేశీ మదుపరుల అమ్మకాల ఒత్తిడిని దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్ల కొనుగోళ్లు కొంతమేర సమతుల్యం చేస్తున్నాయి. అక్టోబర్ 1న డిఐఐలు రూ.10,042 కోట్ల పెట్టుబడులు పెట్టారు.

గతనెల 30న రూ.11,272 కోట్లు, 29న రూ.6,953 కోట్లు, 28న రూ.5,189 కోట్ల విలువైన షేర్లను డీఐఐలు కొనుగోలు చేశారు. ముఖ్యంగా గతనెల మొత్తం 21 ట్రేడింగ్ సెషన్లలోనూ డీఐఐలు నికర కొనుగోలుదారులుగా నిలిచారు. ఆ నెలలో వారి మొత్తం కొనుగోళ్లు దాదాపు రూ.76,030 కోట్లుగా నమోదయ్యాయి. ఎన్ఎస్‌డీఎల్ గణాంకాల ప్రకారం, 2026లో ఇప్పటివరకు విదేశీ మదుపరులు భారత ఈక్విటీల నుంచి దాదాపు రూ.2.69 లక్షల కోట్లను ఉపసంహరించుకున్నారు.

## ఐసిఐసిఐ లైఫ్ ఇన్సూరెన్స్‌కు కొత్త ఎండి, సిఇఒగా సిద్ధార్థ మిశ్రా

**ముంబయి, అక్టోబరు 2:** ఐసిఐసిఐ లైఫ్ ఇన్సూరెన్స్ మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా సిద్ధార్థ మిశ్రాను నియమించినట్లు కంపెనీ శుక్రవారం స్టాక్ ఎక్స్ఛేంజీలకు వెల్లడించింది. ఆయన ఐదేళ్ల కాలానికి ఈ పదవిలో కొనసాగ నున్నారు. కంపెనీ బోర్డు ప్రస్తుత ఎండీ, సిఇఒ అనూప్ బాగ్చీ రాజీనామాను ఆమోదించింది. సిద్ధార్థ మిశ్రాను అదనపు డైరెక్టర్‌తో పాటు ఎండీ, సిఇఒగా నియమించారు. ఈ నియామకం అక్టోబర్ 14, 2026 నుంచి లేదా ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా అనుమతి లభించే తేదీ నుంచి అమల్లోకి వస్తుంది. ఈ రెండింటిలో ఏది ఆలస్యమైతే ఆ తేదీ నుంచే నియామకం అమల్లోకి వస్తుందని కంపెనీ తెలిపింది. సిద్ధార్థ మిశ్రాకు బ్యాంకింగ్ రంగంలో 26 యేళ్లకు పైగా అనుభవం ఉంది. ప్రస్తుతం ఆయన ఐసిఐసిఐ బ్యాంక్‌లో డిజిటల్ ఛానల్స్ పార్ట్‌నర్‌షిప్స్, వాయిస్ ఛానల్, కస్టమర్ సర్వీస్, ఎన్ఆర్ఐ, ఐఎఫ్‌ఐజీ గ్రూప్‌లను పర్యవేక్షిస్తున్నారు. మిశ్రా భువనేశ్వర్‌లోని ఉత్కల్ యూనివర్సిటీ నుంచి సైన్స్‌లో బ్యాచిలర్ డిగ్రీతో పాటు ఫైనాన్స్ స్పెషలైజేషన్‌తో మేనేజ్‌మెంట్‌లో పోస్ట్‌గ్రాడ్యుయేట్ డిప్లొమా పొందారు. ఐసిఐసిఐ లైఫ్ ఇన్సూరెన్స్ ఎండీ, సిఇఒ పదవికి రాజీనామా చేస్తున్నట్లు అనూప్ బాగ్చీ తెలిపారు. సంస్థ వెలుపల కొత్త కెరీర్ అవకాశాన్ని కొనసాగించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. అక్టోబర్ 13, 2026న వ్యాపార సమయం ముగిసే నాటికి తన రాజీనామా అమల్లోకి వస్తుందని బాగ్చీ వెల్లడించారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఎండీ, సిఇఒగా అనూప్ బాగ్చీ నియామకానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆమోదం తెలిపింది. మూడు సంవత్సరాల కాలానికి ఆయన ఈపదవిలో కొనసాగనున్నారు.

ఆయన మూడేళ్ల పదవీకాలం ఈనెల 27, 2026 నుంచి ప్రారంభంకానుంది. 1992 నుంచి ఐసిఐసిఐ గ్రూప్‌లో.. అనూప్ బాగ్చీ 1992 నుంచి ఐసిఐసిఐగ్రూప్‌తో అనుబంధంగా ఉన్నారు. ట్రెజరీ, రిటైల్ బ్యాంకింగ్, హోల్‌సేల్ బ్యాంకింగ్, ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్, డిజిటల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ వంటి విభాగాల్లో ఆయన కీలక బాధ్యతలు నిర్వహించారు.



### రిజర్వుబ్యాంకు ఇడిగా
## సుధాకర్ మల్లి

**ముంబయి, అక్టోబరు 2:** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సుధాకర్ మల్లిని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా నియమించింది. ఈ నియామకం ఈనెల ఒకటోతేదీనుంచే అమల్లోకి వచ్చినట్లు ఆర్‌బిఐ శుక్రవారం తెలిపింది. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా సుధాకర్ మల్లి డిపార్ట్‌మెంట్ ఆఫ్ సూపర్‌విజన్ బాధ్యతలను పర్యవేక్షించనున్నారు. ఇంతకు ముందు ఇదే విభాగంలో చీఫ్ జనరల్ మేనేజర్ ఇన్‌చార్జ్‌గా పనిచేశారు. తాజాగా ఆయనకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పదోన్నతి లభించింది. సుధాకర్ మల్లి సుమారు మూడు దశాబ్దాలుగా సెంట్రల్ బ్యాంకింగ్ రంగంలో పనిచేస్తున్నారు. ఇందులో రెండున్నర దశాబ్దాలకు పైగా బ్యాంకులు, నాన్‌బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలు, సహకార బ్యాంకుల పర్యవేక్షణలో అనుభవం ఉంది. అలాగే విదేశాల్లోని పలు విభాగాల్లో లో సుమారు ఐదేళ్ల పాటు పర్యవేక్షణ బాధ్యతలు నిర్వహించారు. కరెన్సీ మేనేజ్‌మెంట్ విభాగంలోనూ ఆయన పనిచేసినట్లు ఆర్బీఐ తెలిపింది. సుధాకర్ మల్లి మెకానికల్ ఇంజినీరింగ్‌లో బీటెక్ పట్టా పొందారు.

## ఆర్బీఐ రెపోరేట్లపై మార్కెట్‌ల కలవరం




**ముంబయి, అక్టోబరు 2:** పండుగల సీజన్‌లో వడ్డీరేట్లు పెంపు తప్పదన్న సంకేతాలు వెలువడుతున్నాయి. ఈనెల 5 నుంచి 7 వరకు జరగనున్న ఆర్బీఐ ద్రవ్య పరపతి విధాన కమిటీ ఎంపీసీ కీలక భేటీపై ఇప్పుడు దేశవ్యాప్తంగా సామాన్యుల నుంచి కార్పొరేట్ దిగ్గజాల దాకా తీవ్ర ఉత్కంఠ నెలకొంది. మార్కెట్ వర్గాలను అత్యంత భయాందోళనలకు గురిచేస్తున్న అంశం ఒకటుంది. దాదాపు మూడేళ్లుగా, అంటే ఫిబ్రవరి 2023 తర్వాత ఆర్బీఐ ఎప్పుడూ రెపోరేటును పెంచలేదు. పైగా 2025లో ఏకంగా 125 బేసిస్ పాయింట్ల మేర కోత విధించి రుణగ్రహీతలకు ఊరటనిచ్చింది. ప్రస్తుతం రెపో రేటు 5.25 శాతంగా ఉంది. తాజా అంచనాల ప్రకారం దాదాపు 60 శాతం మంది ఆర్థిక నిపుణులు ఈసారి ఆర్బీఐ రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు పెంచి 5.50 శాతానికి చేర్చే అవకాశం ఉందని స్పష్టం చేశారు. ఇదే జరిగితే పండుగల వేళ హోమ్ లోన్లు, కార్ లోన్లు, పర్సనల్ లోన్లపై బ్యాంకులు వడ్డీరేట్లను పెంచడం ఖాయం. ఫలితంగా ప్రతి నెలా కట్టే ఇఎంఐల భారం ఒక్కసారిగా ఎగబాకనుంది. రిజర్వ్ బ్యాంక్ వడ్డీ రేట్లు పెంచే దిశగా ఆలోచించడానికి ప్రధాన కారణం ద్రవ్యోల్బణమే. దేశంలో రిటైల్ ద్రవ్యోల్బణం ఆగస్టు నాటికి 4.82 శాతానికి చేరింది. ఆర్బీఐ నిర్దేశించుకున్న 4 శాతం మధ్యకాలిక లక్ష్యాన్ని దాటి వరుసగా మూడో నెల కూడా ద్రవ్యోల్బణం పైపైకే దూసుకెళ్తోంది. అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు పెరగడం, డాలరుతో పోలిస్తే రూపాయి విలువ బలహీనపడటం, యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వంటి గ్లోబల్ బ్యాంకులు తీసుకుంటున్న కఠిన ద్రవ్య విధానాలు ఆర్బీఐపై ఒత్తిడి పెంచుతున్నాయి. ఈ ఉత్కంఠకు తెరదించుతూ ఆరుగురు సభ్యుల ఎంపీసీ కమిటీ ఈనెల 5 నుంచి చర్చలు జరపనుంది. అనంతరం అక్టోబర్ 7న ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ద్రవ్య విధాన నిర్ణయాలను అధికారికంగా ప్రకటించనున్నారు.

## మార్కెట్ల ఒత్తిడి పెరిగినా జోరుతగ్గని ఐపిఓలు

**ముంబయి, అక్టోబరు 2:** స్టాక్ మార్కెట్‌లో ఒత్తిడి కొనసాగుతున్నప్పటికీ ఐపిఓ (ఇనిషియల్ పబ్లిక్ ఆఫరింగ్) మార్కెట్ మాత్రం జోరుగా సాగుతోంది. గత యేడాది కాలంలో నిఫ్టీ 50 సూచీ దాదాపు 9.72 శాతం, ఈ యేడాది ఇప్పటివరకు 14.25 శాతం నష్టపోయినప్పటికీ ఐపిఓ మార్కెట్ మాత్రం బుల్ రన్‌లో కొనసాగుతోంది. గతనెలలో రూపాయి విలువ క్షీణించడం, బ్రెంట్ క్రూడ్ ధరలు పెరగడం, బాండ్ యీల్డ్స్ గణనీయంగా పెరగడం వంటి అంశాలు విస్తృత మార్కెట్లపై ఒత్తిడి పెంచాయి. ఐపిఓ మార్కెట్‌లో పెట్టుబడిదారుల ఆసక్తి తగ్గలేదు. గతనెలలో మొత్తం 34 మెయిన్‌బోర్డ్ కంపెనీలు తమ ఐపిఓలను ప్రారంభించి 39,380 కోట్లను సమీకరించాయి. ఈ ఏడాదిలో ఏ ఒక్క నెలలోనూ ఇంత భారీ మొత్తంలో నిధుల సమీకరణ జరగలేదు.

ఈ ఐపిఓ లకు నిర్ణయించిన మధ్యస్థ ధరఆదాయ నిష్పత్తి 42.5 రెట్లుగా ఉంది. ఆగస్టు 2026లో నమోదైన 33.7 రెట్లతో పోలిస్తే ఇది గణనీయంగా పెరిగింది. మార్కెట్‌లో ప్రధాన సూచీలు ఒత్తిడిని ఎదుర్కొంటున్నప్పటికీ, కంపెనీలు తమ ఐపిఓల ద్వారా భారీగా నిధులు సమీకరిస్తుండటం.. ప్రైమరీ మార్కెట్‌పై కొనసాగుతున్న పెట్టుబడిదారుల ఆసక్తిని వెల్లడిస్తోంది. 2026 క్యాలెండర్ ఇయర్‌లో ఇప్పటివరకు లిస్ట్ అయిన 59 కంపెనీల్లో, పిఇ మల్టిపుల్ వెల్లడైన సంస్థల్లో 13 కంపెనీలు 100 రెట్లకు పైగా రాబడులతో ట్రేడయ్యాయి. క్యాపిటలైన్ డేటా ప్రకారం ఈ ఏడాది ఇప్పటివరకు లిస్టైన కంపెనీల మధ్యస్థ పిఇ 34.76 రెట్లుగా ఉంది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 1 -187, Kushalpuram, Srikakulam Dist. PIN: 532005 Ph. 270684, 271144, 9848387562 Fax : 08942–271146, RNI No. AP TEL/2004/13708 Editor :*Damerla Sai Baba *Responsible for selection of News under the PRB Act. Regd.: No.J/RNP/VM111 Air Surcharge: Delhi : 40 Ps.